...ంగా సాగించే పోరాటం

...లపై పెట్టుబడిదారుల దా...

...వ్యవసాయ సమస్యపై కామ్రేడ్ లెనిన్

* నూతన ప్రజాతంత్రం : దాని రాజకీయ పునాదులు

20

1-8-49

జనత

మార్క్సిస్టు సిద్ధాంత పక్షపత్రిక

సంచిక 20	1—8—1949	వెల : 8 అణాలు

యుద్ధ ప్రమాదానికి వ్యతిరేకంగా సాగించే పోరాటం

★

ఇండియన్ యూనియన్ ప్రభుత్వం ఆంగ్లో - అమెరికన్ కూటమిలో చేరిపోయిందనే సాధారణ నినాదాలనూ, అమెరికా సామ్రాజ్యవాద ఆజ్ఞలననుసరించే నేడు ఇండియాలో నిర్బంధవిధానం కొనసాగించబడుతున్నదనే సాధారణ శబ్దజాలాన్నీ - వాటి యదార్థాన్ని రుజువు చేయడానికి అవసరమైన కారణాలను సహితం ఉదహరించే ప్రయత్నమైనా లేకుండా, అదే పనిగా పునశ్చరణచేసే ధోరణి కొంతమంది కామ్రేడ్సులో కనపడుతోంది. అంతేకాదు; ఇండియా ప్రభుత్వం సామ్రాజ్యవాదులతో చేతులు కలిపిందనే విషయాన్నీ, స్వతంత్ర విధానాన్ని అనుసరించడం లేదనే విషయాన్నీ దేశంలోని మెజారిటీ ప్రజలు - కాంగ్రెసును అనుసరించే ఛోటా బూర్జువా ప్రజలతోసహా యిదివరకే ఆమోదించినట్లుగా భావించి వాదనలను కొనసాగించడం కూడా జరుగుతోంది. ఖచ్చితమైన సంఘటనలను ఉదహరించి యివన్నీ యదార్థాలని రుజువుచేసే ప్రయత్నాలు దెబ్బకాచుకొనే స్థితి (డిఫెన్సివ్) అని విమర్శించబడుతున్నాయి. ఈ రకమైన కామ్రేడ్స్ కోరేదల్లా ఖండన పరంపరలు మాత్రమే. ప్రభుత్వ పాలసీవలన మనదేశ స్వాతంత్ర్యాన్ని, సర్వస్వాతంత్ర్య హక్కును కోల్పోతున్నామని చెప్పడం కూడా వీరి దృష్టిలో తెలివితక్కువే.

ఎందుకంటే అసలు స్వతంత్రం అంటూ ఒకటి మనకు వుంటేనా యిప్పుడు పోయేటందుకు అని వీరు వాదిస్తారు.

ఈవిధమైన వైఖరిని అవలంబించడమంటే యదార్థసంఘటనలను ఉదహరించి, సమస్యను ఎదుర్కొనే విషయంలో సరియైనపద్ధతి చేపట్టడానికి నిరాకరించడమేగాక బూర్జువావర్గంతో సాగించాల్సిన పోరాటాన్ని ఆచరణలో పరిత్యజించడమే అవుతుంది. అంతేకాదు; ఈ సమస్యలో - అది ఏ సమస్యఅయినా కానివ్వండి - బూర్జువావర్గాన్ని జయప్రదంగా ఎదుర్కోవాలంటే దానిని ప్రజలనుండి వేరుపరచడానికి అదేసమయంలో పోరాటాన్ని సాగించవలసిఉంటుందన్న విషయాన్ని గుర్తించలేక పోవడమే అవుతుంది. ఈ రెండుపోరాటాలను సమన్వయ పరచని పక్షంలో జనసామాన్యానికున్న జాతీయభావాలనూ, భ్రమలనూ అవకాశంగా తీసుకొని బూర్జువావర్గం ప్రజలతో సన్నిహిత బాంధవ్యాన్ని అట్టేపెట్టుకోవడానికి అవకాశంఉంటుంది.

ప్రపంచబూర్జువావర్గం పిచ్చికుక్కలా మరొక యుద్ధానికి సన్నాహాలు చేస్తున్న యీ నాడు భారతప్రజలకు తెలియకుండా ద్రోహబుద్ధితో భారతబూర్జువా సామ్రాజ్యవాదులతో కలసి సోవియట్ వ్యతిరేకయుద్ధానికి కుట్రలు పన్నుతున్న యీ సమయంలో 'ఆఫెన్సివ్' పద్ధతి అనే పేరుతో బూర్జువావర్గాన్ని ప్రజలనుండి వేరుపరచకుండా వారితో పోరాడటానికి సిద్ధపడటం చాల ప్రమాదకరంగా ఆత్మవినాశకరంగా పరిణమిస్తుంది.

ఈ విధమైన 'పెడదారి' పట్టడం (డీవియేషన్) ఆచరణలో పోరాటాన్నుండి పారిపోవడంతప్ప మరొకటికాదు. ఇటీవలనే "స్వాతంత్ర్యాన్ని" "స్వేచ్ఛ"ను సాధించుకున్నామని నమ్ముకునే దేశంలో- మొట్టమొదటిసారిగా జాతీయ ఉద్యమ నాయకులు ప్రభుత్వానికి అధినేతలైన దేశంలో "స్వతంత్ర" విదేశాంగ విధానాన్ని అనుసరిస్తున్నామనే భ్రమ ప్రజలలో ఎంత లోతుగా వుంటుందో యీ 'పెడదారి'పట్టిన కామ్రేడ్సు గుర్తించడం లేదు. అంతేకాక, యీ దేశ బూర్జువా వర్గం తన బానిస విదేశాంగ పాలసీ సరియైనదని చెప్పడానికి ఏరకంగా పాత సాంప్రదాయాలనూ, పేరుప్రఖ్యాతులను ఎంతటి చక్కటి పద్ధతులలో వినియోగించుకుంటుందో కూడా గ్రహించడములేదు. ఇంకా మూడోది: బూర్జువావర్గం మిత్రరాజ్యసమితిలో తాననుసరిస్తున్న వైఖరి స్వతంత్ర విదేశాంగవిధానమని ప్రజలకు నచ్చే పద్ధతులలో ఏవిధంగా పత్రికలనూ తన ప్రభుత్వాన్ని వినియోగించుకుంటుందో గుర్తించడానికి పూర్తిగా వారు నిరాకరిస్తున్నారు.

* * *

అయితే ఇక అంతర్జాతీయ బూర్జువా వర్గం ఏవిధంగా తన సోవియట్ వ్యతిరేకయుద్ధ ప్రచారాన్ని కొనసాగిస్తున్నది? సోవియట్ యూనియన్ ప్రతిష్ట పెరగడం మూలంగానూ, ప్రజానీకంలో ప్రజాస్వామిక భావాలూ, సోషలిస్టు చైతన్యమూ పెంపొందడంమూలంగానూ, అంతర్జాతీయ సంఘటిత భావాలు ప్రజలలో వ్యాపించడంమూలంగానూ వారు సోవియట్ వ్యతిరేక ప్రచారాన్ని బహిరంగంగా చేయడం తేలికైన పనికాదు. అందువలన బూర్జువావర్గం సరిగ్గా యీ వాస్తవిక విషయాలను దృష్టిలో వుంచుకొని ప్రజాస్వామిక సిద్ధాంతానికీ, అంత

జాతీయ సహకారానికి తాము రక్షకులైనట్లు నటించుతూ, పైగా సోవియట్ యూనియన్ నిరంకుశ రాజ్యమైనట్లూ అది సంకుచిత జాతీయ తత్వంతో దురాక్రమణ యుద్ధానికి కాలుదువ్వుతున్నట్లూ చిత్రించి, ప్రచారం చేస్తుంది. అది సమస్యను గందరగోళపరచి, ప్రజలను పెడత్రోవలో పెట్టడానికి ప్రయత్నించే మాట వాస్తవమే. పైపెచ్చు బూర్జువావర్గం ఆటంబాంబును చేతబట్టుకొని యుద్ధ వ్యతిరేకులను 'మీరు సోవియట్ వ్యతిరేక సంఘటనలో చేరకపోతే భయంకరమైన భీభత్సానికి గురికాక తప్పద'ని బెదిరించుతుంది. దీర్ఘకాలయుద్ధపు ఘోరాలను చవిచూసిన ప్రజలను ఇది త్వరలో ముగిసేయుద్ధమని నమ్మించడానికి ఆటంబాంబును ఒక సాకుగా చూపెడుతుంది.

తొమ్మిది పార్టీల సమావేశంలో "అంతర్జాతీయపరిస్థితిపై" రిపోర్టునిస్తూ కామ్రేడ్ జదనోవ్ యీరకమైన బూర్జువావర్గ ఎత్తుగడల విధానాన్ని ఎంతో స్పష్టంగా బట్టబయలు చేశాడు.

"యూరప్‌ను బానిసత్వంలో ముంచడానికిచేసే కుట్రలతోపాటు సామ్రాజ్యవాదులు జాతీయ సర్వస్వాతంత్ర్య హక్కును హరించడానికి సైద్ధాంతిక ప్రచారాన్ని కూడ ప్రారంభించారు. "ప్రపంచ ప్రభుత్వం" అనే సిద్ధాంతానికి వ్యతిరేకంగాబట్టి అన్ని జాతులూ తమ సర్వస్వాతంత్ర్యహక్కులనూ వదలుకోవాలనే విజ్ఞాపనచేయడం ఆరంభించారు. వివిధజాతుల సర్వస్వాతంత్ర్య హక్కులను దారుణంగా అతిక్రమించుతున్న అమెరికా సామ్రాజ్యవాదపు అంతులేని దురాక్రమణ వ్యాప్తిని మరుగుపరచడానికే యీ సిద్ధాంతం లేవదీయబడింది. ఇదేకాక అమెరికాను యావత్తు జగత్తు రక్షకురాలుగా చిత్రించి, అమెరికాదురాక్రమణను ప్రతిఘటించే వారందరినీ "సంకుచిత" జాతీయవాదంలో విశ్వాసమున్నవారుగా ప్రచారం చేయబడుతున్నది. అమెరికాసామ్రాజ్యవాద వ్యాప్తికి అడ్డుపడుతున్న జాతుల సర్వస్వాతంత్ర్య హక్కుసూత్రాన్ని సైద్ధాంతికంగా ఎదుర్కొనాలనే దుర్బుద్ధితోనే యీ "ప్రపంచ ప్రభుత్వం" అనే సిద్ధాంతాన్ని బూర్జువా మేధావులూ, కొంతమంది నిరాశావాదులూ లేవదీశారు. చిన్నా పెద్దా అనే తారతమ్యం లేకుండా అన్నిజాతుల న్యాయమైనహక్కుల రక్షణకూ, జాతుల సమానత్వ సూత్రానికి ఖచ్చితంగా ఎల్లప్పుడూ నిలబడే సోవియట్ యూనియన్‌కు వ్యతిరేకంగాకూడా ప్రధానంగా యీ నినాదం లేవదీయబడింది. ప్రస్తుత పరిస్థితులలో సామ్రాజ్యవాద దేశాలైన అమెరికా, బ్రిటన్,

వాటితో సహకరించే యితర దేశాలూ జాతీయ స్వాతంత్ర్యానికీ, జాతుల స్వయంనిర్ణయ హక్కుకూ ప్రమాదకరమైన శత్రువులుగా పరిణమిస్తాయి.”

[జదనోవ్, 31 వ పేజీ]

అంతర్జాతీయ సహకారం యెడల ప్రజలకున్న సద్భావాలను దురాక్రమణ పూరితమైన బూర్జువావర్గం తన స్వప్రయోజనాలకు వినియోగించుకుంటోంది. మిత్రరాజ్యసమితిద్వారా, దాని ఉపసంఘాల ద్వారా అంతర్జాతీయ సహకారం కావాలని పైకి బాగా కనబడే బూటకపు ప్రతిపాదనలను ప్రతిపాదించుతుంది. ఈ ప్రతిపాదనలు అంగీకరించబడితే సోవియట్ యూనియన్, నూతన ప్రజాతంత్ర రాజ్యాలూ సామ్రాజ్యవాద ప్రపంచ పరిధిలోకి యీడ్వబడతాయి. పరమాణువుశక్తి పరిశోధన విషయంలో అంతర్జాతీయ సహకారం పేరిట బూర్జువావర్గం సోవియట్ యూనియన్ లోని ముడిపదార్థాలపై కంట్రోలు సంపాదించడానికి ప్రయత్నించుతోంది. మిత్రరాజ్యసమితిలోనూ, దాని ఉపసంఘాలలోనూ కేపిటలిస్టు కూటమికి మెజారిటీ వుండటాన్ని ఆసరాగా చూసుకొని, సోవియట్ లోని ముడిపదార్థాలపై తమ ఆధిపత్యం సాధించడానికి ఉద్దేశించుతోంది. ఈ రకంగా ప్రజలను మోసం చేయవచ్చునని భావించుతోంది. ప్రతిసారీ తమ ప్రతిపాదనకు మెజారిటీ ఉన్నదనీ, సోవియట్ యూనియన్, నూతన ప్రజాతంత్ర రాజ్యాలు మాత్రమే వ్యతిరేకించుతున్నాయని సాకుచెప్పుతారు. అయితే మిత్రరాజ్యసమితి కేపిటలిస్టు ప్రభుత్వాల మెజారిటీతో నిండివున్నదనీ, అవి సోవియట్ కూ, అభివృద్ధిచెందుతున్న సోషలిస్టు శక్తులకూ వ్యతిరేకంగా ఐక్యంతో పనిచేస్తున్నాయనే యదార్థ విషయాన్నీ పోరాటంయొక్క వర్గస్వభావాన్ని జాగ్రత్తగా మరుగుపరుస్తారు. ఈ విషయాన్ని ఏ సమస్యకాసమస్యను ప్రత్యేకంగా తీసుకొని బూర్జువా ప్రచారాన్ని పటాపంచలు చేయవలసి ఉంటుంది. ఆంగ్లో-అమెరికన్ కూటమి - యుద్ధకూటమి - యీారకమైన సిద్ధాంతప్రచారంపై ఆధారపడుతూ కొంత ప్రజా సహకారాన్ని సంపాదించుకోడానికిప్రయత్నించుతోంది. దానిని పూర్తిగా బట్టబయలు చేయవలసి ఉంది. ఆంగ్లో - అమెరికన్ కూటమిని గురించి జనరల్ గా మాట్లాడుతూ, అది ఖచ్చితంగా ఏ ప్రాతిపదికపై నిర్మించబడుతున్నదో గుర్తించనివారు దానిని ప్రతిఘటించలేరు సరిగదా యుద్ధోన్మాదులకే సహాయ పడతారు.

సోవియట్ వ్యతిరేకప్రచారం మరొక నూతనస్వరూపంకూడా తీసుకొంటుంది. ప్రజలలో శాంతియెడల వున్న అభిమానాన్ని పురస్కరించుకొని సోవియట్ యూనియన్ కు దురాక్రమణ వాంఛ వున్నట్లు దుష్ప్రచారంలేవదీయబడుతుంది.

కామ్రేడ్ జదనోవ్ యిలాఅన్నాడు:

“ప్రపంచాధిపత్యానికి అర్రులుజాస్తూ, ప్రజాతంత్ర వ్యతిరేక పాలసీని అనుసరిస్తున్న అమెరికాకు సిద్ధాంత పోరాటంకూడ అవసరమైంది. సోవియట్ యూనియన్ కూ, నూతనప్రజాతంత్ర రాజ్యాలకు దురాక్రమణ ఉద్దేశ్యాలను

అంటగట్టి వాటిపై నిందల నారోపించి, ఆ విధంగా ప్రజలను మోసపుచ్చడానికే అమెరికా వ్యూహంలోని యీ సిద్ధాంత పోరాటంయొక్క ప్రధానోద్దేశ్యం. నూతన యుద్ధానికి జరిగే సన్నాహాలతో ఆంగ్లో-శాక్జన్ కూటమికి ఎలాంటిబాధ్యతలేదనీ అది ఆత్మరక్షణకు మాత్రమే ప్రయత్నించుతున్నదనే ప్రచారం ప్రజలలో చేయబడుతుంది. రెండో ప్రపంచ యుద్ధకాలంలో సోవియట్ యూనియన్ ప్రతిష్ట విదేశాలలో విపరీతంగా హెచ్చింది. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా అకుంఠిత విశ్వాసంతో అదిజరిపిన వీరోచిత పోరాటం అన్ని దేశాలలోని శ్రామికప్రజల ప్రేమనూ, గౌరవాన్నీ చూరగొన్నది. సోషలిస్టు రాజ్యంయొక్క మిలిటరీ, ఆర్థికమహత్తరశక్తి, సోవియట్ సమాజంలోని నైతిక రాజకీయ ఐక్యతలోని అజేయశక్తి యావత్తు ప్రపంచానికి ప్రత్యక్షంగా బోధపడింది. సోవియట్ విధానం యెడల ప్రపంచశ్రామిక ప్రజలలో ఏర్పడిన యీసద్భావాన్ని పోగొట్టడానికి అమెరికా బ్రిటన్‌లలోని అభివృద్ధి నిరోధకవర్గాలు ఆతురతపడుతున్నాయి. సోవియట్ యూనియన్‌కు వ్యతిరేకంగా తమ సైనికులు పోరాడేటట్లు చేయాలంటే ముందుగా సిద్ధాంతరీత్యా దీర్ఘంగా ప్రయత్నాలు చేయడం అవసరమని యుద్ధోన్మాదులు పూర్తిగా గుర్తించారు.”

(జదనోవ్ - పేజీ 21)

సోవియట్ యూనియన్‌కు దురాక్రమణ యుద్ధవాంఛను అంటగట్టి, దానిపై యుద్ధోన్మాదులు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని పూర్తిగా బట్టబయలు చేయాలి. దీనిని సామ్రాజ్యవాద కూటమికి వ్యతిరేకంగా జరిపే పోరాటంలో ఒక అత్యంత ప్రధాన భాగంగా ఎంచుకొని పనిచేయాలి. దీనిని గుర్తించ నిరాకరించి వూరికే ఆంగ్లో - అమెరికన్ యుద్ధ కూటమిని గురించి పెద్దగా ఆందోళన చేయడంతోనే తృప్తిపడితే మనం యుద్ధోన్మాదులకే సహాయపడినవారమవుతాం.

సామ్రాజ్యవాదులు సిద్ధాంతరీత్యా మరొకవిధంగాకూడా సోవియట్ యూనియన్‌ను ఎదుర్కొంటున్నారు. ఇదేమంటే ప్రజలలో ప్రజాతంత్రం అంటే బూర్జువా దృక్పథమే మనస్సులో వుండటాన్ని ఆసరాగా తీసుకొని ప్రజల ప్రజాతంత్ర ఫాసిస్టు వ్యతిరేక భావాలకు

విజ్ఞప్తి చేయడానికి బూర్జువావర్గం పూనుకున్నది.

"రాజకీయ సమస్యలలో ఎక్కువ లోతుపాతులు తెలియని అమెరికా సామ్రాజ్యవాదులు తాము సోవియట్ యూనియన్‌కు వ్యతిరేకంగా సాగించే సైద్ధాంతిక పోరాటంలో సోవియట్ యూనియన్ ప్రజాతంత్రరాజ్యం కాదనీ, నియంతృత్వ రాజ్యమనీ అమెరికా బ్రిటన్‌లలోనూ, ఇతర కేపిటలిస్టు ప్రపంచంలోనూ, మాత్రమే ప్రజాతంత్రం ఉంటుందనీ ప్రచారం చేస్తారు. ఈ విషయానికి వారు ప్రధాన ప్రాముఖ్యతనిచ్చి తమ తెలివితక్కువదనాన్ని ప్రదర్శించుకొంటారు. ఈ సిద్ధాంత పోరాట వేదికపైన - బూర్జువా బూటక - ప్రజాతంత్రాన్ని సమర్థించడంలోనూ, కమ్యూనిజం నిరంకుశమని ఖండించడంలోనూ కార్మికవర్గ శత్రువులంతా - ఎలాంటి మినహాయింపు లేకుండా బడాపెట్టుబడిదారుల నుండి మితవాద సోషలిస్టు నాయకులవరకూ ఐక్యమవుతారు... ఈ ప్రచారంయొక్క సారాంశమేమంటే నిజమైన ప్రజాస్వామికంలో ఒకటికంటె ఎక్కువ పార్టీలుండాలనీ, సంఘటిత వ్యతిరేక మైనారిటీ అంటూ ఒకటుండాలనీ, ఇదీ వారి ప్రజాతంత్రానికి గీటురాయి ..."

(జదనోవ్ పేజి 30)

బూర్జువా ప్రజాతంత్రంయొక్క గుట్టును బట్టబయలు చేయడం, సోవియట్ ప్రజాతంత్రానికి వ్యతిరేకంగా జరిగే బూర్జువా విషప్రచారాన్ని దుయ్యబట్టడం - వీటిని కూడా యుద్ధకూటమికి వ్యతిరేకంగా సాగించే పోరాటంలో ప్రధానభాగంగా ఎంచుకోవాలి. ప్రపంచ బూర్జువా ప్రజల మనస్తత్వాన్ని అనుసరించి తెలివిగా తన ప్రచార పద్ధతులను నిర్ణయించుకొని పోరాడుతుందని దీనినిబట్టి మనంస్పష్టంగా తెలుసుకోవాలి. అంతేకాదు. అది అవసరాన్నిబట్టి తన ప్రచార పోరాట పద్ధతులను మార్చుకొనడానికి వెనుదీయదు. కాని దీనియంతటిని గమనించకుండా "ఓ! మీరు నిజంగా యుద్ధకూటమికి చెందినవారేనని" అన్నింటికీ ఒకేమోటు సమాధానంచెప్పే కామ్రేడ్సు కొంతమంది ఉన్నారు.

దీనితోపాటు సామ్రాజ్యవాదులు తమ మార్షల్ ప్లాను ననుసరించి వివిధ దేశాలను ఆర్థిక బానిసత్వంలో ముంచడానికే చేసే ప్రయత్నాలనూ, కుట్రలనూ ఖచ్చితమైన వుదహారణలను తీసుకొని ఎప్పటికప్పుడు బట్టబయలుచేయాలి.'పశ్చిమయూనియన్'

మొదలుగాగల యుద్ధ కూటముల నగ్న స్వరూపాన్ని ఎత్తి చూపాలి.

భారతదేశంలోకూడా బూర్జువావర్గం ప్రజల మనస్తత్వాన్ని దృష్టిలో వుంచుకొని పైన ఉదహరించిన అన్ని పద్ధతులనూ తెలివితేటలతో అనుసరించుతోంది. వాటితోపాటు నేటి పరిస్థితిలో మన జాతీయ ప్రత్యేక స్వభావాన్నికూడా వినియోగించుకొంటుంది. వీటన్నింటినీ ఒక క్రమపద్ధతిలో బట్టబయలు చేయాలి.

మొట్ట మొదట్లో బూర్జువావర్గం ఆంగ్లో-అమెరికన్ కూటమితో చేతులు కలిపే ప్లానుతో బహిరంగంగా ముందుకు రాలేకపోయింది. ఎందువల్లనంటే ప్రజలలో సామ్రాజ్యవాద వ్యతిరేక మనస్తత్వం ఉంది. రెండోది; తానే స్వయముగా సామ్రాజ్యవాదులతో లాభసాటి బేరానికి బేరాలాడుతోంది. అందువలన అది అందు కనుగుణ్యమైన నటన ప్రారంభించింది. స్వతంత్ర విదేశాంగ విధానాన్ని - రెండుకూటములకు సంబంధం లేని ప్రత్యేక స్వతంత్రపంథాను అనుసరిస్తూన్నాననే 'పోజు' పెట్టింది. ఈ విధముగా భారత బూర్జువా రెండూ "కూటము"లకు సంబంధంలేని స్వాతంత్ర్య భావానికి కట్టుబడియున్నట్లు నటించుతోంది. ఈ నటనద్వారా బూర్జువావర్గం విదేశీ సామ్రాజ్యవాదులతో సంబంధంలేని నిజమైన స్వతంత్ర విదేశాంగ పాలసీ యెడల ప్రజలలోగల న్యాయమైన భావాలనూ, ప్రజల స్వతంత్రేచ్ఛను చక్కగా వినియోగించుకోగలుగుతున్నది. దీనితో పాటు భారత ప్రజలలో అగ్రరాజ్యాల యెడల సాంప్రదాయసిద్ధంగా వస్తున్న అనుమానాలనుకూడా తెలివిగా వినియోగించుకొంటున్నది. ఈ సందర్భంలో అగ్రరాజ్యాలలో ఒకటైన సోవియట్ యూనియన్‌నుకూడా సామ్రాజ్యవాద రాజ్యాలతో తెలివిగా కలిపి ప్రచారం చేయడం ప్రారంభించింది.

*　　*　　*

ఈ పరిస్థితులలో మొట్టమొదట దాని "స్వతంత్ర విదేశాంగ పాలసీ" ఎంత అయినా - సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడటానికీ, ప్రజాస్వామిక, సోషలిస్టు దేశాలతో సహకరించడానికీ నిరాకరించు తున్నదనీ - యీవిధమైన స్థితిలో వుండటమే ఒక కూటమిలో చేరడానికి ప్రారంభమనీ బూర్జువావర్గాన్ని బట్టబయలు చేయాలి. దానితోపాటు రెండుకూటములూ ఆధిపత్యానికి ప్రాకులాడే స్వభావానికి చెందినవికావనీ - అందులో ఒకటి ప్రజాశిబిరమని, రెండోది సామ్రాజ్యవాద శిబిరమనే యదార్థాన్ని నొక్కి వక్కాణించి, రుజువుచేసి, బూర్జువా పాలసీని తూర్పారబట్టాలి.

రెండు: ఇండియా ప్రభుత్వం "స్వతంత్ర" పాలసీని అనుసరించుతున్నానని చెప్పుతూ, ఆచరణలో ఏమిచేస్తున్నదో - మిత్రరాజ్యసమితిలో జరిగిన మీటింగు సందర్భంలో పిల్ల అసెంబ్లీ, కొరియా, గ్రీస్ మొదలుగాగల సమస్యలపై ఎలా సామ్రాజ్యకూటమి ప్రయోజనాలకు వినియోగపడ్డదీ ఉదాహరణలతో సహా రుజువుచేసి చూపెట్టాలి.

మూడు: ప్రతి సమస్యపైనా సోవియట్ యూనియన్ అవలంబించిన వైఖరి ఎలా ప్రజాతంత్రబద్ధమో, ఆ వైఖరి ఇండియాతోసహా ప్రపంచ ప్రజలందరి ప్రయోజనాలకు ఏవిధంగాఅనుకూలమోచెప్పాలి. సోవియట్ వైఖరికి సామ్రాజ్యవాద రాజ్యాల వైఖరి ఎలా భిన్నమో తెలియ

చేయాలి. ఆవిధంగా రెండు శిబిరాలనూ-ఒకటి ప్రజాతంత్ర శిబిరంగానూ రెండోది సామ్రాజ్యవాద శిబిరంగానూ రుజువుచేసి చూపెట్టాలి.

చివరకు దక్షిణాఫ్రికాలోని భారతీయుల సమస్యలాంటి సమస్యలను ఉదాహరణగా తీసుకొని ఇండియన్ యూనియన్ ప్రభుత్వాన్నీ, సామ్రాజ్యవాదులను - ఉభయుల పాలసీని బట్టబయలు చేయాలి. ఇక్కడ ఒకటి గుర్తించాలి. జాతులసమానత్వంకోసం ప్రవేశపెట్టబడిన ప్రతి ప్రతిపాదననూ సామ్రాజ్యవాద ప్రభుత్వాలు ఖచ్చితంగా ఎల్లప్పుడూ వ్యతిరేకించుతూ వచ్చాయి. రెండోవైపున సోవియట్ యూనియన్ ఎల్లప్పుడూ ఖచ్చితంగా ఇండియానూ, జాతుల సమానత్వాన్ని బలపరుస్తూ వచ్చింది. అయినప్పటికీ యితర సమస్యలపై ఇండియా ప్రతినిధులు సోవియట్‌తోగాక సామ్రాజ్యవాద జాతి విద్వేషకులతో ఓటుచేస్తూ వచ్చారు.

ఈ విధంగా భారతప్రజల యెదుట రెండు శిబిరాలనుగురించీ - వాటి వైఖరి, అనుసరిస్తున్న పాత్రనూ వివరించాలి. ఇండియా ప్రభుత్వ పాలసీ నిజస్వభావాన్ని బట్టబయలు చేయాలంటే యిదొక్కటేమార్గం. రెండు శిబిరాలు ఒకే రకానికి చెందినవనీ, రెండూ ప్రపంచాధిపత్యానికే తంటాలు పడుతున్నాయనే ప్రచారాన్ని తప్పనీ ఉదాహరణలతో నిరూపించాలి. అంతేకాని ఇండియన్ యూనియన్ ప్రభుత్వం యిప్పటికే ఆంగ్లో - అమెరికన్ కూటమిలో చేరిపోయిందని వూరికే చెప్పినంతమాత్రంచేత ఏమాత్రం ప్రయోజనంలేదు.

వీటన్నింటిద్వారా ఇండియా ప్రభుత్వము నేడనుసరిస్తున్న పాలసీ భారత ప్రజల ప్రయోజనాలకి పూర్తిగా విరుద్ధమనే సంగతిని తిరిగి తిరిగి రుజువుచేయాలి. ఆ విధానం భారత ప్రజల స్వేచ్ఛనూ, సర్వస్వాతంత్ర్య హక్కునూ పరిత్యజించడమే గాక అమ్మివేస్తున్నదని వివరంగా తెలియజెప్పాలి.

కామన్‌వెల్తు సమస్య ఎజెండాలో వెంటనే పరిష్కరించవలసిన సమస్యగా బయటకు రావడంతో బూర్జువా పాలసీలో రెండోదశ ఆరంభమైంది. ఇప్పటివరకూ దాదాపు అన్ని సమస్యలలోనూ ఆంగ్లో - అమెరికన్ కూటమిని బలపరుస్తూ ఇక జాతీయ బూర్జువా ప్రత్యేకభారతీయ పద్ధతి (లేక బ్రిటిష్ డొమినియన్)లో సామ్రాజ్యవాద కూటమిలో- బ్రిటిష్ కామన్‌వెల్తుద్వారా చేరడానికి తయారైంది. బ్రిటిష్ కామన్‌వెల్తులో ఇండియా ఏ సాకుతో చేరింది? అంతర్జాతీయసహకారం- ప్రజలలో వున్న యీ భావాన్ని ఆధారంచేసుకొని కామన్‌వెల్తులో చేరింది. (కామన్‌వెల్తు సమావేశానికి ముందు నెహ్రూప్రసంగం) అయితే యీ సహకారం మరొకరాజ్యానికి - లేక దురాక్రమణ రాజ్యానికి (సోవియట్ యూనియన్) వ్యతిరేకంగా అన్న భావం-అదిబయటకువెలిబుచ్చకపోయినా-వుండకపోలేదు. కాని యీ బ్రిటిష్ కామన్‌వెల్తు సహకారం అమెరికా, సోవియట్ యూనియన్‌లు ఉభయులకు వ్యతిరేకమేనని ప్రజలునమ్మేటట్లు చూశారు.

యుద్ధశిబిరంలో ఇండియా చేరడాన్ని వ్యతిరేకించే పోరాటంలో యీ అంతర్జాతీయ సహకారంయొక్క వర్గస్వభావాన్ని ఒక భాగంగా ఎంచి బట్టబయలు

చేయాలి. దానిని భారతప్రజల స్వేచ్ఛనూ సర్వస్వాతంత్ర్య హక్కునూ నీళ్ళుగార్చి సామ్రాజ్యవాదులయుద్ధకూటమిలో ఇండియాను చేర్చినట్లు తూర్పారబట్టాలి.

కామన్‌వెల్తు సమావేశం అనంతరం ఇండియా ప్రభుత్వ వైఖరి దాదాపు బహిరంగంగానే బయటపడే దశకు వచ్చింది. ఇది చైనా విముక్తి సైన్యాల మహత్తర విజయాలూ, ఆ తరువాత దానితోపాటు బర్మాలోని విప్లవ వెల్లువా, మలయా తిరుగుబాటుతో మరింత బట్టబయలు అయింది ఇండియా ఏదో ఒక పేరున కామన్‌వెల్తులో ఒక భాగిమైపోయింది. ఆగ్నేయాసియా దేశాలలోని కమ్యూనిస్టులు విదేశాలనుండి నడిపించబడుతున్నారని చెప్పడంతో నెహూ్రు బహిరంగంగానే బయటపడ్డాడు. ప్రపంచ కమ్యూనిస్టు వ్యతిరేక, సోవియట్ వ్యతిరేక సంఘటనలో ఇండియా ఒక భాగంగా బహిరంగంగా బయటకు రావడానికి యిది ఒక మెట్టు. అందువలన ఇండియాకు సోవియట్‌నుండే ప్రమాదం వుందని యిక భారతీయ పత్రికలు బహిరంగంగా వ్రాయడం తొందరలోనే మనం చూడగలం. అంతేకాదు; భారత కమ్యూనిస్టుపార్టీ సోవియట్ పంచమాంగదళమని జనరల్ ప్రచారంకూడా ప్రారంభమవుతుంది. అందువలన యుద్ధకూటమి నిర్మాణాన్ని గురించి మరొకసారి యీ క్రింది విషయాలను దృష్టిలో వుంచుకొని బట్టబయలుచేయాలి. కామన్‌వెల్తులో చేరడం స్వదేశంలోని ప్రజాతంత్ర సోషలిస్టు పోరాటాలను అణచివేయడానికి నాందిగా జరుగుతున్న యీ కమ్యూనిస్టు వ్యతిరేక వేట, అంతర్జాతీయ రంగంలో పెట్టుబడిదారీ వ్యవస్థ రక్షణకు పూనుకోవడం, భారత ప్రజలను బానిసత్వంలో ముంచివేసి పెట్టుబడిదారుల ప్రయోజనాలను రక్షించేందుకు రక్షణ, ఆర్థిక, విదేశాంగ వ్యవహారాలలో ఇండియా సర్వస్వాతంత్ర హక్కును త్యాగంచేయడం, సామ్రాజ్యవాదులూ, ఇండియా ప్రభుత్వమూ తాము జరిపే విద్రోహపు పన్నాగాలుండడ ప్రజల దృష్టిని మరొకవిధంగా మరల్చడానికిచేసే ప్రచారాన్ని బట్టబయలు చేయాలి. అన్ని దేశాల సర్వస్వతంత్ర హక్కులూ, కష్టజీవుల ప్రయోజనాలకు సోషలిస్టు రాజ్యం ఏ విధంగా నిజమైన రక్షణగాలో ప్రజలకు వివరించి చెప్పాలి. ప్రజలు స్పష్టంగా తెలుసుకోగలిగిన సమయం సన్నమైనప్పుడూ, ఆ ప్రమాదం బహిరంగంగా కనబడుతున్న సమయంలో "ఈ విషయాన్ని మేము యిదివరకే చెప్పాం సుమా" అనేచౌకబారు ధోరణి [illegible] ప్రమాదంపై ప్రజల దృష్టిని కేంద్రీకరింపచేయలేదు. ఈనాడు ప్రత్యేకంగా జరిగిందేమీ లేదనీ-యీ ప్రమాదాన్ని యిదివరకే ప్రతివారూ గ్రహించారనీ-ప్రభుత్వము తాను ఆంగ్లో-అమెరికన్ కూటమిలో చేరినట్లు యిదివరకే బహిరంగంగా ప్రకటించినట్లు ఎంచి; ఆ విధంగా ప్రవర్తించడం అందులోనూ బూర్జువావర్గాన్ని జయప్రదంగా బట్టబయలు చేయడానికి వీలైన సమయంలో యీ రకమైన వైఖరిని అవలంబించడంవలన నిజంగా బూర్జువా వర్గానికే సహాయపడిన వారమవుతాం.

దీనితోపాటు బూర్జువావర్గం పాలసీ ప్రతి ఒక దశలోనూ సోవియట్ యూనియన్ దురాక్రమణవాంఛతో శాంతికి భంగం వాటిల్లజేస్తున్నదనే సోవియట్ వ్యతిరేక ప్రచారాన్ని బట్టబయలు చేయడాన్ని ప్రధాన కర్తవ్యంగా ఎంచుకొని

పని చేయాలి. మిత్రరాజ్యసమితి కార్య కలాపాలను గురించీ, పరమాణుశక్తి కమీషన్, బెర్లిన్ కాన్ఫరెన్సు మొదలగువాటిని గురించి సామ్రాజ్యవాద పత్రికల న్యూస్ ఏజెన్సీలు అదేపనిగా సోవియట్ వ్యతిరేక అబద్ధాలను వ్యాపింపజేస్తున్నాయి. మన భారతీయ బూర్జువా పత్రికలుకూడా సరిగ్గా వాటినే వల్లిస్తాయి. పైగా సోవియట్ ప్రకటనలను ప్రచురించుతూ, తప్పుడు వ్యాఖ్యలన్నీ ప్రకటించుతున్నాయి. ఇప్పటివరకూ రెండు యుద్ధకూటములున్నట్లు చూపెట్టడానికి అవసరమైన వ్యాఖ్యలను చేశాయి. ఇక ఇప్పుడు సోవియట్ యూనియన్, సామ్రాజ్యవాద వ్యతిరేక శిబిరం దురాక్రమణకు అస్త్రులు జాస్తున్నట్లు కనపరచి, ఇండియా సర్వ స్వాతంత్ర్యానికి సోవియట్‌నుండి ప్రమాదమున్నదని ప్రచారం చేస్తాయి. ఈరకమైన సైద్ధాంతిక ప్రచారమే అనధికార పత్రికలద్వారా త్వరలోనే ప్రారంభిస్తారు. ఈ సందర్భంలో మనం గుర్తుంచుకోవలసిన విషయమేమంటే ఇండియన్ యూనియన్ నామమాత్రంగా ఆంగ్లో - అమెరికన్ యుద్ధకూటమిలో చేరడానికీ, భారత ప్రజలు చురుకుగా అందులో పాల్గొనడానికి చాలా భేదముంది. బూర్జువావర్గం పన్నే ప్రతి కుట్రనూ సకాలంలో ఎదుర్కోవడంద్వారా ప్రజాసామాన్యం తప్పుత్రోవను పడకుండా చూడగలుగుతాం. ప్రజలు ప్రభుత్వ కూటమిని బలపరచకపోగా వ్యతిరేకించుతున్నారనీ చూపెట్టగలం. మామూలుగా కూటమి ఏర్పడటం, దానిలో ఇండియా ప్రభుత్వం చేరడం, అంతటితో పని పూర్తి కామ. బూర్జువావర్గం సిద్ధాంతరీత్యా చేసే ప్రచారం ప్రజాసామాన్యాన్ని తప్పుత్రోవలో పెట్టకుండా చూడాలి. అందుకోసం పోరాటాన్ని తీవ్రతరం చేయాలి. బూర్జువావర్గ ద్రోహపూరితమైన స్వభావాన్ని ప్రజలు స్వయంగా చూడగలిగేటట్లు చేయాలి.

ఇప్పటికే భారతీయ పత్రికలలో ముఖ్యంగా దేశభాషా పత్రికల్లో సోవియట్ వ్యతిరేక దుష్ప్రచారం ఎంతగానో చేయబడింది. ఇదంతా యుద్ధకూటమి ప్రచారంలో ఒకభాగంమాత్రమే. ఈ ప్రచారంలో సోవియట్ విధానం ప్రజాస్వామికం కాదనీ ఎడతెగకుండా బోధించడానికి ప్రయత్నం జరిగింది. ఇందుకు బూర్జువా ప్రజాతంత్రాన్ని గురించిన మామూలు వాదనలన్నీ యివ్వబడ్డాయి. ఈ ప్రచారాన్ని చులకనగాకొట్టిపారవేయడానికి వీలులేదు. భారతప్రజల మనస్సులను గందరగోళపరచి ప్రభుత్వం జేరబోతున్న కూటమిలో ప్రజలు పాల్గొనేటట్లు చేయడానికి చేసే కేపిటలిస్టు ప్రచారంలో యిది ఒక భాగమే. ఈ ప్రచారాన్ని పార్టీయేతర పత్రికలతోసహా, సాధ్యపడిన అన్నివిధాలా ఖచ్చితంగానూ, సహేతుకంగానూ ఎదుర్కోవాలి. యుద్ధోన్మాదుల పాలసీకి వ్యతిరేకంగా సాగించే పోరాటంలో యిదికూడా అంతర్భాగంగా భావించి కృషిచేయాలి. ఇదంతా జయప్రదంగా సాగించాలంటే ఆంగ్లో - అమెరికన్ కూటమిని గురించి పూరికే అరవడం కంటే ఖచ్చితంగా ఉదాహరణలతోసహా ప్రజలకు వివరించి మరి బట్టబయలు చేయవలసి ఉంటుంది.

* * *

ఇక చివరకు అమెరికా ఆర్థిక సహాయంకోసం - మార్షల్ ప్లానుకు ఆసియానమూనా - భారత బూర్జువావర్గం

అర్థించడం ఇక్కడకూడా ఏయే రకంగా అమెరికా సహాయంకోసం ప్రయత్నాలను సాగిస్తున్నదీ - మన ప్రభుత్వ పాలసీపై దీని ఫలితాలూ - అన్నింటినీ బట్టబయలు చేసి ప్రజలకు తేటతెల్లంచేయాలి. అంతే కాదు; ప్రజలకు ఏ విధంగా స్పష్టంగా అవగాహన అవుతుందో సరిగ్గా అలాంటి దృష్టికోణంలో బట్టబయలు చేయవలసి ఉంది.

విదేశాంగ పాలసీ విషయంలోవలెనే విదేశ సహాయం విషయంలో కూడా బూర్జువావర్గం తగు జాగ్రత్తతో ప్రవర్తించింది. పరిశ్రమలను జాతిపరం చేస్తానన్న ప్రకటనను అలాగే వుంచి, విదేశ సహాయాన్ని సంపాదించడానికి ప్రయత్నించింది. కాని ఆప్రకటనను ఉపసంహరించుకోవాలసిందిగా ప్రభుత్వంపై వొత్తిడి తీసుకొని రావడమేగాక సహాయం సంగతి మాట్లాడేముందు విదేశ పెట్టుబడిదారుల లాభాలను గురించి హామీనిప్పించింది. కాబట్టి ప్రభుత్వంపై పెట్టుబడిదారులకున్న ఆధిపత్యాన్నీ, విదేశీ కేపిటలిస్టులకు లొంగిపోవడాన్ని మనం బట్టబయలు చేయాలి. తమ దేశ సహజ సంపదను పెంపొందించుకోవాలనీ అందుకోసం ఇతర దేశాలనుండి ఎంత సహాయాన్ని తెచ్చుకోగలిగితే అంత సహాయాన్ని పొందాలనే ప్రజలకాంక్షను బూర్జువావర్గం తెలివిగా వినియోగించుకొన్నది. అందువలన విదేశాలనుండి వచ్చే సహాయాన్నంతటినీ ఆహ్వానించడానికి మనమూ సిద్ధమేనని స్పష్టపరచాలి. అయితే ఒక షరతుంది. అదేమంటే మనం పొందే సహాయం మన దేశంపై ఆర్థికంగా రాజకీయంగా యితర దేశాల ఆధిపత్యాన్ని తెచ్చిపెట్టేదిగా వుండరాదు. సోవియట్ యూనియన్ సోషలిస్టు రాజ్యమనే విషయమూ - సీనితో చేసుకొనే ఆర్థిక ఒడంబడికల షరతులుగాని, దానివల్ల పొందే సహాయంగాని మన జాతీయ స్వాతంత్ర్యహక్కుకు ఎలాంటి భంగం వాటిల్లజేయవనే విషయం ప్రజలకు వివరంగా నచ్చజెప్పాలి. నిజానికి యీ ప్రాతిపదిక మీదనే సామ్రాజ్యవాద వ్యతిరేక శిబిరంలోని దేశాలతో మన దేశం ఆర్థిక సంబంధాలను పెట్టుకోవాలనే డిమాండ్‌ను మనం ప్రారంభించాలి. ఆ విధంగా చేయనిరాకరించే ప్రభుత్వ వైఖరిని బట్టబయలు చేయాలి.

బూర్జువావర్గం చాల తెలివితేటలతోను జాగ్రత్తతోనూ ప్రవర్తిస్తుంది. “యుయన్ కేఫ్”లో విదేశ పెట్టుబడిదారుల ప్రయోజనాలకు వ్యతిరేకంగా మండిపడి, ఆవిధంగా మొదట సామ్రాజ్యవాదానికి తాను వ్యతిరేకమనే వాతావరణాన్ని సృష్టించుకొన్నది. ఆ తరువాత ‘ఇండస్ట్రియల్ ట్రూస్’ మొదలగు తీర్మానాలను ఉదహరించి, అమెరికా వొత్తిడికి లొంగిపోయింది. విదేశ పెట్టుబడుల లాభాలకు పూర్తి గ్యారంటీ నిచ్చింది. పరిశ్రమలను జాతిపరంచేసే కార్యక్రమానికి స్వస్తి చెప్పింది. జపానును తిరిగి పారిశ్రామికంగా పునర్నిర్మించాలని ఆమోదించి అమెరికా సామ్రాజ్యవాదాన్ని బలపరచింది. నిజానికి ఇండియా ప్రభుత్వం పారిశ్రామికంగా తనకు తక్కువప్రతిపత్తిని ఆమోదించింది. ఇదంతా బట్టబయలు చేయాలి. అది రెండు విధాలుగా చేయాలి: (1) ఆర్థికస్వాతంత్ర్యాన్ని అమ్మివేయడం, (2) భారత ప్రజలు గాఢంగావాంఛించే సమస్య - దేశాన్ని పారిశ్రామికవంతం చేయడంలో విలంబన. ఇండియాలోని వెనుకబడిన ఆర్థిక వ్యవస్థను, అలాగే అట్టిపెట్టివుంచ

దానికి చేసే ప్రయత్నాన్ని, దేశాన్ని పారిశ్రామికం చేయగూడాలన్న భారత ప్రజల ఆశయాన్ని నష్టపెట్టడాన్ని పూర్తిగా బట్టబయలు చేయాలి.

ఈ విధంగా ఇండియా ప్రభుత్వం జరులుజాస్తున్న విదేశాంగ సహాయం మన దేశ ఆర్థిక స్వతంత్రాన్నీ స్వేచ్ఛనూ ఏ విధంగా బలిచేస్తుందో, నూతన పెట్టుబడిదారీ ప్రయోజనాలు ఎలా సృష్టించబడుతున్నాయో, వెనుకబడిన ఇండియా వలస ఆర్థిక విధానాన్ని ఏ విధంగా అట్టేపెట్టబడుతున్నదో - వీటన్నింటినీ వూరికే చెప్పడంగాక యదార్థ ఘటనలను ఉదాహరణగా తీసుకొని ఖచ్చితంగా బట్టబయలు చేయాలి. సోవియట్‌తో చేసుకొనే ఒడంబడికలను వివరించి, అవి దేశం యొక్క ఆర్థిక సంపదను ఏ విధంగా పెంపొందించుతూ జాతీయసర్వస్వతంత్రానికి ఎలా భంగం వాటిల్లనివ్వనిదో స్పష్టముగా ప్రజలకు వివరించి చెప్పాలి.

భారత స్వాతంత్ర్యాన్ని గురించి, ఇండియా సర్వస్వతంత్రాన్ని రక్షించడాన్ని గురించి మాట్లాడుతూ, మన దేశ ప్రభుత్వం నీళ్ళుగార్చుతున్నదని విమర్శించగానే పార్టీలోని శబ్దాడంబరంతో వాగేవారు ఎగిరిపడతారు. వారి దృష్టిలో మనకు స్వేచ్ఛ, సర్వ స్వాతంత్ర్యం ఉన్నదనడమే వెర్రితనం. వారిలా వాదిస్తారు. మనకు స్వేచ్ఛాలేదు; సర్వస్వాతంత్ర్యం అంతకంటేలేదు. అలాంటప్పుడు మన స్వేచ్ఛనూ, సర్వస్వాతంత్ర్యాన్నీ ప్రభుత్వం త్యాగం చేయడంగాని, అమ్మివేయడంగాని ఎలా సంభవిస్తుంది? ఈ రకమైన చొప్పదంటు వాదనలన్నింటినీ చేస్తారు.

స్వేచ్ఛా, స్వాతంత్ర్యం, సర్వ స్వతంత్రము అన్న పదాలను ప్రజలలో భ్రమలు కలిగించడానికీ, ప్రభుత్వాన్ని బలపరచడానికి ఎవరైనా ఉపయోగిస్తే అది అవకాశవాదం అవుతుంది. కాని ఆ పదాలను "స్వాతంత్ర్యాన్ని" బట్టబయలు చేయడానికీ సామ్రాజ్యవాదుల బానిస రథచక్రాలకు ఇండియాను తగిలించే ప్రయత్నాలను తూర్పారబట్టడానికీ, సామ్రాజ్యవాదానికి రోజురోజుకు లొంగిపోవడానికి చేసే కుట్రలను బహిర్గతం చేయడానికీ వినియోగించితే అప్పుడవి ప్రజలను పోరాడటానికీ, జాతీయ సర్వ స్వాతంత్ర్యాన్ని స్వేచ్ఛను రక్షించుకోడానికీ పురిగొల్పడమవుతుంది. ఆ విధంగా తూర్పారబట్టడమంతా స్వేచ్ఛనూ, స్వాతంత్ర్యానికి అన్వయించే చేయాలి వట్టిమాటలు వాగేవారి స్థితంతా "మేమిదివరకే చెప్పలేదా" అన్న వైఖరికి మాత్రమే దారితీస్తుంది. ఆ విధమైన వైఖరిని తీసుకోవడమంటే యుద్ధకూటమికి వ్యతిరేకంగా పోరాటాన్ని పరిత్యజించడమే అవుతుంది. బూర్జువాజీ కుటలన్నీ సరిగ్గా ప్రత్యక్షంగా బయటపడిపోతున్నప్పుడు దానితో పోరాడటానికి నిరాకరించడమే అవుతుంది. అటువంటి రకపు మనుషులకు బూర్జువాజీ యుద్ధకూటమిలో చేరడానికి తయారయింది అంటేనేసరిపోతుంది. దానితోనే వారు సంతృప్తిపడతారు. కాని ప్రజల సంగతేమిటి? వారిని పురిగొల్పి బూర్జువాప్లానును వ్యతిరేకించి పోరాడేటట్లు చేయడమెలాగు? బూర్జువాజీ యీ విషయంలో ప్రజలను ఎలా మోసగించాలని చూస్తున్నది? ఇందుకు దాని ప్లానేమిటి? ఇలాంటి సమస్యలు వారికి (వట్టివాగుడుగాళ్ళకు) అనవసరం. ఎదురుదాడి (అఫెన్సివ్) చేస్తున్నామనే నెపంక్రింద వారి బూటకపు తీవ్రవాదాన్నంతటినీ ప్రద

ర్శించుతారు. అది నిజానికి ప్రజలకోసం పోరాడటానికి నిరాకరించడమే అవుతుంది.

బూర్జువాజీ ఎన్ని ఒడంబడికలనైనా చేసుకోవచ్చు. కాని ఆ ఒడంబడికలనన్నింటినీ త్రోసి రాజనడానికి ప్రజలకు బలం ఉంది. అయితే ఒకపరతుంది. అదేమంటే కమ్యూనిస్టుపార్టీలో తమ కర్తవ్యాన్ని నిర్వహించాలి. అందువలన కమ్యూనిస్టు పార్టీలో బూర్జువాజీ కుట్రలను స్పష్టంగా అర్థంచేసుకోడానికి ప్రజలకు అవకాశాన్ని కల్పించి, వారు పోరాడేటట్లు చేయాలి. ఇందుకు ఓపికతోకూడిన పోరాటం అవసరం, అయితే యీ సత్యం వాగుడు గాళ్ళ బుర్రలలోకి ప్రవేశించదు. వారి వైఖరిప్రతికూలపక్ష విమర్శకుల పోకడకు మించదు. మెజారిటీ ప్రజలను మన వైపు మరలించే బాధ్యతను వారు పెట్టుకోరు.

కాని యీ సమస్యకు బ్రహ్మాండమైన ప్రాముఖ్యంఉంది. "సోవియట్ యూనియన్‌కు వ్యతిరేకంగా తమ సైనికులు పోరాడేటట్లు చేయాలంటే ముందుగా సిద్ధాంతరీత్యా దీర్ఘంగా ప్రయత్నాలు చేయడం అవసరమని యుద్ధోన్మాదులు పూర్తిగా గుర్తించారు".(జదనోవ్) కాని వట్టి శబ్దాడంబరంపై మోజుగల మనవారు కొంతమంది యుద్ధోన్మాదులను బట్టబయలు చేయడానికి మనవర్గ శత్రువుల సైద్ధాంతిక ప్రచారాన్ని ఎదురు దెబ్బతీయడానికి, ప్రజలను మన వైపుకు మరల్చేందుకూ, సిద్ధాంత పోరాటాన్ని కొనసాగించడానికి సిద్ధపడరు.

వారేమన్నా చెప్పనీయండి.

"సామ్రాజ్యవాదులు యితరదేశాలపై దురాక్రమణ కోసం వేసే ప్లానులనూ, ప్రభుత్వరీత్యా కానివ్వండి, ఆర్థికరీత్యా కానివ్వండి లేక సిద్ధాంతరీత్యా కానివ్వండి - అది ఏరూపంలోవున్నా సరే దానిని ప్రతిఘటించడానికి కమ్యూనిస్టు పార్టీలు తప్పక నాయకత్వం వహించి తీరాలి. కమ్యూనిస్టుపార్టీలు తమ అనుయాయులందరినీ సమీకరించి, అందరికృషినీ సామ్రాజ్యవాద వ్యతిరేక, ప్రజాతంత్రవేదికను ఆధారం చేసుకొని ఐక్యపరచాలి. అందుకు యీ వేదిక చుట్టూ ప్రజలలోని ప్రజాతంత్ర, దేశభక్తియుత శక్తులన్నింటినీ సమీకరించాలి."

"ఫ్రాన్సు, ఇటలీ, బ్రిటన్ మొదలగుదేశాలలోని సోదర కమ్యూనిస్టుపార్టీలపైన ప్రత్యేక బాధ్యతఉంది. ఈ కమ్యూనిస్టుపార్టీలు తమస్థానాలను దృఢంగా అంటిపెట్టుకొన్నట్లయితే, శాశ్వత శాంతికీ, ప్రజల ప్రజాస్వామికానికీ, తమదేశాల జాతీయ సర్వస్వాతంత్ర్యానికీ,స్వేచ్ఛకూ, స్వాతంత్ర్యానికీ రక్షకులుగా ధైర్యంగా నిలబడి పనిచేస్తే, తమ దేశాలను ఆర్థికంగా,

రాజకీయంగా బానిసత్వంలో ముంచడానికి జరిగే ప్రయత్నాలకు వ్యతిరేకంగా జరిగే పోరాటంలో వారు జాతీయ గౌరవాన్ని, స్వాతంత్ర్యాన్ని కాపాడటానికి సిద్ధంగావున్న శక్తులన్నింటికీ నాయకత్వం వహించి నడపగలిగితే యూరప్‌ను బానిసత్వంలో ముంచడానికి జరిగే ఏ కుట్రలూ జయాన్ని పొందవు."

[జదనోవ్ పేజీ 47]

ఇవే అన్ని దేశాలలోని కమ్యూనిస్టు పార్టీలు నిర్వర్తించవలసిన కర్తవ్యాలు.

ఈ నాడు యీ బాధ్యతలు మరింత అత్యవసరమైనాయి. అమెరికా సామ్రాజ్యవాదం నాయకత్వాన ప్రపంచ బూర్జువాజీ మరొక నూతన దురాక్రమణ యుద్ధంకోసం - సోవియట్ యూనియన్ పై యుద్ధంకోసం, సోషలిజం ప్రజాస్వామిక శక్తులకు వ్యతిరేకంగా యుద్ధంకోసం అన్ని దేశాలలోని కష్టజీవులకూ, అన్ని జాతుల సర్వ స్వతంత్రానికీ వ్యతిరేకంగా యుద్ధానికి తీవ్రమైన ప్రయత్నాలను జరుపుతున్నది. యుద్ధ ప్రమాదం నిజమైన ప్రమాదంకింద పరిణమించింది. వివిధప్రభుత్వాల కూటమి నిర్మాణం అందుకు మొదటిమెట్టు మాత్రమే. ప్రజలను చీల్చి అందులో కనీసం కొంతమందినైనా తమ యుద్ధ ప్రయత్నాలలో పాల్గొనేటట్లు చేయడానికి బూర్జువాజీ తెగించి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నది. అందుకునాందిగా ప్రతి దేశంలోనూ కమ్యూనిస్టుపార్టీలపైనా కార్మికవర్గంపై దాడిని ప్రారంభించింది.

తన యుద్ధ ప్రయత్నాలలో ఒక భాగముగా బూర్జువాజీ సోషలిస్టు భూమిపై ప్రజలకు సానుభూతిలేకుండా చేయడానికి సోవియట్ యూనియన్‌పై ఘోరాతిఘోరమైన నిందలను ప్రచారం చేస్తున్నది. ఈ ప్రచారాన్ని ఏమాత్రం మొగమాటమిలేకుండా తీవ్రంగా ప్రతిఘటించాలి. సోవియట్‌పై వేసే అపవాదులకు సరియైన సమాధానాలు చెప్పాలి. జనసామాన్యం ముందు యీ నిందలకు సమాధానం చెప్పడం అంతకష్టంగాదు. కాని కాంగ్రెసు అనుచరుల ముందూ, ఛోటా బూర్జువా ప్రజలముందు, పార్టీతో ఎట్టి సంబంధంలేని ప్రజలముందూ జాగ్రత్తగా సమాధానాలు చెప్పవలసి ఉంటుంది. ఎందువల్లనంటే వారి మనస్సులను గందరగోళపరచడానికి బూర్జువావర్గంతీవ్రప్రయత్నాలు చేస్తుంది. ప్రజలలో సోవియట్ అనుకూల అభిప్రాయాలు వున్నాయనడంలో ఎలాంటి సందేహంలేదు. కాని సోవియట్ వ్యతిరేక ప్రచారబలాన్ని మనం తక్కువ అంచనా వేయడంకద్దు. సోవియట్‌కు అనుకూల అభిప్రాయం ప్రజలలో లేకుండా చేయడానికి బూర్జువాజీ తీవ్రంగా పనిచేస్తుంది. యుద్ధోన్మాదుల కుట్రలను తూర్పారబట్టాలి. బూర్జువా ప్రజాతంత్రంయొక్క నగ్నస్వరూపాన్ని బట్టబయలుచేయాలి. శాంతికీ,ప్రజాస్వామికానికీ, స్వేచ్ఛకూ, సోషలిజానికీ, సోవియట్ ప్రజలరక్షకులుగా వివరించిప్రచారము చేయాలి. సోవియట్ ప్రజలు కేపిటలిస్టు బానిసత్వాన్నుండి ఎలా విముక్తి కాబడ్డారో మన ప్రజలకు తెలియజెప్పాలి. బూర్జువా ప్రజాతంత్రంపై సోషలిస్టుప్రజా

తంత్రానికిగల ఆధిక్యతను ప్రజలకు విప్పి చెప్పాలి. ఇవీ నేడు కమ్యూనిస్టుపార్టీల ముందున్న ప్రధాన అత్యవసర కర్తవ్యాలు. యుద్ధోన్మాదుల కుట్రలనూ, నూతన యుద్ధాన్ని తెచ్చిపెట్టడానికి వారుచేసే ప్రయత్నాలను బట్టబయలు చేసేటప్పుడు, శాంతియెడల ప్రజలకుగల గాఢాభిమానాన్ని అవకాశంగా తీసుకొని యుద్ధమేవస్తే ప్రజల ఆర్థిక స్థితిగతులు ఎంత అధ్వాన్నమవుతాయో, శ్రామిక ప్రజలు ఎంతమంది చంపబడి నాశనం చేయబడతారో-అన్నీ తేటతెల్లంగా ప్రజలకు వివరించిచెప్పాలి. ఈ ఘోరయుద్ధానికి ప్రభుత్వము చేసే సన్నాహాలను మనం బట్టబయలు చేయాలి.

ఈనాడు యుద్ధప్రమాదం తీవ్రతరమైంది. అంతర్జాతీయ పరిస్థితికూడా మరింత క్లిష్టమైంది. కాని యిదేసమయములో శాంతి, ప్రజాస్వామిక, సోషలిస్టు ప్రజాశక్తుల బలం యుద్ధోన్మాదుల కుట్రలను ఓడించేంతటిగా హెచ్చింది. ఈ విధమైన క్లిష్టపరిస్థితులలో కనీసం తాత్కాలికంగానైనా కమ్యూనిస్టుపార్టీ ప్రజలనుండి వేరుపడనీయడంగానీ లేక ఖచ్చితంగా నేడున్న పరిస్థితిని అధ్యయనం చేయడానికి బద్ధకించి, వట్టి నినాదాలు వల్లించి, తత్ఫలితంగా ప్రజలు కమ్యూనిస్టుపార్టీని అపార్థము చేసుకోడానికి వీలుకలుగనీయడంగానీ చేస్తే అది కార్మికవర్గానికి విప్లవోద్యమానికి మరువరాని, క్షంతవ్యంకాని ద్రోహం చేసినవారవుతారు. అలాంటి శుద్ధ వాగుడుగాండ్రను కార్మికవర్గానికీ, పార్టీకీ శత్రువులుగా ప్రకటించి, పార్టీ వారితో ఎలాంటి సంబంధాన్నీ పెట్టుకో నిరాకరించాలి.

—సంపాదకవర్గం "కమ్యూనిస్టు"

[జూన్ - జులై సంచిక]

కూలీల జీతాలపై ☆ పెట్టుబడిదారుల దాడి

ఫెయిర్ వేజెస్ కమిటీ తంతు

సి. కె. చౌదరి

పరిశ్రమలలో కూలీ రేట్లను నిర్ణయించుటలో సూచనలు గావించుటకై కేంద్ర ప్రభుత్వంచే నియమింపబడిన 'ఫెయిర్ వేజెస్ కమిటీ' తన సూచనలను తయారుజేసింది. ఈ సూచనలు పెద్దతాషామర్భా మోతలతో ఆర్భాటంగా పత్రికలలో ప్రకటింపబడినవి. కార్మికులకు బహున్యాయమైన వేతనాలు త్వరలో నిర్ణయింపబడగలవనీ, వారికి కడుపు నిండా తిండి, వంటినిండా బట్ట శుభ్రమైన యిల్లు ఇతర సౌకర్యాలు వచ్చి వళ్లోపడగలవని భ్రమలు కల్పించబడుచున్నవి. వీటి ఆధారంతో కాంగ్రెసు డబ్బాల ఊకదంపుడు ఉపన్యాసాలుకూడ ప్రారంభమైనవి. కాబట్టి ఈ ఫెయిర్ వేజెస్ కమిటీ ఏమిటో, దాని సూచనలేమిటో, రామరాజ్యంలో కూలీలకు కలగనున్న స్వర్గ సౌకర్యాలేమిటో కొంత వివరంగా చూద్దాము.

(ప్రస్తుతంవున్న కనీస వేతనాల చట్టం ప్రకారం 1950 నాటికి పారిశ్రామిక కార్మికులకూ, 1951 నాటికి వ్యవసాయ కూలీలకూ కనీస వేతనాలు నిర్ణయింపబడాలి. గనుక ఈ ఫెయిర్ వేజెస్ కమిటీ సూచనల ప్రకారమే వ్యవసాయకూలీల కూలిరేట్లు కూడా నిర్ణయింపబడవచ్చును. కాబట్టి వ్యవసాయకూలీ దృష్ట్యా ఈ కమిటీ సూచనలు ఎంతవరకు ప్రయోజనకరములో చూద్దాం.)

కార్మిక విజృంభణ: కమిటీ నియామకం

కాంగ్రెసు ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా దేశంలో ఆర్థిక సంక్షోభం అంతకంతకూ విషమమౌతోంది. నోట్ల ముమ్మరము పెరిగిపోతూవున్నది. ధరలు పెరిగిపోతూవున్నవి. ప్రజల జీవన ప్రమాణం పడిపోతూనే వున్నది. ఆహారసంక్షోభం భయంకర రూపాన్ని దాల్చింది. ఇట్టి విషమ సంక్షోభంయొక్క భారాన్ని ప్రజల నెత్తిపైకి త్రోసి, తను దోపిడీ లాభాలను నిల్పుకోవాలని పెట్టుబడిదారీ వర్గం చూస్తున్నది. తన గుత్తాధికార బలంవల్ల హెచ్చుధరలను నిల్పుతూ, అందుకై కార్మికుల కూలీరేట్లను విరగగోయాలని చూస్తున్నది. ఈ విధంగా అటు కొనుగోలుదార్లనూ, ఇటు వుత్పత్తిదార్లనూ కార్మికులనూ, దోచుకొంటానికై ఇండియన్

పెట్టుబడిదారీవర్గం చూస్తున్నది. రేషనలైజేషన్ పేరుతో కొంతమంది కార్మికులను బర్తరఫుచేసి మిగిలి ఉన్న కార్మికులపై పని భారాన్ని పెంచటమూ ధరల కంట్రోలుకు మార్గం అనే పేరుతో కార్మిక వేతనాలను అరికట్టి వుంచటం, తగ్గించటం; కంట్రోలుచాటున తను యిప్పటి దోపిడీ ధరలను చట్టబద్ధ మొనర్చటం, మున్నగునవి ఈ పెట్టుబడిదారీ వర్గంయొక్క ఎత్తుగడలు.

కాని విప్లవ కార్మికవర్గం గొర్రెలవలె ఈ పెట్టుబడిదారీ ఎత్తుగడలకు బలి కావలచుకోలేదు. వీరోచితంగా పెట్టుబడిదారీ దాడిని ఎదుర్కొంటూ తన హక్కుల కొరకై పోరాడుచున్నది. రేషనలైజేషనుకూ, కూలితగ్గింపుకూ వ్యతిరేకంగా బొంబాయి, కలకత్తా, కోయంబత్తూరు, కాన్పూరు, నాగపూరు మున్నగు, పెద్ద కేంద్రాలలోనూ, అసంఖ్యాకమగు ఇతర కేంద్రాలలోనూ అతిదీర్ఘమగు మొండి పోరాటాలు జరిగినవి. ఇంకా జరుగుచున్నవి. అఖిలభారత రైల్వే కార్మికులు జనరల్ సమ్మెకు పిలుపు నిచ్చి ప్రభుత్వాన్ని గజగజ వణికించివేసారు. కోలారు బంగారు గనుల కార్మికులూ, బొంబాయి ఫైర్‌స్టోన్ కార్మికులూ, వీరోచితంగా పోరాడారు. ఒక్క ఒక రోజు నిరసన సమ్మెలనే గనుక జూస్తే ఈ సమ్మె పోరాటాల ఉధృతం తెలియగలదు.

సమ్మెదారుల సంఖ్య

1947 జూన్ బొంబాయి రైల్వే		25,000
1946 డిసెంబర్ బొంబాయి జనరల్		6,00,000
1948 జనవరి	కలకత్తా	1,00,000
,, ,,	కాన్పూరు	80,000
,, మార్చి	సి. పి. బీరారు	2,00,000
,, మే	యస్. ఐ రైల్వే	32,000
,, జూన్	ఇండోర్	15,000
,, ఆగస్టు	బొంబాయి	1,50,000

వెల్లువవలె పొంగి పొరలి వచ్చే ఉప్పెనవంటి కార్మిక వాహినికి తోడుగా ఒక నూతన శక్తి రంగంలో ప్రవేశించింది. అది విప్లవ కూలీవర్గం. 1948లో బీహారు, ఆంధ్ర, తమిళనాడు, యు. పి. మున్నగు రాష్ట్రాలలో అతిశక్తివంతమగు వ్యవసాయ కూలీ పోరాటాలు జరిగినవి. జీవనభృతి కొరకూ, భూమికొరకూ వెట్టిచాకిరి రద్దుకొరకూ జరిగిన ఈ ఉజ్వల పోరాటాలు భారత దేశ రాజకీయాలలో నూతన జ్యోతిని వెలిగించాయి.

ప్రభుత్వం ఈవిజృంభణను లాఠీలతోనూ తుపాకులతోను, అడ్డగించప్రయత్నించింది. కాని చంద్రోదయం నాటి సముద్రతరంగం వలె అంతకంతకూమిన్నంటు ఈ విప్లవ ప్రవాహం లాఠీలూ, తుపాకులతో చల్లార్చ బడుతుందా ? కాబట్టి ప్రభుత్వం తన దండోపాయానికితోడు భేదోపాయాన్ని కూడా ప్రయోగించ బూనుకొన్నది. ఈ సంక్షోభంనుండి బైటపడుటకై పెట్టుబడిదారీ వర్గం ఆలోచించే మార్గాలలో కార్మికవర్గం సమ్మతిని సంపాదించుటకై కాంగ్రెసు నాయకులయొక్కా, సోషలిస్టు నామధారులయొక్కా, సహాయాన్ని [illegible] లనువుపయోగించబూనుకొన్నది. దీనితోనే మొట్టమొదటగా కార్మికుల వే[illegible] లను మేళ్బందీచేయుటకూ, [illegible] టకూ కూడా ఉపాయం [illegible] వేజస్ కమిటీని నియమించింది.

ఈ కమిటీలోని సభ్యులను గనుకజూస్తే ఈ కమిటీ స్వభావమూ గుట్టూ బైట పడగలవు. ఈ కమిటీలో పెట్టుబడిదార్ల ప్రతినిధులూ, పెట్టుబడిదారీ ప్రభుత్వం ప్రతినిధులూ, కంపెనీ యూనియన్ అగుజాతీయ(?) ట్రేడ్‌యూనియన్ ఫెడరేషన్ ప్రతినిధులూ సమ్మె విచ్ఛిన్నకర సంఘమగు హింద్ మజ్దూర్ సంఘ ప్రతినిధులూ వున్నారు. కార్మికుల జీవనభృతినిర్ణయించుటకై కార్మిక యజమానులనూ, కార్మిక ద్రోహులనూ నియమించారంటే ఈకమిటీ ఎంతటి నిష్పక్షపాతమైన కమిటీయో ఊహించవచ్చును !

ఈ విధంగా త్రైపాక్షిక (నిజంగా ఒకే పక్షం : ప్రభుత్వ ప్రతినిధులూ పెట్టుబడిదార్ల ప్రతినిధులే, కార్మిక ప్రతినిధులుగా వెళ్ళిన కార్మిక ద్రోహులూ పెట్టుబడిదారీ తైనాతీలే) కమిటీని వేయటంలోనే వేతనములు ఎట్లా నిర్ణయింపబడుతాయో సూచింపబడుతూనే వున్నది. పెట్టుబడిదార్లకు 'గిట్టుబాటు' అయ్యే వేతనములే, పరిశ్రమలు చెల్లించగల్గిన జీతాలే నిర్ణయింపబడగలవన్నమాట ! ఫెయిర్ వేజస్ కమిటీ యొక్క ఫెయిర్ స్వభావం దాని నిర్మాణంలోనే కన్పిస్తున్నది.

కమిటీసూచనలు గిట్టుబాటు సిద్ధాంతమే

'న్యాయమగు' కూలీ రేటును నిర్ణయించ నియమింపబడిన ఈ కమిటీ నాల్గురకాలకూలిరేట్లను చర్చించింది. (1) జీవనభృతి (జీవనమునకు సరిపడ్డకూలి) (2) కనీస కూలి (3) న్యాయమగు కూలి, (4) ప్రాతిపదిక కూలి (బేసిక్ వేజ్; అంతకు తగ్గరానికూలి ప్రమాణం) వీటిని ఈక్రింది విధంగా వివరించింది.

జీవనభృతి (లివింగ్ వేజ్) అంటే: కార్మికుడు కేవలం బ్రతికివుండుటకే గాక, ఆరోగ్యంగానూ, గౌరవప్రదంగానూ జీవిస్తానికి అవుసరమగునంత మొత్తం - అంటే పిల్లలకు చదువు, వ్యాధులు రాకుండా సంరక్షణ మున్నగువాటితో కూడా కలిపి ఖులాసా గ్రామజీవితాన్ని గడుపుటకూ, ముఖ్యమగు సాంఘిక ఖర్చులనుజరుపుకొనుటకూ వృద్ధాప్యంతో సహా యితర ఆపత్కాలములలో ఆదుకొనుటకుగాను భీమా సౌకర్యాలకూ అవుసరమగునంత మొత్తం.

కనీస కూలి (మినిమమ్ వేజ్): అంటే కేవలం జీవనపోషణయే గాక, విద్యా వైద్యాది సౌకర్యాలు కల్గజేయటం మూలకంగా కార్మికుడు దృఢంగా పని చేయగలశక్తిని కల్గివుండుటకు అవసరమగునంత మొత్తం.

న్యాయమగుకూలి (ఫెయిర్ వేజ్) అంటే, జీవనభృతి ఆదర్శప్రాయమైనది కాబట్టి ప్రస్తుతం అది లభ్యం కాజాలనందున, జీవనభృతికీ కనీసకూలికీ మధ్య వుండునట్లుగా - కనీసకూలి అడుగుమట్టంగానూ జీవనభృతి పైమట్టంగానూవుండి మధ్యన వూగులాడుతూ వుండేటట్లుగా - నిర్ణయింపబడే మొత్తం. కాని ఇది నాల్గు షరతులకు లోబడి నిర్ణయింపబడుతుంది. ఇవి; (అ) కార్మికుని వుత్పత్తిశక్తి (ఆ) ఆ ప్రాంతంలో చలామణీలోవున్న వేతనాలు (ఇ) జాతీయాదాయం ఎంత? అది ఎట్లా పంపిణీ అగుచున్నది (ఈ) దేశ ఆర్థిక జీవనంలో ఆ పరిశ్రమకుగల స్థానం.

మామూలు పరిస్థితులలో ఇరుపక్షాల మధ్యనూ రాజీగా అంగీకరింపబడిన ఇప్ప

కూలిరేట్లే న్యాయమైన కూలిరేట్లుగా అంగీకరింపబడినవి.

ప్రాతిపదిక కూలి (బేసిక్ వేజ్): అంటే, 1939 జీవన వ్యయాన్ని 100 గా తీసుకొని, ఇప్పటి జీవన వ్యయాన్ని 160–175 పాయింట్లమధ్య నిర్ణయించి, అంతకుమించి పెరిగిన జీవన వ్యయానికి అధిక ధరల అలవెన్సును యివ్వటం. అధమ జీతగాళ్ళకుమాత్రం ధరల పెరుగుదలకు భర్తీగా పూర్తి అధిక ధరల అలవెన్సు యివ్వబడి, ఇతరులకు స్లాబ్ సిస్టం ప్రకారం, అంటే, జీతాలస్కేలును బట్టి యింత అని నిర్ణయింపబడే పద్ధతిని యివ్వబడుతుంది.

కమిటీయొక్క సూచనలను వింటే, పంచపాండవులంటే ఎరుగనా, మంచం కోళ్ళవలె...అన్న సామెత గుర్తుకు వస్తున్నది. జీవనభృతి అంటే కేవలం బ్రతుకును వెళ్ళదీసుకొనటమే కాకుండా... అని మొదలెట్టి, అవీ ఇవీ ఏకరువుపెట్టి, చివరకు 'పరిశ్రమలు చెల్లించగల్గిన స్థితిలో వుంటే' అని ఆ జీవనభృతికి సున్నజుట్టివేశారు. చివరకు వారు తేల్చింది, కార్మికులు తమ కండలన్నీ పిండిజేసుకొని పెట్టుబడిదారులకు సంపదలనుత్పత్తి చేసినప్పటికీ (కార్మికుని ఉత్పత్తిశక్తినిబట్టి అన్నదాని అర్థం) అక్కడి కూలిరేట్లు మరీ హీనంగా విన్నవారికి అసహ్యం గొల్పునట్లుగా వుంటే (చలామణీలోవున్న కూలిరేట్లను బట్టి అన్నదాని అర్థం) పెట్టుబడిదార్ల లాభాలు ఏమీ తగ్గకుండావుంటే (జాతీయాదాయం పంపిణీ అన్నదాని అర్థం) కార్మికుల అలజడి హెచ్చకుండా వుండాలంటే (పరిశ్రమల ప్రాధాన్యతనుబట్టి అన్నదాని అర్థం) అప్పుడు మాత్రం కనీస కూలీయో, 'న్యాయమగు' కూలియో నిర్ణయింపబడుతుందన్నమాట.

కూలిరేట్లను నిర్ణయించే పెట్టుబడిదారీ పద్ధతియిదే. పెట్టుబడిదార్లకు గిట్టుబాటు అయ్యే కూలిరేట్లను నిర్ణయించేపద్ధతియిదే. కమిటీ నిర్ణయాలను ప్రభుత్వం త్వరలోనే శాసనబద్ధమొనర్చబోవుచున్నట్టు వార్తలు వస్తున్నవి. కాబట్టి మార్క్సిస్టు దృష్ట్యా అసలు జీవనభృతి అంటే ఏమిటో? అది ఏవిధంగా కార్మికుని హక్కు, దానిని సాధించేమార్గ మేమిటో చూడవలసి వున్నది.

కూలీ అనేది శ్రామికుని శ్రమశక్తి ధర

కూలి అంటే సర్వ సామాన్యంగా బూర్జువావర్గంచే చెప్పబడేదే, కార్మికుని శ్రమకు ప్రతిఫలంగా యివ్వబడే మొత్తం అని. ఫ్రెంచి విప్లవంలో బూర్జువాపక్ష నాయకుడగు మిరాబో "ఒక్కదొంగలూ, బిచ్చగాళ్ళూతప్ప మిగిలినమానవులందరూ కూలివారే" అన్నాడు. అంటే, పెట్టుబడిదార్లుకూడా శ్రమజీవులేననీ, కార్మికుల శ్రమకు ప్రతిఫలంగా కూలివస్తే, పెట్టుబడిదార్ల శ్రమకు ప్రతిఫలంగా లాభాలు వస్తాయనీ దీని అర్థం. ఈ అర్థ దృక్పథమే బూర్జువా అర్థశాస్త్రజ్ఞులలోనూ, ఊహాజనిత సోషలిస్టులలోనూ వుండేది. కాని మార్క్స్ దీనిని ఖండించి, కూలి అంటే కార్మిక శ్రమశక్తికి చెల్లింపబడే ధరయని శాస్త్రీయంగా ప్రతిపాదించాడు. నేటి పెట్టుబడిదారీ విధానంలో కార్మికునకు, వాని శ్రమశక్తి మినహా మరే యితర ఆస్తిలేదు. దాని నాతడు అమ్ముకొనే అనగా దాని ఉపయోగాన్ని యిత

పాలకు అమ్ముకొనే జీవించాలి. దీనినే మార్క్సు ఇట్లా చెప్పాడు.

"వారు సరుకైన శ్రమశక్తిని కార్మికులు పెట్టుబడిదారుని సరుకైన ధనంతో మార్చుకొంటున్నారు. ఈ మారకం ఒకానొక నిర్ణీతమైనగు నిష్పత్తిలో జరుగుతున్నది. శ్రమశక్తియొక్క ఇంత కాలం వుపయోగానికి ఇంత సొమ్ము; 12 గంటల చేతకు 2 మార్కులు (జర్మన్ నాణెములు—చౌదరి), అని నిర్ణయింపబడుతుంది. ఈ రెండు మార్కులంటే, రెండు మార్కుల విలువగల ఇతర సరుకులన్నింటికీ సమానం కాదా? కాబట్టి వాస్తవానికి, కార్మికుడు తన సరుకగు శ్రమశక్తిని, ఇతర అనేక రకాలగు సరుకులకు—అయినా ఒక నిర్ణీత నిష్పత్తిలో—మార్చుకొంటున్నాడన్నమాట. అతను ఒకరోజు శ్రమకు మారుగా పెట్టుబడిదారుడు రెండు మార్కులు యిచ్చాడంటే, అతనికి ఇంత మాంసం, ఇంత బట్ట, ఇన్ని వంట కట్టెలు, దీపాలు వగైరా ఇచ్చాడన్నమాట. కాబట్టి ఇతర సరుకులతో శ్రమశక్తి మారే (వినిమయంకాబడే) నిష్పత్తిని తెలియజేసేవే; శ్రమశక్తియొక్క మారకపు విలువను తెలియజేసేవే ఈ రెండు మార్కులు. ఒక సరుకుయొక్క మారకపు విలువను ధనరూపంలో చెప్పటమే ధర. కాబట్టి మానవ రక్తమాంసాలు మినహా మరే ఇతర ఆశ్రయమూ లేనట్టి ఈ విచిత్ర సరుకుయొక్క ధరకు వున్న విచిత్రమగు పేరే 'కూలి'."

(మార్క్సు: "కూలిపని - పెట్టుబడి" సెలెక్టెడ్ వర్క్సు: వాల్యూం 1 పేజి 202-3.)

కాబట్టి కూలి అంటే సరియగు శాస్త్రీయ నిర్వచనం ఇదీ. శ్రమకు తగ్గ ప్రతిఫలం అనీ, 'యజమాని దయ' అనీ పరిశ్రమలు చెల్లించగల్గినంత అనీ, ఇంకా ఏవేవో చెప్పబడే ధర్మపన్నాలు అన్నీ కేవలం బూటకం, మోసం.

ఫెయిర్ వేజస్ కమిటీ ఈ విషయాన్నే గుర్తించటంలేదు. దాని దృష్టిలో కార్మికుడు తన శ్రమశక్తిని అమ్ముకొంటున్నాడనీ, ఆ శ్రమశక్తి విలువ అతనికి ఇప్పించాలని లేనేలేదు. దానికి పట్టుకొన్న చింత అంతా పరిశ్రమలు చెల్లించగల్గుతాయా, లేదా? పెట్టుబడిదార్లు కోరిన లాభాలు వారికి ముట్టజెప్పిన పిమ్మట కార్మికులకు ఎంత చెల్లింతగల్గుతాము? పెట్టుబడిదార్లకు కావలసిన కూలీలు తగ్గకుండా వుండాలంటే, కూలీలు ప్రాణాలతో నిల్చి వుండటానికి ఎంతయివ్వాలి? అనేది మాత్రమే. దాని దృష్టిలో వున్నవి పెట్టుబడిదార్లూ వారి లాభాలూ, పరిశ్రమల సౌభాగ్యం మాత్రమేగాని, కార్మికులూ, వారి హక్కులు కాదు.

'న్యాయమగు కూలి' అనటంలోనే ఈ కమిటీ శ్రమశక్తి సిద్ధాంతాన్ని అంగీకరించటంలేదని స్పష్టమగుచున్నది. 'న్యాయమగు కూలి' అనటంలోనే అది బహిరంగమగు, పచ్చి పెట్టుబడిదారీ ఆర్థిక సంబంధాలను మరుగుపర్చి, వాటికి ఆధ్యాత్మికమగూ, దైవికమగూ మేలి ముసుగును తగిలిస్తున్నది. 'న్యాయం' అంటే ఏమిటి? ఎవరికి న్యాయం? జెజాడలో రు 1-0-0 రోజు కూలి యిచ్చి ధర్మవరములో 0-4-0 యివ్వటం ధర్మమా, అధర్మమా? ఈ విధంగా ఒక స్పష్టమగు ఆర్థిక సంబంధాన్ని - పెట్టుబడిదారీ సంబంధాన్ని - బూర్జువా ధర్మాధర్మ విచారణతో నిర్ణయించ బూనుకుంటూ ఈ కమిటీ కూలి రేటును మానవ నీతి శాస్త్రమునకు అంటుగట్టుచున్నది.

ఉత్పత్తి సాధనాలూ, పరికరాలూ అగు యంత్రములు, గనులు, రైల్వేలు, పరిశ్రమాలయములు, భూమి, అడవులు, జలాధారములు మున్నగునవన్నీ పెట్టుబడిదార్లూ, భూస్వాములూ అగు ఆస్తిపరులవర్గాల చేతులలోనే యిరుక్కొని పోయి వున్నంతకాలం, కూలి మార్కెటులో కూలీలకు 'న్యాయమగు' కూలి దొరకటం దుర్లభం - ఎన్ని కమిటీలు ఏర్పడి, ఎన్ని ధర్మపన్నాలను వల్లించినా 'న్యాయమగు రోజు పనికి న్యాయమగు రోజుకూలి' అనే ఈ సిద్ధాంతాన్ని ఖండిస్తూ ఎంగెల్సు ఇట్లా వ్రాసాడు:

"న్యాయమగు రోజు పనికి న్యాయమగు రోజుకూలియా? అయితే, న్యాయమగు పనిరోజు ఏది? న్యాయమగు రోజుకూలి ఎంత? ప్రస్తుత సమాజవ్యవస్థ నిల్చి వుండటానికే, అభివృద్ధి జెందుతూ వుండటానికీ కారణమగు సూత్రాలక్రింద ఈ న్యాయమగు రోజుపని, న్యాయమగు రోజు కూలి ఎట్లా నిర్ణయింపబడుతాయి? దీని జవాబుకై మనం నీతిశాస్త్రాలనుగాని, ధర్మశాస్త్రాలనుగాని, లేక మానవకారుణ్యం, ధర్మాధర్మములు, చివరకు దానబుద్ధి మున్నగు అంతఃకరణ ప్రవృత్తులనుగాని చూడరాదు. నీతిదృష్ట్యా న్యాయమైనది, ధర్మశాస్త్రాల ప్రకారంకూడా న్యాయమైనది, సాంఘిక న్యాయానికి చాలా దూరం కావచ్చును. సాంఘిక న్యాయాన్యాయములు ఒక్క శాస్త్రం ప్రకారమే - ఉత్పత్తి మారకములనే భౌతిక విషయములకు సంబంధించిన శాస్త్రం ప్రకారమే, అర్థశాస్త్రం ప్రకారమే - నిర్ణయింపబడుచున్నవి."

"న్యాయమైన రోజుపని అనీ, న్యాయమైన రోజుకూలి అనీ వేటిని అర్థశాస్త్రం అంటున్నది?"

... ...

"కాని ఈ విషయాన్ని మనం ఇంకా తరచిచూద్దాము. కూలి గాని, రోజుపని ప్రమాణంగాని పోటీవల్ల నిర్ణయింపబడుతాయని

అర్థశాస్త్రజ్ఞులు చెప్పుతారు. ఈ పోటీలో న్యాయముగా ఇరు పక్షాలూ సమాన ఉజ్జీలుగా బయలుదేరాలనే న్యాయం కోరుచున్నది. కాని వాస్తవంలో అట్లా వుండటంలేదు. తన కార్మికునితో అంగీకారానికి రాలేక పోయినా పెట్టుబడిదారుడు కొంతకాలం ఆగగలడు. తన పెట్టుబడిపై జీవిస్తూ కూర్చోగలడు. కాని కార్మికునకది సాధ్యంకాదు. కూలిమీదనే ఆతడు బ్రతకాలి. ఎప్పుడు,ఎక్కడ ఏ షరతులపై పనిదొరికితే దానికాతడు ఒప్పుకోవాలి. కాబట్టి కార్మికునకు బయలుదేరటంలోనే న్యాయం లేదు. ఆకలి అనే పెద్ద ప్రతిబంధకంవల్ల ఆతడు పీడింపబడుచున్నాడు. కాని పెట్టుబడిదార్ల అర్థశాస్త్రం రీత్యా కార్మికునకున్న ఈ ప్రతిబంధకమే ఈ న్యాయంలోవున్న అతి సుందర విషయం."

"కాని ఇదొక స్వల్పవిషయం మాత్రమే. నూతన పరిశ్రమల్లో మెకానికల్ శక్తినీ, యంత్రములనూ ప్రవేశపెట్టటంవల్లనూ, ఇదివరకేవున్న యంత్ర పరిశ్రమలలో యంత్రములు అంతకంతకూ అభివృద్ధిపర్చబడటంవల్లనూ 'చేతులు' (కార్మికులను పెట్టుబడిదార్లు పిలవటం ఇట్లాగే - చౌదరి) అంతకంతకూ ఎక్కువగా బర్తరఫు గావింపబడుతారు. దేశ మందలి పారిశ్రామికాధిపతులు వీరిని ఎంత త్వరగా పనికి కుదుర్చుకుంటూ వుంటారో అంతకు చాలా ఎక్కువ త్వరగా వీరు బర్తరఫు చేయబడుతూ వుంటారు. ఈ బర్తరఫు గావింపబడిన 'చేతులు' పెట్టుబడిదార్లు పిల్చిందే తడవుగా పరుగెత్తుకొని వచ్చుటకై రిజర్వుగా వుండే నిజమగు పారిశ్రామికసైన్యముగా తయారౌతారు. వ్యాపారం మందగించిందా, వారు ఆకలితో మాడాలి, లేదా దొంగిలించాలి, లేదా అడుక్కోవాలి, లేదావర్కుహౌసెస్‌కు(నిరుద్యోగులచేనిర్బంధముగా స్వల్పకూలికి పని చేయించే ప్రభుత్వశాలను-చౌదరి) పోవాలి. వ్యాపారం బాగుందా, వుత్పత్తిని పెంచుటకు వీరు తయ్యార్. ఈ రిజర్వుసైన్యంలోని ఆఖరు పురుషుడు, స్త్రీ,బాలుడుకూడా పనిలో కుదిరేటంతవరకూ - పిచ్చిగా అధికోత్పత్తి జరిగే కాలములోనే ఈ విధంగా అందరకూ పని దొరకటం సాధ్యమౌతుంది-ఈరిజర్వు సైన్యం పోటీవల్ల, కూలి రేట్లు

తక్కువ ప్రమాణంలోనే వుంచబడుతాయి: తాను వుండటము ద్వారానే ఈ రిజర్వుసైన్యం, కార్మికవర్గంతోటి పోరాటములో పెట్టుబడిశక్తియొక్క బలాన్ని వృద్ధిజేస్తూ వుంటుంది. పెట్టుబడితోటి పందెంలో కార్మికుడు అసౌకర్య స్థానంలో వుండటమే కాదు, తన కాలికి బిగించబడ్డ ఇనుప గుండునుకూడా ఈడ్చుకుపోవాలి. కాని, పెట్టుబడిదారీ అర్థశాస్త్రం ప్రకారం, యిదే న్యాయం అంటే."

(ఎంగెల్సు: "న్యాయమైన రోజుపని న్యాయమైన రోజుకూలి"నుండి)

కాబట్టి ఈ అసమాన బేరంలో, ఈ పెట్టుబడిదారీ ఆస్థి సంబంధాలలో, 'న్యాయమగు' కూలి అనటం కేవలం అన్యాయం, మోసం, దగాకాక మరేమీ కాదు.

న్యాయమగు కూలి అని కమిటీ అనటం ఎందుకో స్పష్టమే. పెట్టుబడిదార్ల వారి పాదధూళిని శిరస్సుపై జల్లుకనే సోషలిస్టు నాయకులూ బూర్జువా ఆర్థిక సరిహద్దులలోనే ఈ సమస్యను పరిష్కరించ బూనుకొంటున్నారు. పెట్టుబడిదారీ విధానానికి ఏలాంటి ముప్పుమూ వాటిల్లకుండా, వారి లాభాలను కించిత్తుకూడా ముట్టుకోకుండా, కూలీలకు కూలి రేట్లను నిర్ణయించ బూనుకొనటంవల్లనే, వారు కార్మికుల కళ్ళుగప్పటానికి కూలి నిర్ణయాన్ని నీతి శాస్త్రానికి అంటగట్టుచున్నారు. ఈ విషమస్థితిలో కార్మికులు కూడా త్యాగాలు చేయాలంటూ, కార్మికులు 'వాస్తవికదృష్టి'తో చూడాలంటూ కార్మికుల కూలి రేట్లను విరగ్గొట్టానికై బూర్జువా ధర్మసూత్రాలనన్నిటినీ ఏకరువు పెట్టుచున్నారు.

శ్రమశక్తి విలువ యేది?

'న్యాయమైన కూలి' అని ఒకపదాన్ని దొరకబుచ్చుకొని, ఇక ఆ 'న్యాయం' అంటే ఏమిటో నిర్ణయించుటకు కమిటీ నాల్గు షరతులను బెట్టింది. వీటి అర్థం స్పష్టమే. పెట్టుబడిదార్లలాభాలను తగ్గించకుండా పరిశ్రమల వుత్పత్తి శక్తినిబట్టి, కార్మికునికి ఎంత యివ్వవచ్చునో అదే 'న్యాయమైన' కూలిరేటుగా నిర్ణయింపబడటం కమిటీసూచన. ఇది పెట్టుబడిదారీ పద్ధతితప్ప మరేమీ కాదు. ఇందువల్ల పెట్టుబడిదారు దయదలచి యిచ్చినదే కార్మికుని కూలి క్రిందవస్తుందిగాని, అతని శ్రమశక్తి విలువకాదు.

కాని, కార్మికుడు తన సరుకగు శ్రమశక్తిని అమ్ముకొంటున్నాడంటే శ్రమశక్తియొక్క విలువ ఏమిటి? దానిని నిర్ణయించేదెట్లా? కమిటీ సభ్యులన్యాయాన్ని బుట్టలోపెట్టి శాస్త్రీయ దృక్పథంతో ఆలోచిస్తే, ఇతర సరుకులన్నిటి విలువలవలెనే కార్మికుని శ్రమశక్తి విలువకూడా దాని నుత్పత్తి జేయుటకు పట్టే శ్రమకాలమును బట్టి నిర్ణయింపబడుతుందని తెలుస్తుంది. దీనినే మార్క్సు ఇట్లా చెప్పాడు.

"శ్రమశక్తియొక్క విలువఏమిటి?

“ఇతర అన్ని సరుకుల విలువ వలెనే దాని విలువకూడా, దానినుత్పత్తి చేయుటకు పట్టే శ్రమమొత్తమునుబట్టి నిర్ణయింపబడుతుంది. మానవునియొక్క శ్రమజేసేశక్తి, ఆతడు ఒక ప్రాణిగా జీవించి వుండటంమీదనే ఆధారపడివుంటుంది. మానవుడు పెరిగి, తన ప్రాణాలను నిలబెట్టుకుంటూ వుండాలంటే, కొన్ని మొత్తముల అవుసరపదార్థాలనుఖర్చుపెట్టుతూ వుండాలి; తన స్వంతజీవనమునకు అవుసరమగు పదార్థములేగాక, కూలి మార్కెట్‌లో తనబదులు వస్తూ, కార్మికజాతి శాశ్వతంగా నిలబడివుండేటట్లు చేయగల తన బిడ్డలను పెంచుటకు అవుసరమైన కొన్ని మొత్తముల పదార్థములు కూడా ఆతనికి కావాలి. ఇంతేగాక, తనశ్రమశక్తిని పెంచుటకూ, కొంత నైపుణ్యమును సంపాదించుటకూ కూడా మరికొన్ని పదార్థములను ఆతడు ఖర్చుపెట్టాలి”

“... ... ...

“పైనజెప్పబడినదానిని జూస్తే, శ్రమశక్తియొక్క విలువ, ఆ శ్రమశక్తిని వుత్పత్తిజేసి, పెంచి, పోషించి, శాశ్వతంగా నిలబెట్టి వుంచుటకై అవుసరమగు పదార్థముల విలువ వల్ల నిర్ణయింపబడుచున్నది అని తెలియగలదు.”

(మార్క్సు: “విలువ, ధర, లాభం.” సెలెక్టెడ్ వర్క్సు: వాల్యూం 1: పే255.)

శ్రమశక్తికూడా క్రయ విక్రయములకు లోనయ్యే ఒక సరుకుగా తయారైన ఈ పెట్టుబడిదారీ మార్కెట్టులో ఏసరుకైనా, తన విలువ ననుసరించి, సరఫరా, గిరాకీలనుబట్టి నిర్ణయింపబడేధరకే అమ్మబడుతుంది. చుండూరురెడ్డి ఒక గ్యాస్ ప్లాంటును అమ్ముచున్నాడంటే కొనుగోలుదార్లపై దయదలచి, తన వుత్పత్తి ఖరీదును కూడా తగ్గించి, కారుచవకగా అమ్మటంలేదు. దాని నుత్పత్తిచేయటంలో ఖర్చు అయిన ముడిపదార్థముల విలువా, యంత్రముల అరుగు తరుగుల విలువా, ఆజ్యముల విలువా, కూలి మొత్తం, తనలాభం (అందులోనూ దోపిడిలాభం) తనకు తిరిగి వచ్చేటట్లుగానే ధరను నిర్ణయించి అమ్ముతాడు. ఒకవేళ ధరను కొంత తగ్గించినా, అసలు వుత్పత్తి ఖరీదుకు తగ్గి (ఉత్పత్తి ఖరీదు అంటే యంత్రముల అరుగు తరుగుల విలువా, ముడిసరుకులవిలువా, ఆజ్యముల విలువా కలిసివుండే స్థిరపెట్టుబడీ+కూలి మొత్తం క్రిందవుండే అస్థిర పెట్టుబడీ+సగటులాభం) ఎన్నడూ అమ్మడు. ధర అంతగా పడిపోతే, గాస్ ప్లాంటుల వుత్పత్తిని మాని మరొక పరిశ్రమను ప్రారంభిస్తాడుగాని నష్టానికి గాస్ ప్లాంటుల వుత్పత్తినే సాగించడు. ఈవిధంగానే, ఏ పెట్టుబడిదారుడూ తన సరుకును ఉత్పత్తి ఖరీదుకు తగ్గించి ఎన్నడూ అమ్మడు. ఖర్మంకాలి తనకు మరే యితర జీవనాధారమూ లేకపోవుటచే, కార్మికుడు తన శ్రమశక్తిని దాని విలువకు చాలా తగ్గించి

కూడా, కారు చవుకగా, అంటే, అర్ధాకలితో బ్రతుకుతూ, తన సరుకైన శ్రమశక్తిని అమ్ముకొంటున్నాడు. ఇందువల్లనే శ్రమశక్తివిలువకూ, ఈనాడు లభ్యమయ్యే కూలిరేట్లకూ ఎక్కడా పొత్తేలేకుండా పోయింది. అందుచే ప్రస్తుతపు నికృష్ట కూలిరేట్ల ప్రమాణాన్ని దృష్టిలోపెట్టుకొని 'న్యాయమైన' కూలిరేట్లను నిర్ణయించటానికి కమిటీ పూనుకోవటంఅంటే, సమానవిలువలమధ్యనే మారకం జరగటం అనే పెట్టుబడిదారీ ఆర్థికనీతికి, న్యాయానికి కూడా కట్టుబడివుండకుండా, కేవలం ఫ్యూడల్ పద్ధతిలో, ప్రతిఫలమివ్వకుండా దోచుకొనే సిద్ధాంతాన్ని అనుసరించటమన్నమాట. ఇంతకుమినహా దాని సూచనలకు మరొకఅర్థంలేదు.

అయితే కార్మికుని శ్రమశక్తి విలువను నిర్ధారణగావించే ఈ జీవితావసరముల విలువ ఏమిటి? కార్మికుడు కార్మికుడుగా జీవిస్తూ కార్మిక సంతానాన్ని పెంచి, పోషించుటకు అవుసరములగు ఈ పదార్థములేవి? ఇవి ఎల్లకాలం ఒకే ప్రమాణంలో వుంటాయా? ఈ విషయాలనుకూడా పరిశీలించనిదే శ్రమశక్తి ధరను అనగా కూలిరేట్లను నిర్ణయించటం సాధ్యంకాదు.

శ్రమశక్తి విలువను పరీక్షించేటప్పుడు ఒక్క విషయాన్ని మాత్రం గుర్తుంచుకోవాలి. శ్రమశక్తి విలువ దాని ప్రత్యేకతవల్ల, రెండు ప్రకృతులనుబట్టి నిర్ణయింపబడుచున్నవి. మొదటిది శారీరక ప్రకృతి. కార్మికుడు కార్మికుడుగా జీవిస్తూ, కార్మిక సంతానాన్ని పెంచి పోషించుటకు అవుసరములైన పదార్థములు ఇందులో చేరుతాయి. రెండవ ప్రకృతి చారిత్రకం, లేక సామాజికం. ఆయా దేశాలలో ఆయా ప్రాంతాలలో ఫ్యూడల్ దాసత్వంనుండి బైటపడి పెట్టుబడిదారీ వ్యవస్థలోకి ప్రవేశించే పరిస్థితులనుబట్టి ఏర్పడే చారిత్రక సాంప్రదాయాలూ సామాజికాచార పద్ధతులూ మున్నగు వాటినిబట్టి కార్మికుని జీవన ప్రమాణం నిర్ణయింపబడుతూ వుంటుంది. ఈ ప్రకృతివల్లనే అమెరికన్ కార్మికుని జీవన ప్రమాణం ఇండియన్ కార్మికుని జీవన ప్రమాణంనుండి ఈ రెండవవాని జీవన ప్రమాణం గోల్డుకోస్టు కార్మికుని జీవన ప్రమాణంనుండీ, ఇవన్నీ సోవియట్ సోషలిస్టు కార్మికుని ఉన్నత జీవనప్రమాణంనుండీ వేరౌతూవుంటాయి. కాబట్టిఈవిధంగా రెండుప్రకృతులవల్లనూ, అనగా శారీరకమూ, సాంఘికమూ, అగుకారణాలవల్లనే శ్రమశక్తి నిర్ణయింపబడుతూ వుంటుంది. దీనినే మార్క్స్ ఈ క్రింది విధంగా సూత్రీకరించాడు.

"వివిధ దేశాలలోనూ, లేక వివిధ చారిత్రక కాలాలలోనూ వున్న కూలిరేట్ల ప్రమాణాన్ని, అంటే శ్రమశక్తి విలువను పోల్చి చూస్తే, ఈ శ్రమవిలువ అనేది నిలకడగా వుండేదగాక, యితర సరుకులన్నిటి యొక్క విలువలూ మారకుండా స్థిరంగానే వున్నా, ఇది మాత్రం మారుతూవుండేదని మనం చూడగలం."
(మార్క్స్: పై గ్రంథంలోనే: పేజీ 271)

ఎంగెల్సు ఇట్లా తెలియజేశాడు:

"ఒకానొక దేశంలో, ఆ దేశానికి మామూలైన జీవన ప్రమాణాన్నిబట్టి కార్మికజాతిని నిలకొట్ట

వృంచటానికి అవసరమైన ఉద్యోగ్యముల మొత్తమునకు సరిపడు ట్లుగానే సగటు కూలిరేటు వుండగలదు.”

(ఎంగెల్సు: “కూలి పద్ధతి” 1949 ఏప్రిల్ ‘పొలిటికల్ ఎఫెయిర్స్’లో ప్రకటించబడింది.)

కాబట్టి ఆ చారిత్రక కాలంలో లభ్యం కాబడగల్గినటువంటీ, మామూలుగా ఉన్నటువంటీ జీవన ప్రమాణాన్నిబట్టీ, అతని శారీరక వాంఛలనుబట్టీ, కార్మికుని జీవితావసరములు నిర్ణయింపబడుతాయనీ, ఆ జీవితావసరముల విలువయే కార్మికుని శ్రమశక్తి విలువయనీ స్పష్టమగుచున్నది. ఇదే శాస్త్రీయంగా కూలిరేట్లనునిర్ణయించే పద్ధతి. ఇది మినహా మరే యితరమార్గాన్ని అవలంబించినా, అది కార్మిక శ్రమశక్తి విలువను పూర్తిగా చెల్లించకుండా దగా చేయుటకేనని గ్రహించగలం.

వ్యవసాయకూలీ కనీస జీవనభృతి నిర్ణయం

పై సూత్రాన్ననుసరించి, ప్రస్తుత పెట్టుబడిదారీ సమాజంలో, ప్రస్తుత వుత్పత్తిశక్తుల అభివృద్ధిదశకు అనుగుణ్యముగా, ఒక కార్మికుని గౌరవ ప్రదమగు జీవన ప్రమాణానికి అవసరమగు జీవితావసరము లేవి? వ్యవసాయకూలీకూడా పట్టణ కార్మికులవలెనే, తన శ్రమశక్తిని పెట్టుబడిదారీ రైతుకో, పెట్టుబడిదారీ భూస్వామికో అమ్ముకొని జీవించే కార్మికుడే కాబట్టి, వ్యవసాయకూలీ జీవన ప్రమాణానికి అవసరములగు జీవితావసరము లేమిటి? ఈ విషయాన్ని మనం చూడాలి.

భారతదేశంలో బూర్జువా అర్థశాస్త్రజ్ఞులే కార్మికుని జీవనప్రమాణమునకు కొన్ని పట్టికలను తయారుజేశారు. ఫెయిర్ వేజస్ కమిటీకూడా దాదాపు ఆ పద్ధతి నే అనుసరించి, కార్మికుని కనీస జీవన ప్రమాణమునకు అవసరమగు విషయములను నిర్ధారణ జేసింది. బూర్జువా ప్రతినిధులే తయారుజేసిన ప్రమాణం పెట్టుబడిదార్లకే అనుకూలంగా పక్షపాతదృష్టితో తయారు చేయబడి వుంటుందిగాని గొంతెమ్మ కోర్కెలతో నిండియుండదనుట స్పష్టం. కాబట్టి బూర్జువా ప్రవీణులూ, ఫెయిర్ వేజస్ కమిటీ సూచించిన జీవన ప్రమాణమునే అనుసరించి చూద్దాము.

ఒక కార్మికుడు కార్మికునుగా జీవిస్తూ కార్మిక సంతానాన్ని పెంచి పోషించాలంటే ఈనాటి అభివృద్ధి దశలో ఈ క్రింది విషయములు అవసరములని అంగీకరింపబడినవి. (1) పుష్టికరమగు తిండి, (2) వంటినిండా బట్ట, (3) నివాసయోగ్యమగు ఇల్లు, (4) వంట కట్టెలు, దీపాలు, (5) సామాన్య విద్యా, వైద్యసౌకర్యాలు, ప్రయాణం ఖర్చులు, సాంఘిక ఖర్చులు, పాత అప్పులపై వడ్డీ తీర్చుటకు కొంత మొత్తం, స్వల్పంగా వినోదాలు వగైరా.

ఈ ఐటములను వివరంగా చూద్దాము. వాటినిగూడా బూర్జువా ప్రవీణులే లెక్కగట్టారు గనుక అవేవీ అతిశయోక్తులుగా వుండజాలవుగదా? కేంద్ర ప్రభుత్వం నియమించిన ‘న్యూట్రిషన్ అడ్వైజరీ బోర్డు’ భారతదేశ ఆహార పద్ధతులను పరిశీలించి, ఒక యువకునకు, రోజుకు కావలసిన సమతూకపు ఆహారపదార్థముల పట్టికను తయారుచేసింది. దాని ప్రకారం రోజుకు కావలసినవి.

	ఔన్సులు
కాయధాన్యాలు	14
పప్పు ధాన్యాలు	3
ఆకుకూరలు	4
కాయగూరలు	3
దుంపకూరలు	3
పండ్లు	3
పాలు	10
పంచదార, బెల్లం	2
నేయి, నూనె వగైరా,	2
మాంసం, చేపలు	3
కోడిగుడ్డు (సంఖ్యలో)	1

వీటికి ఉప్పు, కారం, చింతపండు కొద్దిగా జేర్చాలి.

ఇక బట్టలు, పాదరక్షల విషయం. నెహ్రూ అధ్యక్షతన పనిజేసిన నేషనల్ ప్లానింగు కమిటీవారు మనిషి 1కి ఏడాదికి 30 గజాల గుడ్డ కావాలన్నారు. ఇతర దేశాలతో పోల్చిచూస్తే ఇది చాలా తక్కువయేయైనా, ప్రస్తుత అభివృద్ధిననుసరించి ఇది సగటు ప్రమాణం అని తీసుకొందాం.

ఇంటి విషయం. పట్టణాలలోనైతే కార్మికులు అద్దెను చెల్లించాలి: పల్లెటూళ్ళలో వ్యవసాయకూలీకి నివాసయోగ్యమైన ఇంటిని కల్పించినపిదప, దానికి ప్రతియేటా మరమ్మతు ఖర్చులను కలుపుతూ వుండాలి. ఇంటికి ఒక లాంతరూ, ఒక కిరోసిన్ బుడ్డీ వుండాలనుకున్నా నెల 1 కి 4 సీసాల కిరోసిన్ కావాలి.

ఇదేవిధంగా వంటకట్టెలు

ఇక ఆఖరు ఐటమగు సాదరుఖర్చులు. దీనిని వేర్వేరు కమిటీలు వేర్వేరువిధాలుగా నిర్ణయించినవి. తాతా - బిర్లా ప్లానులో విద్యా వైద్యసౌకర్యాలు మాత్రమే జేర్చబడినవి. ఫెయిర్ వేజస్ కమిటీవారు, వీటికితోడుగా, సాంఘిక ఖర్చులనూ, వినోదసౌకర్యాల ఖర్చులనూ చేర్చారు. బొంబాయి కార్మికకుటుంబాల బడ్జెట్లను పరిశీలించిన ప్రభుత్వకమిటీ, అప్పులపై వడ్డీలనూ, ప్రయాణంఖర్చులనూ, త్రాగుడు ఖర్చులనూ జేర్చింది. వాస్తవంగా ఈనాడు ఇవన్నీ వ్యవసాయకూలీలకుగాని, ఇతర కార్మికులకుగాని తప్పనిసరిగా అవుతూవున్నదే. పండగలకూ, పబ్బాలకూ అయ్యేఖర్చులూ, అప్పుడప్పుడూ తగిలే ప్రయాణంఖర్చులూ, చుట్ట, బీడీ, వక్కాకులు (ఇవి చాలా ప్రాంతాలలో జీవితావుసరముల క్రిందనే లెక్కించి, జీతాల క్రింద యివ్వబడుతూనేవున్నవి) మున్నగు వాటిపై ఖర్చులూ, పాత అప్పులపై వడ్డీలూ (నికృష్టజీతాలు చాలక, బ్రతుకు భారమై, చేసినఅప్పులూ, వాటిపై చెల్లించే వడ్డీలూ జీవితావుసరములలోనే చేర్చక తప్పదు) అందుగా తగిలే సినిమా ఖర్చులూ, ఏవీ తప్పించుకో వీలులేనివి. 'వెట్టిపుట్టినవారికే ఇవన్నీగాని కూలి వాళ్ళకు కూడానా?' అనే ధనికవర్గాల ఈసడింపులన్నీ అవతలపెట్టి వీటిన్నింటిని కార్మిక కుటుంబాల జీవన ప్రమాణంలో జమకట్టితీరవలసిందే. యదార్థానికి, అనేక ప్రభుత్వ కమిటీలుకూడా వీటిని అంగీకరించియే వున్నవి.

ఇవి ఒక్క మనిషికి కావలసిన జీవితావుసరములు మాత్రమే. కాని మనం పైన జూచినట్లుగా, శ్రమశక్తి విలువ ఆ ఒక్క కార్మికుని జీవన పోషణవల్లనేగాక, కార్మికసంతానాన్ని పెంచిపోషించుటకు వుపయోగు పదార్థముల మొత్తంవల్ల గూడా నిర్ణయింపబడుతుంది. అంటే, సామాన్యార్థంలో చెప్పాలంటే, కార్మిక కుటుంబంలో ఒక ఆర్జనపరుడున్నాడంటే, అతని ఆర్జనపై ఆధారపడి ... డిపెండెంట్లు ఒకరో

ఇద్దరో వుంటారన్న మాట. ఈడిపెండెంట్లు ఎంతమంది అనే విషయాన్ని మనం చూడాలి. ఫెయిర్ వేజస్ కమిటీయేదీన్ని గూర్చి ఒక ప్రమాణాన్ని నిర్ణయించింది. కార్మిక కుటుంబంలో పురుషుని ఆర్జనపై అతను గాక మరి ఇద్దరు పెద్దవారు ఆధారపడి బ్రతకాలనీ, స్త్రీ ఆర్జనపై ఆమెగాక మరొక పెద్దవారు ఆధారపడి జీవించాలనీ నిర్ణయించారు. ఆడ, మగ, కూలీ రేట్లలో వ్యత్యాసాన్ని సమర్థించుటకై వారి డిపెండెంట్ల విషయంలో వ్యత్యాసం జూపారే గాని నిజానికి ఇందుకు ఆధారం ఏమీలేదు. ఒక సామాన్య వ్యవసాయకూలీ కుటుంబాన్ని గనుక తీసుకుంటే ఆర్జనపయలగు ఇద్దరు భార్యాభర్తలు వుంటారనీ, ఇద్దరు పిల్లలు వుంటారనీ, పెట్టుబడిదారీ వర్గానికి లోగడ శక్తినంతా ధారపోసి నేడు శక్తివుడిగి వున్న ఒక వృద్ధుడో వృద్ధురాలో వుంటుందనీ అనుకోనవచ్చును. ఇది సగటు కుటుంబం. ఇద్దరు పిల్లలనుగనక ఒక పెద్ద క్రింద లెక్కగడితే, ఆ సగటు కుటుంబంలో నల్గురు పెద్దవారు వుంటారనీ వారిలో ఇద్దరు ఆర్జనపరులనీ తెలుసుకొనగల్గుతాము.

(శ్రమశక్తి నిజవిలువను తెలుసుకొనే సరియగు పద్ధతి ఇదే. కాని బూర్జువా అర్థశాస్త్రజ్ఞులు, ఈ పిల్లలుకూడా ఏ గొడ్లనో కాచి తెచ్చే ఇరస, తూమెడు గింజలనూ, వృద్ధుడు ఏ చేను కాపలాకో వెళ్ళి తెచ్చే ఒకటి, రెండు, కుంచాల ధాన్యమునూ లెక్కగట్టి ఆదాయాన్ని తేలుస్తారు. వీటిని 'పైసంపాదన' (సైడ్ ఎర్నింగ్సు) అంటారు. కాని, ఈనాడున్న దుర్భరపరిస్థితులవల్ల శ్రమశక్తికి తగిన విలువముట్టక, కరువుకూలి మాత్రమే ముట్టుతూవుండటంవల్ల బొడ్డూడని పసిపిల్లవాడూ, [illegible]ళు చాచుకున్న ముసలికూడా పనిచేయవలసి వస్తున్నది. కాని, శాస్త్రీయంగా శ్రమశక్తి విలువను తేల్చేటప్పుడు వారి శ్రమనుగాని వారి పైసంపాదననుగాని, లెక్కవేయం. కార్మికుని శ్రమశక్తికి తగిన ధర ముట్టుతూ వుంటే పిల్లలు చదువుకొంటూ వుంటారుగాని గొడ్లు కాచుకొనుటయెందుకు? ముదుసలి విశ్రాంతి జీవనాన్ని గడుపుతాడుగాని మంచెకావలి కాయటం ఎందుకు? కాబట్టి నల్గురు పెద్దలున్న కార్మిక కుటుంబంలో ఇద్దరు ఆర్జన పరులనీ వారి ఆర్జనమీదనే మొత్తం నల్గురూ జీవించాలనీ గుర్తించాలి. తనకుటుంబంలో చిన్న మెత్తుపని చేయకుండా, తానుకూడా గట్టుమీద నిలబడి కర్రపెత్తనం జేస్తూవుండే భూస్వామికిమాత్రం కుటుంబమంతటికీ సుష్టుగా కావలసినంత ముట్టాలా? కార్మికునకు మాత్రం, అతని కష్టార్జితంలో అతని బిడ్డలు భాగం పంచుకొని జీవించరాదా? ఇదెక్కడి న్యాయం!) కాబట్టి ఇద్దరు ఆర్జనపరుల ఆర్జనపై ఐదుగురు పెద్దవారు బ్రతకాలన్న ఫెయిర్ వేజస్ కమిటీ లెక్కంకన్న ఇద్దరు ఆర్జనపరుల ఆర్జనపై నల్గురు పెద్దలు బ్రతకాలన్న లెక్కయే వాస్తవ పరిస్థితులకు సరిపడి వుంటుందని భావించి ఆ కుటుంబాన్నే ప్రమాణంగా తీసుకొని లెక్కజూద్దాము.

పైన వివరింపబడిన జీవన ప్రమాణాన్ననుసరించి నల్గురు పెద్దలుగల వ్యవసాయకూలీ కుటుంబానికి ఏడాదికి కావలసిన మొత్తం ఎంత?

పామఱ్ఱు (కృష్ణాజిల్లా)లో ఈ ఏడాది ప్రారంభంలోవున్న ధరలనుబట్టి ఈ జీవితావసరముల ధరలను ఈక్రింది విధంగా తేల్చవచ్చును.

భోజనం: నెల 1కి మనిషికి 35-6-0 చొ॥న	1698-0-0
కట్టుబట్టలు, తుండ్లు, దుప్పట్లు వగైరాలన్నీ సగటున గజం 1కి రు 1 చొ॥న 120 గజాల ధర.	120-0-0
పాదరక్షలు	5-0-0
గ్రామంలో ఇంటి మరమ్మతులు మాత్రం	10-0-0
వంటకట్టెలు, దీపాలు	15-0-0
విద్యా వైద్య సౌకర్యాలు, ప్రయాణం ఖర్చులు, వడ్డీ తీర్మానము, వగైరా సాదరు ఖర్చులు మొత్తంబడ్జెటులో 5% మాత్రమే ననుకొంటే (బొంబాయి రాష్ట్రములో కార్మిక కుటుంబాల బడ్జెట్లను పరిశీలిస్తే, ఈ సాదరు ఖర్చులు మొత్తం బడ్జెటులో ఈ క్రింది శాతంలోవున్నవని ప్రభుత్వ కమిటీయే తెల్పింది.	
	1848-0-0

బొంబాయి	: 25.73
అహమ్మదాబాదు	: 23.95
షోలాపూరు	: 13.66
జబల్పూరు	: 13.75
మద్రాసు	: 25.06

కాబట్టి గ్రామాలలో ఈ సాదరు ఖర్చులు, మొత్తం బడ్జెటులో 5% వుంటాయనటం తక్కువ అంచనాయేగాని ఎక్కువ ఏమీకాదు.) 100-0-0

మొత్తం కుటుంబానికి ఏడాదికి 1948-0-0

ఈ పై పట్టిక ప్రకారం ఒక కార్మిక కుటుంబానికి, గౌరవ ప్రదమగు జీవనం గడుపుటకు, ఏడాదికి కనీసం రు 1950/ కావాలని తేలుచున్నది. ఈ రు 1950/లనూ ఆ కుటుంబంలోని ఆర్జనపరులగు ఇద్దరు పెద్దవారూ సంవత్సరం మొత్తం మీద సంపాదించాలి. దీనిని బట్టియే వారి శ్రమశక్తి రోజు విలువను నిర్ణయించాలి.

సెలవులు, విశ్రాంతి గూడా జీవనప్రమాణములోనివే

అయితే ఇక్కడ మరొక్క విషయాన్ని కూడా లెక్కలోనికి తీసుకోవాలి. ఈ జీవనవ్యయాన్ని ఆ కార్మిక కుటుంబంలోని భార్యా భర్తలు సంవత్సరం పొడుగునా రోజుల్లా పనిచేసి సంపాదించాలా? లేదు. కార్మికుడు ప్రతిదినం విశ్రాంతి తీసుకొనడమేగాక, సంవత్సరం మొత్తం మీద కొన్ని దినాలు విశ్రాంతి తీసుకుంటూనే పనిచేస్తాడు. కార్మికుని జీవన ప్రమాణంలో యీ విశ్రాంతి అనేదికూడా ఒక ముఖ్య విషయమే. ఉత్పత్తి శక్తులు వృద్ధియై, మానవుడు ఆటవికదశనుండి విడివడినప్పటినుండి అతని శారీరక, మానసికాభివృద్ధికొరకూ ఆనందమయ జీవితంకొరకు విశ్రాంతి అనేది అత్యంతావశ్యక మగుచున్నది. యంత్రయుగం ప్రారంభమై, మానవుని శ్రమ సులభతరం చేయబడిన పిమ్మట విశ్రాంతి యనేది మానవుని హక్కుగానూ, జీవితావసరముగానూ పరిగణింపబడుతూ వచ్చింది. స్వేచ్ఛగా గడిపే కాలం లేకుండా జీవించే మానవుడు; కేవలం తిండి, నిద్ర మున్నగు శారీరక విశ్రాంతి కాలం మినహా యితర జీవితకాలమంతా

శ్రమతో పెట్టుబడిదారుకు చాకిరీ చేస్తూవుండే మానవుడు; బండ చాకిరీ జేసే పశువుకు ఏమీ తక్కువ కాదు. నడుం వంగిపోయి, బుద్ధి బండబారిపోయి కేవలం ఇతరులకు సంపదలను సంపాదించి పెట్టే యంత్రం మాత్రమే అతడు" అని విశ్రాంతి నెరుగని కార్మికుని గూర్చి మార్క్స్ తెలియజేశాడు. చివరకు బూర్జువావర్గంకూడా కార్మికులకు సెలవులను వారి హక్కుగా గుర్తించి, అందుకు కొన్ని ప్రమాణాలను నిర్ణయించింది. మన రాష్ట్రంలో షాప్ ఎంప్లాయిస్ చట్టం ప్రకారం సంవత్సర జీతగాళ్ళకు, వారానికి ఒకరోజూ, సంవత్సరం మొత్తంమీద సిక్, ప్రివిలేజి, క్యాజువల్ లీవూ క్రింద 36 రోజులు సెలవులుగా ప్రభుత్వం నిర్ణయించింది. కాని ఇవి బహు నికృష్టమగు సెలవులు. అందుచేతనే వారానికి ఒక రోజూ, పెద్ద పండుగలకు 8 రోజులూ, సిక్, ప్రివిలేజి, క్యాజుయల్ లీవులలో ఒక్కొక్కదానిక్రింద 15 రోజుల చొ॥ 45 రోజులు మొత్తం 105 రోజులు సెలవులను కార్మికవర్గం కోరుచున్నది. ఈ విధంగా సంవత్సరం మొత్తంమీద 105 రోజులు సెలవులు పొంది 260 రోజులు పనిజేసియే తమ కుటుంబ పోషణకు అవసరమగు మొత్తాన్ని ఆర్జించాలన్నమాట.

ఈ సెలవులకుతోడు రోజు పనిగంటల ప్రమాణం ప్రశ్నకూడా వున్నది. కార్మిక సమ్మెలలో సగంసమ్మెలు ఈ ప్రశ్న మీదనే బయలుదేరుచున్నవి. అదే కూలికి ఎక్కువ గంటలు పనిచేయించుకొనటం ద్వారా ఎక్కువ అదనపు విలువనుగుంజి, ఆవిధంగా ఎక్కువ లాభాలను తీయాలని పెట్టుబడిదారు చూస్తాడు. నిరుద్యోగ సైన్యం - దీనినే 'పారిశ్రామికనిల్వసైన్యం' అని మార్క్స్ పిల్చాడు - అత్యధికంగా వున్న భారతదేశంలో కార్మికుల పనిగంటలకు వాస్తవంలో హద్దనేదేలేకుండా పోయింది. మద్రాసురాష్ట్రంలో 1931 జనాభా రిపోర్టుప్రకారమే 100 కి 43 గా వున్న (1930 ఆర్థికసంక్షోభం తర్వాత రైతాంగం మరీ చితికిపోయి, వ్యవసాయ కూలీలసంఖ్య మరీ పెరిగింది) వ్యవసాయ కూలీలవిషయంలో పనిగంటల నిర్ణయమనేది లేదు. పాలేళ్ళు రోజంతా పొలంలోనే పనిజేస్తూ పడివుండేరోజులు సెలలతరబడి కూడా వుంటాయి. ఇక పారిశ్రామిక కార్మికులలోకూడా, ఫ్యాక్టరీఆక్టుక్రిందకు వచ్చేవారికే పనిగంటలు నిర్ణయింపబడ్డాయి. అయినా, అనేకసందర్భాలలో 10, 12 గంటలు వుంటున్నవి. కాబట్టి పనిగంటలనిర్ణయమనేది పెట్టుబడిదార్లకూ కార్మికులకూ మధ్య జరిగే పోరాటాలలో ఒక ప్రధానసమస్యగా వుంటూవున్నది. చివరకు పెట్టుబడిదార్లుకూడా వారానికి 48 గంటలూ, రోజుకు 8 గంటలూ పనిని సిద్ధాంతరీత్యానైనా అంగీకరించారు. బట్టల పరిశ్రమ, గనులపరిశ్రమ, ఇనుము, ఉక్కు పరిశ్రమ మున్నగువాటిలో 8 గంటలపని ఆచరణలో పెట్టబడింది. కాని కార్మిక వర్గం వారానికి 40 గంటలు, రోజుకు 7 గంటలు పనినే డిమాండు చేస్తున్నది. (అ. భా. ట్రే. యూనియన్ కాంగ్రెసు తీర్మానం: 1949) రోజుకు 7 గంటలు పనిజేసినప్పుడే అతనికి పగలు ఒకగంటయైనా విశ్రాంతియనేదిలభిస్తుంది. కాబట్టి కార్మికుని జీవనప్రమాణాన్ని నిర్ణయించటంలో సంవత్సరానికి 105 రోజులు సెల

వులు, రోజుకు 7 గంటల పనియనీ మాత్రమే లెక్కించాలి.

ఈ పైవిషయము లన్నిటినీ అర్థంజేసుకొన్న పిదప, రోజుకూలిరేటును నిర్ణయించటం సులభమే. సంవత్సరం మొత్తం మీద, అనగా, పనిచేయవలసిన260 రోజులలో, నల్గురు పెద్దలుగల కుటుంబంలో, ఇద్దరుఆర్జనపరులుకలిసి; కుటుంబవ్యయానికి కావలసిన మొత్తం రు 1950 లను సంపాదించాలన్నమాట. అంటే ఒక్కొక్కరు రోజుకు రు 3-12-0 ను సంపాదించాలన్న మాట. ఇది ఒక్క కార్మికుని సామాన్య శ్రమశక్తి విలువ. ఈ కూలి అతనికి గిట్టినప్పుడే అతని సరుకగు శ్రమశక్తిని కార్మికుడు, కూలి మార్కెటులో, సరియగు ధరకు అమ్మకొనగల్గుతాడన్న మాట.

(కాని పరిశ్రమలలో, కొంతగాని, ఎక్కువగానీ నైపుణ్యంగల శ్రమకు ఇంతకన్న ఎక్కువకూలిగావాలి. ఏలాంటి నిపుణత్వం అవసరంలేకుండా, బండపని చేసే కార్మికుల శ్రమశక్తియొక్క నేటి రోజువిలువయే రు 3-12-0.)

కాని పెట్టుబడిదారీ ప్రతినిధులనూ, సోషలిస్టు నాయకులనూ, కార్మిక ద్రోహులనూ కల్గివున్న ఫెయిర్ వేజస్ కమిటీ నిర్ణయించినది ఈ జీవనభృతినేనా? వారు శ్రమశక్తికి ఈవిధంగానే విలువను కట్టి కూలిరేట్లను నిర్ణయించ బూనుకొన్నారా? రామ! రామ! అటువంటిదేమీలేదు. వారిదృష్టిలో ఇది ఆదర్శప్రాయంమాత్రమే. పెట్టుబడిదార్లు వారి లాభాలను తగ్గించుకోలేరు కాబట్టి కార్మికులకు జీవనభృతి, అనగా శ్రమశక్తి విలువ, చెల్లింపబడ లేదట. కాబట్టి కార్మికులు సంతృప్తిపడవలసినది 'న్యాయమగు కూలి'తోనే, ప్రస్తుతం పెట్టుబడిదార్ల మధ్యనూ, కార్మికుల మధ్యనూ రాజీగా అంగీకరింపబడిన నికృష్ట సూత్రాలతోనే. ఇదీ కమిటీ చేసిన నిర్ణయం.

కార్మికుల మధ్యనూ, పెట్టుబడిదార్ల మధ్యనూ రాజీగా అంగీకరింపబడిన కూలి రేట్లే న్యాయమగు కూలిరేట్లు అని కమిటీ తెల్పడంకన్న కార్మికవర్గానికి ద్రోహం మరొకటి వుండబోదు. పైకి రాజీ అని ఎంత జెప్పినా నిజానికి ఆ కూలిరేట్లు కార్మికుల కడుపులుమాడ్చి, వాళ్ల నెత్తిపై బలవంతంగా రుద్దబడినవే. అణా కూలిని ఎక్కువ అడిగితేనే తుపాకీగుండ్లను ఎదుర్కొనవలసివచ్చే ఈ దినాలలో - పెట్టుబడిదార్లు పిల్చగానే పోలీసులు పరుగెత్తుకొనివచ్చే ఈ కాలంలో.-ఉత్పత్తి సాధనాలూ, రాజ్యాంగయంత్రమూ పెట్టుబడిదార్ల స్వాధీనంలోనేవున్న ఈ దశలో,- కార్మికులకూ, పెట్టుబడిదార్లకూ కూలి రేట్ల విషయంలో రాజీ జరగటమనేది హుళక్కి. రాజీ అనేది తుపాకిమొనలతో కార్మికుల గొంతులలో కూరబడిన రాజీకాక మరేమీకాదు. ఆంధ్రరాష్ట్రములో మున్సిపల్ కార్మికులకూ, మున్సిపాలిటీలకూ రాజీగా అంగీకరింపబడిన రు 18 లూ 'న్యాయమగు' కూలిరేటు అని హృదయంగల మానవుడెవ్వడైనా చెప్పగలడా? కాని కమిటీ ఈ కూలి రేటునే 'న్యాయమగుకూలి' రేటు అని సిద్ధాంతీకరిస్తున్నది. ఇక ఈ కమిటీ 'న్యాయం' ఎంతమాత్రమూ చెప్పకనే తెలుస్తున్నది.

ఒక వుదాహరణను చూద్దాము. కృష్ణా జిల్లాలో కొన్ని గ్రామాలలో, పాలేళ్ళకూ ధనికరైతులు, భూస్వాములకూ కుదిరిన ఒడంబడిక ప్రకారం 25 బస్తాల వరిధాన్యం జీతంగా నిర్ణయింపబడింది. (ఈ జీతం

బహుకొద్ది గ్రామాలలోనే. అనేకవందల గ్రామాలలో 20 బస్తాల జీతంకూడాలేదు. అయితే ఈ 25 బస్తాల వల్లేనా అతని శ్రమశక్తి విలువ? వ్యవసాయకూలి శ్రమశక్తివిలువఏమిటో పైన శాస్త్రీయంగా చూశారు. రోజుకు 7 గంటల పని చొ॥న 260 దినాల శ్రమశక్తి విలువ రు 975 లు: కాని సెలవలనేవి ఏమీ లేకుండా, కనీసం 350 రోజులు, రోజుకు 10, 14 గంటలు కూడా పనిజేస్తే, ఈనాడు ముట్టేది ఏంత? 25 బస్తాలు × 16-4-0 = 406-14-0 అంటే రు 3-12-0 శ్రమశక్తిరోజు విలువకు రు 1-2-7 మాత్రం ముట్టుచున్నది. దీనినే 'న్యాయమగు' కూలిగా భావించమంటుంది 'ఫెయిర్ వేజస్' కమిటీ !

బంగారు పిచ్చుకలో బంగారం ఎంత ఉన్నదో, ఈ ఫెయిర్ వేజస్ కమిటీ సూచనలలో అంత 'ఫెయిర్ నెస్' వున్నది.

ఆడ మగ కూలీరేట్లలో భేదం దోపిడికొరకే

ఈ సందర్భంలోనే ఆడ, మగ, కూలి రేట్లలో చూపబడే నేటి విచక్షణను పరిశీలించాలి. స్త్రీ పురుషునికన్నా తక్కువ పనిజేస్తుంది. కాబట్టి తక్కువ కూలి యివ్వటం న్యాయమే అనేది నేటి బూర్జువా సిద్ధాంతం. ఫెయిర్ వేజస్ కమిటీకూడా, పూర్తిగా బహిరంగంగా కాకపోయినా, దొడ్డిదోవనైనా ఈసిద్ధాంతాన్ని తన సూచనలలో ఇరికించింది. స్త్రీలే పూర్తిగా పనిచేసే చోట్లనూ, లేక స్త్రీలు పనిజేసే పరిశ్రమలలో వుత్పత్తి తక్కువగావున్న చోట్లనూ మాత్రం పురుషులకన్న స్త్రీకి తక్కువ కూలి యివ్వవచ్చునని కమిటీ సూచించింది. దీనిని సమర్థించుకొంటానికే, పురుషునిపై ఇద్దరు ఆధారపడి జీవిస్తే స్త్రీపై ఒక్కరే ఆధారపడుతారని కమిటీ సిద్ధాంతీకరించింది.

కార్మికులను దోచుకొనుటకు సమర్థించుటకై పెట్టుబడిదారీవర్గంచే సృష్టించబడిన దగావాదన తప్పితే ఇందులో సత్యమేమాత్రమూలేదు. కార్మికుని కూలిని విరగగోసి తన జేబులను నింపుకుంటానికై ఏ వాదనయైనా సరే పెట్టుబడిదారుకు మంచి వాదనగానే కన్పిస్తుంది. కాని శాస్త్రీయంగాజూస్తే; స్త్రీ పురుష అను కువిచక్షణ జూపటం ఎంత మాత్రం సరికాదు. నేడు వుత్పత్తిలో అత్యధికభాగం ఆధునిక యంత్ర పరికరముల సహాయంతోనే చేయబడుచున్నది. మానవ శక్తి కేవలం ఈ యంత్రశక్తిని అభివృద్ధిజేస్తూ దానిని నడిపేదిగా మాత్రమే తయారయింది. ఇటువంటి యంత్రశక్తి అభివృద్ధిదశలో శ్రమజేయడంలోగానీ, ఉత్పత్తి చేయడంలోగానీ స్త్రీపురుషుల మధ్య ఏలాంటి భేదాన్ని చూపవలసిన అవుసరంలేదు. యంత్రశక్తినే గనుక సరిగా వినియోగిస్తే, టెక్నికల్, సైంటిఫిక్ పరిజ్ఞానాన్నే గనుక సరిగా కల్గజేస్తే స్త్రీ పురుషునికి ఏమాత్రం తీసిపోదని ఆధునిక యంత్రోత్పత్తిచరిత్ర తెలియజేస్తున్నది. (ముదితల్ నేర్వగరాని విద్యగలదే ముద్దారనేర్పించినన్' అని ఆస్తిపరులు చెప్పే నీతియేగదా ?) కేవలల్ గా, శాస్త్రీయదృష్టితో యంత్రశక్తిని పరిశ్రమలకూ వ్యవసాయానికీ వినియోగించే సోవియటు యూనియన్‌లో అనేకవేల, లక్షల స్త్రీలు ఉత్పత్తిరంగంలో ప్రథమశ్రేణిలో నిలబడి వున్నారనీ, 'సోవియట్ కార్మికవీరులు' అనే ఉత్తమోత్తమ బిరుదులను

సంపాదించారనీ తెలుసుకుంటే, స్త్రీ పురుషుల శ్రమలో విచక్షణను జూపటం పెట్టుబడిదార్ల దోపిడీకి అది ఒకమార్గంగాక మరేమీకాదని తెలియగలదు. ఒక బట్టల మిల్లులో, కదుళ్ళవద్దనో, మగ్గాలవద్దనో పనిజేసే పురుషులెంతపనిని చేయగలరో స్త్రీలుకూడా అంతే చేయగలరు. కాని స్త్రీకి 'అబల' అని పేరు పెడుతూ, తక్కువపనిజేస్తుంది అని దొంగకబుర్లు చెప్తుతూ, తక్కువకూలిని ఇస్తానికిగాను బూర్జువావర్గం కొత్తకొత్త సిద్ధాంతాల నన్నిటినీ బయలుదేరదీస్తున్నారు.

భారత దేశంలో యంత్రబలాన్ని ఉపయోగించని వ్యవసాయాన్ని చూచినా ఇదేకన్పడుతుంది. కారు చవుకగా వస్తున్నది గదాయని పూర్తిగా కార్మిక శ్రమశక్తినే వుపయోగిస్తూ ధనిక రైతులూ, భూస్వాములూ ఆధునిక యంత్రములనూ, నూతన శాస్త్రీయ పరిశోధనలనూ వినియోగించటంలేదు. కాని ఇట్లా వ్యవసాయములో పనిచేయించే స్త్రీ పురుష కూలీల మధ్య పని ఒత్తిడిలో మాత్రం భేదమేమీ చూపబడుటలేదు ఊడ్పులలో స్త్రీలే బాగా పనిచేస్తారని ధనిక వర్గాలవారే చెపుతూ వుంటారు. అందుకే ఊడ్పులలో స్త్రీలనే ఎక్కువగా నియోగిస్తూ వుంటారు. కోతలలోకూడా స్త్రీలు పురుషులతోబాటు మునుంబట్టి సమానంగా కోస్తూ వుంటారు. కాబట్టి పనిని పిండటంలోమాత్రం యజమాని స్త్రీ పురుషుల మధ్య ఏమీ భేదం చూపడు: ఇద్దరిమీదా ఒకే రీతిగా సవార్లుజేస్తూ, ఒకే ప్రమాణములో ఇద్దరి శ్రమశక్తినీ ఓడుస్తాడు. కాని తీరా కూలి నివ్వవచ్చేసరికి మాత్రం వారు స్త్రీ పురుషులుగా కన్పిస్తారు. స్త్రీ తక్కువది అనే దృష్టిలో తక్కువ కూలిని ముట్టజెప్తాడు.

సమాజంలో వర్గ విభేదాలేర్పడి, స్వంత ఆస్తి హక్కులు పుట్టి, ఎప్పుడైతే తల్లి హక్కు కూలద్రోయబడిందో తండ్రి హక్కు, ఆవిధంగా పురుషుని ఆధిక్యత నెలకొల్పబడిందో అప్పటినుండీ ఈ వర్గ సహిత సమాజంలో స్త్రీ హీనంగా చూడబడుతూవున్నది. జీవనాధారములనన్నిటినీ తన స్వంతఆస్థిగా పెట్టుకొన్న ఆస్థిపరుల వర్గాలలోని పురుషుడు స్త్రీని తన బానిసగా, తన బిడ్డలను కనే యంత్రంగా చూస్తూ వస్తున్నాడు. స్త్రీ అబల, నిస్సహాయ. అష్టావక్రునితో ఉత్తరదిశ చెప్పినట్లుగా స్త్రీకి బాల్యంలో తండ్రి, యౌవనంలో భర్త, వార్ధక్యంలో కుమారుడు సంరక్షకులుగా వుండి పోషించాలి. ఆమె విద్యను నేర్చుకుంటానికి గాని, ఆస్థినికల్గి వుంటానికిగాని, స్వయముగా ఆర్జిస్తానికి హక్కు కల్గిలేదు. (ఇది ఆస్థిపరుల వర్గాలకు మాత్రమే. బానిస వర్గాలలో స్త్రీపురుషులందరూ పనిచేయవలసిందే.) ఈ దోపిడి సూత్రమే బానిస వ్యవస్థనుండి నేటి పెట్టుబడిదారీ వ్యవస్థ వరకూ సమాజంయొక్క అన్ని అభివృద్ధి దశలలోనూ అనుసరింప బడుతూ వచ్చిన ధర్మసూత్రం. స్త్రీ స్వాతంత్ర్యాన్ని గూర్చి గొంతులు చించుకుంటూ ఉపన్యాసాలిచ్చే కాంగ్రెసు నాయకులకూ, సోషలిస్టు నామధారులకూ, నేడు కూలి విషయంలో ఈ 'ధర్మమే' శరణ్యమైనది.

బూర్జువా నాగరికత వాతావరణంలో బ్రతికే కార్మికవర్గంలోనూ, ఇతర కష్టజీవులలోనూ, ఈ బూర్జువా వాతావరణ ప్రభావంవల్ల, స్త్రీ పురుషునికన్న తక్కువ అనే భావాలు కొద్దిగావున్నా, అవి

ణలో మాత్రం చాలా తక్కువగానే వున్నవి. స్త్రీ కూడా ఈ వర్గాలలో స్వంతంగా ఆర్జనపరులుగావటంవల్లనే ఎక్కువ గౌరవంతో, పురుషునితో సమానురాలుగా చూడబడుతూ వున్నది. పురుషునితోబాటు సమానంగా శ్రమజేస్తూ కొన్ని సందర్భాలలో ఎక్కువగాకూడా పనిజేస్తూ, పెట్టుబడిదార్లకు సంపదలను సృష్టించి యిస్తూన్నది కార్మిక స్త్రీ. కాబట్టి కార్మికదృష్ట్యా ఈ స్త్రీ పురుష కూలి విచక్షణ యనేదానికి తావులేనేలేదు. శ్రమశక్తిని దోచుకోనటం అనే పెట్టుబడిదారీ దృష్ట్యాకూడా స్త్రీ పురుష శ్రమమధ్య ఏలాంటి విచక్షణా చూపబడటంలేదు. మరి కూలిరేట్లలో విచక్షణ ఎందుకు ?

ఇంతేకాదు: శ్రమశక్తి విలువదృష్ట్యా అసలు ఈ విచక్షణకు ఆధారమేమీలేదని తెలియగలదు. పురుషునితోపాటు స్త్రీ కూడా రోజుకు 7 గంటలు పనిజేస్తే, కోల్పోయిన శ్రమను తిరిగి సంపాదిస్తానికి పురుషునికి కావలసినన్ని అవసరములనూ పొందాలి: నిజానికి, సంతానమును కని, పెంచి, పోషించే వ్యక్తి కాబట్టి ఎక్కువ కూడా కావాలి. ఇందుకనే మాతా శిశు పోషణాలయములు, క్రెచీలు మున్నగునవి ఏర్పడి కుటుంబఖర్చులలో కొంతభాగాన్ని స్టేట్ భరించవలసిరావడం సోవియట్ యూనియన్‌లోనూ, నూతనప్రజాస్వామిక దేశాలలోనూ, ఇట్టి సౌకర్యాలను కల్గజేస్తూనే స్త్రీ పురుషులకు సమాన పనికి సమాన జీతములివ్వబడుచున్నవి. కాబట్టి స్త్రీలకు తక్కువకూలి అనేది పెట్టుబడిదార్ల దోపిడికి ఒకమార్గం తప్ప మరేమీ కాదు.

పెట్టుబడిదార్లు ఎన్ని సిద్ధాంతాలను లేవదీస్తూ, ఎటువంటి వాదనలనుజేస్తూ వున్నా కార్మిక వర్గంమాత్రం స్త్రీపురుష కార్మికులమధ్య కూలి విషయంలో ఎట్టి భేదాన్నీ చూపదు. అందువల్లనే 'స్త్రీ పురుషులకు సమానకూలి', 'సమాన పనికి సమానకూలి' యనేది విప్లవ కార్మికవర్గం యొక్క ఒక ప్రధాన నినాదంగా వుంటూ వున్నది. నేడు ప్రపంచ కార్మిక సంఘాల సమాఖ్యకూడాఇదేకోర్కెనుకోరుచున్నది.

వాస్తవానికి కొన్ని ప్రధాన పెట్టుబడిదారీ దేశాలలోకూడా ఈ సూత్రం అంగీకరింపబడియే వున్నది. పెట్టుబడిదారీ ప్రపంచానికి నాయకత్వం వహించిన యునైటెడ్ స్టేట్సులో, రాష్ట్రాలమధ్య వ్యాపారంజరిగే పరిశ్రమలలో, స్త్రీ పురుషులకు సమానకూలి ఏర్పాటైవున్నది. ఫెడరల్ సివిల్ సర్వీసులలోనూ, స్టేట్ సివిల్ సర్వీసు అధిక భాగంలోనూ సమాన వేతనములున్నవి. నాజీ పాలననుండి విముక్తినొందిన తర్వాత ఫ్రాన్సులోగూడా ఇవి అంగీకరింపబడినవి. బ్రిటన్‌లో రాయల్ కమిషన్ మెజారిటీ ఈ సూత్రాన్ని సిద్ధాంతరీత్యా వ్యతిరేకించక పోయినా, ఆర్థిక వాదనల బలంవల్ల అంగీకరించలేదు. కాని మైనారిటీ రిపోర్టులో, స్త్రీ పురుషులకు సమానపనికి సమానజీతం యివ్వాలని సిఫార్సుగా పంపబడింది. చిన్న దేశాలలో ఉరుగ్వేవంటి వాటిలోకూడా స్త్రీ పురుషులకు సమాన వేతనములు యివ్వబడుచున్నవి ఇక సోవియట్ యూనియన్ సంగతి చెప్పనే అక్కరలేదు. రాజ్యాంగచట్టం సె. 122 ప్రకారం, స్త్రీ పురుషులకు సమానపనికి సమానజీతం యివ్వాలనే సూత్రం నిబంధించబడింది. నూతన ప్రజాతంత్ర దేశాల రాజ్యాంగ చట్టాలలోకూడా ఈ సూత్రం పొందుపర్చ బడింది.

కాని ఈ కమిటీలోని సోషలిస్టు నామధారులుకూడా ఆడ మగ కూలి రేట్ల విషయంలో విచక్షణ చూపుటకు అంగీకరించారంటే వారి సోషలిజంలోని బండారం ఏమిటో, స్త్రీలయెడ వారికిగల గౌరవ ప్రపత్తులేమిటో, వారి అసలు రంగు ఏమిటో స్పష్టంగా తెలుస్తూనే వున్నది. (ఈ సిద్ధాంతం ప్రకారమే ఆంధ్ర సోషలిస్టుపార్టీ వ్యవసాయ కూలీలలో పురుషునికి రు 1-6-0 లు స్త్రీకి రు 1-4-0 కూలి నిర్ణయించింది. అంటే, వీరిదృష్టిలో స్త్రీ పురుషునికన్న 0-2-0 విలువ తక్కువదన్న మాట!) ఏదో ఒక వంకపై తక్కువ కూలినిచ్చి ఎక్కువ లాభాలను సంపాదించాలనే పెట్టుబడిదార్ల దోపిడి పద్ధతులకు సిద్ధాంత బలాన్ని చేకూర్చి పెట్టటంగాక వీరివైఖరి మరేమీకాదు.

కమిటీ 'ప్రాతిపదిక కూలి' పచ్చి మోసం

'న్యాయమైన కూలి' అంటే ఏమిటో తెలియజేసిన పిమ్మట కమిటీ, 'ప్రాతిపదిక కూలి' అంటే ఏమిటో నిర్ణయించబూనుకొన్నది. 'జీవనభృతి', 'కనీసకూలి' 'న్యాయమైనకూలి', 'ప్రాతిపదికకూలి' నాల్గురకాల కూలిరేట్లు! పెట్టుబడిదార్లకు కమిటీ ఫస్టుక్లాస్ ఛాన్సునిచ్చింది. వారి కిష్టమైన రేటును వారు అంగీకరించవచ్చును: వారికిష్టమైనరేటును కూలీలకివ్వవచ్చును. ఎంత చక్కటి మార్జిన్! మరి, ఒకేరేటును అంటిపెట్టుకొనటం 'నిలకడగావుండటంఅనేది గాడిదయొక్క సుగుణమే' అనే సామెత క్రిందకురాదూ?

కమిటీ ఈ ప్రాతిపదిక కూలిని ఎట్లా నిర్ణయిస్తున్నదో పైన చూశాం. 160-175 పాయింట్లకిడ జీవనవ్యయాన్ని లెక్కించి, దాని ప్రకారం ప్రాతిపదిక కూలిని నిర్ణయించాలనీ, ఆపై పెరుగుదలకు అధమ జీతగాళ్ళకు పూర్తిగానూ, తక్కినవారికి స్లాబ్ సిస్టం ప్రకారమూ అధికధరల అలవెన్సును యివ్వాలనీ ఈ సూచన. అంటే హీనాతిహీనమైన జీతాలను గలవారికి తప్పితే తక్కిన కూలీలకూ, జీతగాళ్ళకూ ధరల పెరుగుదల ననుసరించి పూర్తి అధిక ధరల అలవెన్సు యివ్వబడదన్న మాట. అంటే, అధిక ధరలవల్ల కలిగే భారాలను కూలీల నెత్తిపైకే త్రోసి, లాభాలను పెట్టుబడిదార్లకు వదలుచున్నదన్నమాట.

1949 ఫిబ్రవరి నాటికి, కేంద్ర ప్రభుత్వము ఆర్థిక సలహాదారు ప్రకటించిన లెక్కల ప్రకారం, జీవన వ్యయం సూచి సంఖ్య, 372.(1939 లో 100 అనుకుంటే). ఈ జీవనవ్యయం లెక్కలు పూర్తిగా తప్పుడు లెక్కలు. టోకు ధరలనూ ఆచరణలో లేని కంట్రోలు ధరలనూ బట్టి తేల్చిన లెక్కలివి. ఆచరణలో చూస్తే గ్రామాలలో వున్న దొంగమార్కెటు (నేడు లీగల్‌గా దొరమార్కెటే) ధరల ప్రకారం ఈ జీవన వ్యయం చాలా హెచ్చుగా వున్నదని తెలుస్తుంది. మద్రాసు ప్రభుత్వం ప్రకటించే లెక్కల ప్రకారమే, గ్రామాలలో జీవనవ్యయం. ఎప్పుడూ 420 పాయింట్లకి తగ్గటంలేదు. ఈ విధంగా జీవనవ్యయం చుక్కలకంటుతూవుంటే, ఇందుకు అనుగుణ్యంగా కూలిరేట్లుగాని, జీతాలుగాని పెరిగినవా? ప్రభుత్వం లెక్కల ప్రకారమే బట్టల కార్మికులవంటి సుసంఘటితమగు కార్మిక వర్గానికే, ప్రాతిపదిక కూలి, అధిక ధరల

అలవెన్సు కట్టినా 270 పాయింట్లకు మించి పెరగలేదు. ఈ కార్మికుల సంగతే యిట్లావుంటే, సంఘటితం కాని కార్మికుల సంగతీ ఎట్టిరక్షణలూ లేనట్టి వ్యవసాయకూలీలసంగతీ చెప్పనక్కరయేలేదు. జీవనవ్యయం 4, 5 రెట్లు పెరిగినా (లోగడ చూచిన పట్టిక ప్రకారం నెల జీవనవ్యయం 1939 లో రు 7-8-0 లు అవుతూవుంటే, ఇప్పుడు రు 35-6-0 లు అవుచున్నది.) కూలి రేట్లు మాత్రం ఎక్కడా రెట్టింపుకన్నా ఎక్కువ పెరగలేదు. ఇండియా ప్రభుత్వం వారి 'ఇండియన్ లేబర్ ఇయర్‌బుక్'లో 1946 ను గూర్చి యిట్లా చెప్పబడింది.

"ఇండియాలో అన్ని ఫ్యాక్టరీలమీద సగటున కూలిరేట్లు 100 కి 115 చొప్పున పెరిగితే జీవనవ్యయం 150-250 పాయింట్లకు పెరిగింది. ఆ విధంగా కూలి రేట్లు జీవనవ్యయానికి చాలా వెనుకబడివున్నవి". ధాన్యం రూపంలో యిచ్చే కూలిరేట్లు దాదాపు పెరగనేలేదని చెప్పాలి. లోగడ రు 1-0-0 కి వచ్చే సరుకులకు నేడు రు 5 పెట్టవలసి వస్తున్నది. కాని ఈ ప్రకారంగా రు 1-0-0 కి రు 5-0-0 లు కూలీలకు రావటంలేదు. ఇందువల్ల కార్మికుల నిజవేతనాలు ఎంతగానో పడిపోయినవి. అయినా కమిటీ ఈ తేడాను భర్తీ చేయదట. జీతాల స్కేలునుబట్టి ఇంత లోపు జీతగాళ్ళకు ఇంత అధికధరల అలవెన్సు: అని నిర్ణయిస్తుందట. ఈస్లాబ్ సిస్టం ప్రకారం వచ్చే అధిక ధరల అలవెన్సు ఏమిటో యిప్పుడు చూస్తూనే వున్నాం. రావుకమిటీ సూచించినట్లు ప్రతి 5 పాయింట్లు పెరుగుదలకూ రు 1-8-0 అధికధరల అలవెన్సును యివ్వాలి. కాని ఈనాడు యివ్వబడేది రు 12-0-0 లేక రు 22-0-0 ఇదే కమిటీ సూచించే పద్ధతి.

తర్వాత : 1939 నాటి జీవనవ్యయాన్ని ప్రమాణంగా తీసుకొని, ఇప్పటి జీవనవ్యయాన్ని 160–175 కడ నిర్ణయించి అంతకుమించిన దానికి అధిక ధరల అలవెన్సు యివ్వాలనటంలో కమిటీ బ్రహ్మాండమగు మోసాన్ని గావిస్తున్నది. ధరలకూ కూలిరేట్లకూ దగ్గర సంబంధం వున్నది. కూలిరేట్లవల్ల ధరలు నిర్ణయింపబడకపోయినా (దీనినిగూర్చి ఇంకా ముందు వివరిస్తాను) ధరలవల్ల కూలిరేట్ల నిజవిలువ నిర్ణయింపబడుతూ వున్నది. ధరలు పెరిగి, కూలిరేట్లు పెరగనిచో కూలిరేట్ల విలువ పడిపోయి కార్మికుల కొనుగోలుశక్తి పడిపోతుంది కాబట్టి ప్రాతిపదిక వేతనాలను నిర్ణయించాలన్నా, మరే ఆర్థిక సంస్కరణను తలపెట్టాలన్నా, ముందుగా నేటి నోట్లుమ్మరాన్ని తగ్గించి ధరలను తగ్గించి స్థిరపర్చాలి. అదే సవ్యమైన పద్ధతి. కాని ఇందుకు తల్లక్రిందులుగా, ముందుగా జీవనవ్యయాన్ని 160 – 175 పాయింట్ల కడ స్థిరపర్చి, ఆ విధంగా కూలిరేట్లను మేక్బందీచేసి, ఆ పిమ్మట ధరల పెరుగుదల ననుసరించి అధిక ధరల అలవెన్సు నివ్వాలని కమిటీ సూచిస్తున్నది. గుర్రం ముందు బండినికట్టే పద్ధతే యిది.

నేటి సంక్షోభం భారాలను ప్రజల నెత్తిపైకి నెట్టి తాను బయటపడుటకై పెట్టుబడిదారీవర్గం ఆలోచించే పరిష్కారమార్గం తప్ప ఇది మరేమీకాదు. తమ ధరలను మాత్రం - తమ దోపిడినిమాత్రం - ఏమీ ముట్టుకోకూడదు: కాని కార్మికుల జీతాలనూ, కూలిరేట్లనూ మేక్బందీ చేయాలి. ఈ విధంగా తన దోపిడి లాభాలను యథాప్రకారం సంపాదిస్తూనే

వుండాలి. ఇదే, నేడు వ్యాపారంపైనా, వుత్పత్తిపైనా గుత్తాధికారాన్ని సంపాదించిన పెట్టుబడిదారీ వ్యూహం. సరిగ్గా దీనినే ఫెయిర్ వేజస్ కమిటీ మసిపూసి మారేడుకాయగాజేసి, కార్మికులకు ప్రసాదిస్తున్నది. కూలిరేట్లను స్థిరపర్చి మేక్బందీ చేస్తే ధరలు వాటంతట అవే తగ్గుతాయి అనే పాసిపోయిన పెట్టుబడిదారీ సిద్ధాంతం ప్రకారమే కమిటీ నడిచింది.

ఈ పద్ధతి కార్మికవర్గానికి ఎంతమాత్రం అంగీకారంకాదు. ముందు కమిటీ సూచించిన మేరయేయగు 160–175 పాయింట్లకడనైనా ధరలను తగ్గించి, స్థిరపర్చాలి. అప్పుడే 175 పాయింట్లకడ ప్రాతిపదిక కూలిని నిర్ణయించటం సాధ్యం కాగల్గుతుంది. 175 పాయింట్లకు మించికూడా, అటుపిమ్మట ధరలు పెరిగినచో, ప్రతి 5 పాయింట్లకు స్లైడింగ్ స్కేల్ ప్రకారం, ధరలు పెరిగినప్పటి వెనుకటి కాలంనుండీ, పూర్తి అధిక ధరల అలవెన్సును యిస్తూవుండాలి. ఈ రేటున అధమ జీతగాళ్ళకేగాక, కార్మికులకూ, వ్యవసాయ కూలీలకూ, చిన్న ఉద్యోగులకూ, గుమాస్తాలు వగైరా ఇతర చిన్న జీతగాళ్ళకూ అందరకూ, పూర్తి అధిక ధరల అలవెన్సును యివ్వాలి. ఇదే సరియగు 'న్యాయమైన' కూలిరేటు కాగల్గుతుంది.

కూలీరేట్లు పెరిగితే ధరలు పెరగవు: లాభాలు మాత్రమే తగ్గుతాయి

ఈ సందర్భంలో పెట్టుబడిదారీవర్గం గావించే ఒక దగా వాదనను - సిద్ధాంతాన్ని - మనం పరిశీలించాలి. తాము చెల్లించే కూలి తమ ఉత్పత్తి ఖర్చులలో భాగమనీ, వాటివల్లనే ధరలు నిర్ణయింపబడుతాయనీ, కాబట్టి కూలిరేట్లు పెరిగితే ధరలు పెరిగి, తిరిగి కొనుగోలుదార్లకూ, కొనుగోలుదార్లగా కార్మికులకూ మాత్రమే నష్టం కల్గుతుందనీ పెట్టుబడిదార్లు వాదిస్తున్నారు. అందుచేతనే కూలిరేట్లను మేక్బందీచేసి వుంచాలనీ, ఆ విధంగానే ధరలు స్థిరంగా వుంటాయనీ వీరూ, వీరి సిద్ధాంతులూ వాగుతారు. ధాన్యంధరలను పెంచాలని గో. ల. నారాయణచేసే గోలకూడా ఇదే. 1948 నవంబరులో చెరుకు వుత్పత్తిదార్ల సభలో మాట్లాడుతూ, "కంట్రోల్సు విధించి ప్రభుత్వం ధాన్యం ధర బస్తా 1కి రు 14[illegible] నిర్ణయించినప్పుడు, ఎ॥ 1కి వరి ప[illegible] రు 140లు వస్తున్నవి. సుమారు రు 170లు ఖర్చులు అవుచున్నవి. అనుభవంవల్ల తేలిన నికరమైన లెక్కలు ఇవి:" అని అతగాడు తెల్పిన దొంగలెక్కలుకూడా, తనేదో - తనంటే ధనికరైతులూ, భూస్వాములూ - కూలీలకు హెచ్చుకూలీని ఒరగబెట్టుచున్నట్లు చూపుటకు ఉద్దేశింపబడినవే. కాని వాస్తవానికి వారు హెచ్చుకూలి నివ్వటంలేదు సరిగదా, ఆవిధంగా నష్టపడటంలేదు సరిగదా, ధరల కనుగుణ్యముగానైనా కూలిరేట్లనివ్వడంలేదు. అయినా ఈ దొంగలెక్కలజూపి, ధరల పెంచుకొని, కూలీలనూ సామాన్య ప్రజలనూ ఇంకా అధికంగా దోచుకుంటానికే ధనికరైతులూ, భూస్వాములూ, వారి ప్రతినిధులగు రంగా, రామచంద్రారెడ్డి ప్రభృతులూ వేసిన ప్లాను ఇది. కాని నిజా[illegible] కూలిరేట్లవల్లనే ధరలు నిర్ణయింప[illegible]నున్నవా?

కూలిరేట్లవల్లనే ధరలు నిర్ణయింప బడుచున్నవన్న వాదన ఇప్పటికి సుమారు రెండుశతాబ్దములనుండీ బూర్జువావర్గమూ, దాని ఏజంట్లూ, కార్మిక ప్రతినిధుల మను కొనే ద్రోహులూ అనుసరిస్తూ వచ్చిన సిద్ధాంతం. కాని ఇది కేవలం బూటకపు సిద్ధాంతం అని సుమారు 100 ఏండ్ల క్రిందనే మార్క్సు దీనిని చీల్చి చెండాడాడు. కూలిరేట్ల వల్ల ధరలు నిర్ణయింపబడుట లేదనీ, ధరలు పెరగకుండానే కూలిరేట్లను పెంచవచ్చుననీ మార్క్సు స్పష్టంజేశాడు. కార్మిక శ్రమశక్తివల్లనే దినుసుకు విలువ ఏర్పడుచున్నదని తెల్పినపిమ్మట లాభం, కూలిరేట్లు, ధరలమధ్యగల సంబంధాన్ని గూర్చి తెల్పుతూ మార్క్సు ఇట్లా వ్రాసాడు :

“ఈ పమిరిత విలువనే, అనగా కార్మికుని మొత్తం శ్రమలవల్ల నిర్ణయింపబడే విలువనే, పెట్టుబడి దారుడూ కార్మికుడూ పంచుకొన వలసివున్నది. కాబట్టి ఒకరికి ఎక్కువ వచ్చినకొలదీ మరొకరికి తక్కువ వస్తుంది. ఇదే విధంగా ఒకరికి తక్కువవస్తే మరొకరికి ఎక్కువ వస్తుంది. ఒకమొత్తం తెలినపిమ్మట దానిలో ఒకభాగం పెరిగినకొలదీ దానికి విలోమంగా రెండో భాగం తగ్గుతూవుంటుంది. జీతాలు మారినవా వాటికి ఎదురు దిక్కుగా లాభాలు మారుతాయి. జీతాలుతగ్గినవా లాభాలు పెరుగ[illegible]తాయి. జీతాలు పెరిగినవా లాభా[illegible] తగ్గుతాయి. మన పైవుదాహరణను బట్టి కార్మికుడు తాను వుత్పత్తి చేసిన విలువలో సగానికి సమాన మైన 3 షిల్లింగులను గనుక కూలి క్రింద పొందితే, లేదా అతని పని రోజులోసగంజీతంచెల్లించబడినదీ, సగం జీతంచెల్లింపబడనిదీగావుంటే లాభం రేటు 100% గా వుంటుంది. ఎందువల్లననగా పెట్టుబడిదారునకు కూడా మూడు షిల్లింగులు వస్తున్నవి. కార్మికునకు 2 షిల్లింగులే గనుకవస్తే, అంటే, పని రోజు మొత్తంలో తనకుగాను మూడవ వంతే పనిజేస్తే పెట్టుబడిదారుకు 4 షిల్లింగులువచ్చి లాభంరేటు 200% అవుతుంది. కార్మికునకు 4 షిల్లింగులువస్తే పెట్టుబడిదారుకు 2 షిల్లింగులేవచ్చి లాభం రేటు 50% కు తగ్గుతుంది. కాని ఇవి ఎంతగా మారినా సరుకువిలువలో మాత్రం మార్పేమీరాదు.”

(మార్క్సు: పై గ్రంథంలోనే పే 263)

ఉజ్జాయింపుగా ఒక వుదాహరణను చూద్దాము ఒక బట్టల మిల్లులో ఒక ఏడాదిలో ఉత్పత్తియైన వస్త్రముల విలువ రు 1,00,000 లు అనుకొందాము. ఆ విలువలో యంత్రముల అరుగు తరుగుల విలువ రు 10,000 లూ, ముడివస్తువులూ, ఆజ్యముల విలువ రు 40,000 లూ, కూలి [illegible] 25,000 లూ వుందనుకొందాము. పెట్టు[illegible]దారుకు మిగిలేది 25000 లు. ఈ

విలువలో యంత్రములు, ముడిసరుకులు, ఆజ్యముల విలువ భాగం లోగడనే వున్న విలువలు కాబట్టి నూతనంగా కార్మికులు వుత్పత్తిగావించిన విలువ రు 50,000 లు. ఇందులో కార్మికునివాటా రు 25000 లు. పెట్టుబడిదారు వాటా 25000. అదనపు విలువ, అనగా దోపిడీ రేటు 100%. మొత్తం రు 75000 ల పెట్టుబడిపై లాభం రేటు $33\frac{1}{3}$%. కార్మికునకు జీతాల క్రింద రు 40,000 లూ పెట్టుబడిదారుకు మిగిలేది రు 10000 లూ అనుకొందాము. ఈ సందర్భంలో దోపిడీరేటు 25%, లాభం రేటు$13\frac{1}{3}$%, లేక కార్మికునకు రు 10000లు ముట్టిపెట్టుబడిదారుకురు40000లు ముట్టితే దోపిడి రేటు 400%, లాభం రేటు $53\frac{1}{3}$% అవుతుందికార్మికులపెట్టుబడిదార్ల వాటాలు ఎన్నెన్ని నిష్పత్తులలో మారినా, లాభం రేటు పెరిగినా తరిగినా, జీతాలు తగ్గినా పెరిగినా, అసలు బట్టల మొత్తం విలువలో మార్పేమీ రాక లక్ష రూపాయలుగానే వుంటున్నది. దీనినిబట్టి కూలి రేటు పెరిగితే ధరలు పెరుగుతాయనేది వట్టి బూటకం అని స్పష్టం కాగలదు.

లాభాలు పవిత్రమైనవికావు

కాబట్టి లాభాలు పెరిగితే జీతాలు తగ్గుతాయనీ, జీతాలు పెరిగితే లాభాలు తగ్గుతాయనీ, ఇవి ఎట్లెట్లుమారినా, ఇతర విషయములు మారకుండావుండే ధరలు మారవనీ చూసాము. ఈరోజున నికృష్టపు కూలిరేట్లూ, జీతాలూవుండే పరిశ్రమల లోనూ, వ్యవసాయంలోనూ కూడా, ఏ ధంగా ఈనాటి ధరల నేమాత్రం పెంచకుండానే, కూలిరేట్లను పెంచవచ్చునో చూద్దాము.

పరిశ్రమలలోవచ్చే లాభాలు

(1929 లో లాభాల సూచీసంఖ్య 100)

	1939	1946
జూటు	13.6	58.1
బట్టలు	151.5	680.5
టీ	96.2	190.4
పంచదార	179.4	175.0
ఇనుము, ఉక్కు	289.3	344.7
రాక్షసిబొగ్గు	139.1	278.8
మొత్తంఅన్నిపరిశ్రమలు	72.4	159.4

పెట్టుబడిదార్లకు సాధారణ సంవత్సరంగా కన్పించే 1939 ను గనుక ప్రమాణంగా (100 పాయింట్లుగా) తీసుకుంటే, అన్ని పరిశ్రమలలోనూ కలిపి లాభం 206.3 వచ్చిందన్నమాట. ఇవి పెట్టుబడిదార్లు ఇచ్చిన లెక్కలే. 1946 పిమ్మట లాభాలు విపరీతంగా పెరిగిపోయినవి. ప్రభుత్వమే ప్రకటించిన టోకుధరల సూచీ సంఖ్య ప్రకారం, 1948 ప్రారంభంలో 329 పాయింట్లు వుంటే 1949 ప్రారంభానికి 380.3 పాయింట్లు వున్నవి.

కాబట్టి లాభాలు ఎంతగా పెరుగుచున్నవో వూహించవచ్చును. ఉదాహరణకు: బట్టల పరిశ్రమలనే చూస్తే బొంబాయి మిల్లుయజమానులకు, 1948లో 20 కోట్లరూపాయీలు లాభం వచ్చింది. అంటే తాము ఆ పరిశ్రమలో పెట్టిన మొత్తం పెట్టుబడికి $1\frac{1}{2}$ రెట్లులాభం ఒక్క సంవత్సరంలోనే వారు సంపాదించారన్నమాట. తాము నియోగించిన ఒక్కొక్క కార్మికునిపై రు 992 లు సంపాదించారన్నమాట. 1948 లో 8 నెలలలోనే, అహమ్మదాబాదు మిల్లుయజమానులు 75 కోట్ల రూపాయీలనూ, కోయంబత్తూరు మిల్లుయజమానులు 3 కోట్ల రూపాయీలనూ

సంపాదించారని పెట్టుబడిదార్ల ప్రతినిధియే యగు టి. ఏ. రామలింగ చెట్టియార్ కేంద్రపార్లమెంటులో చెప్పాడు.

అర్బుదాలలోవున్న ఈ లాభాలు ఎట్లా వస్తున్నవి? దొంగవ్యాపారాన్ని విపరీతంగా సాగించీ, కార్మికుల శ్రమశక్తికి తగిన విలువ యివ్వకుండా జీతాలను కాజేసే ఈ లాభాలను పెట్టుబడిదార్లు సంపాదిస్తున్నారనుట స్పష్టం. ఈనాడు ఏ పరిశ్రమయొక్క లేక, ఏ బ్యాంకుయొక్క ఆయవ్యయపట్టికను జూచినా ఈ సత్యం బోధపడుతుంది. ప్రధాన పరిశ్రమలలో ఈనాడు కార్మికునికిచ్చే జీతాలు ఎంత హీనంగా వున్నవో చూస్తే ఈ లాభాల విపరీత పరిణామానికి కారణము తెలుస్తుంది.

ప్రభుత్వం నియమించినబోర్డుల నిర్ణయాల ప్రకారం బట్టల పరిశ్రమలో ఈ క్రింది కనీస కూలిరేట్లు నిర్ణయింపబడినవి.

		నెల జీతం
1947	మే బొంబాయి	రు. 30/-
1948	జూన్ మద్రాసు	రు. 28/-
,,	ఏప్రిల్ అహమ్మదాబాదు	రు. 28/-
,,	మే ఇందోరు (రాజీ)	రు. 26/-
,,	మే నాగపూరు (రాజీ)	రు. 26/-

ఇతర పరిశ్రమలలో

1946 మే: బొంబాయిరేవు కార్మికులకు 80/-

1948 ఫిబ్రవరి: అహమ్మదాబాదు పాకీవారు రు. 25/-

1948 మే: యు. పి. కార్మికులు (జనరల్) రు. 30/-

(అమలు జరుపబడలేదు.)

ధరలనేమీ పెంచకుండానే, లాభాలను గనుక తగ్గిస్తే, ఏ విధంగా ఈనాటి నికృష్ట జీతాలను జీవనభృతి ప్రమాణానికి పెంచవచ్చునో మనం చూడవచ్చును. బొంబాయిలో కార్మికుడు ఒక్కింటికి 992 రూపాయీలను లాభంగా పెట్టుబడిదార్లుసంపాదించారనిచూపాము. ఇందులో 92ను మినహాయించినా, మిగిలిన 900 రూపాయిలనూ కార్మికుడు ఈనాడు పనిజేసే 280 పనిరోజులకు పంచితే, ఇప్పుడు తీసే జీతంగాక అదనంగా రోజుకు 3-4-0 ఆతనికీయవచ్చునని తెలుతుంది.

ఇక వ్యవసాయం సంగతి చూద్దాం. గో. లి. నారాయణ, రామచంద్రారెడ్డి ప్రభృతులుచెప్పేది, ధాన్యం ధరలు తమకు గిట్టుబాటు కావటం లేవనీ, తమకు నష్టం వస్తున్నదనీ కాని నిజానికి వ్యవసాయంలో జరిగే దోపిడీ హృదయవిదారకం: ఏనాడు రానట్టి దోపిడీ లాభాలు ఈనాడు పెట్టుబడిదారీ రైతుకు పెట్టుబడిదారీ భూస్వామికీ వస్తున్నవి. లెక్కలను గనుక చూస్తే ఈ విషయం స్పష్టంగా తెలుస్తుంది.

స్వయంగా చిన్నమెత్తు పనిజేయని ముగ్గురు భూస్వాముల క్షేత్రాలను చూద్దాము.

కృష్ణాజిల్లాలో ఒక భూస్వామి

క్షేత్రం విస్తీర్ణం: 20 ఎకరాల మాగాణి

మొత్తం ఆదాయం
(వడ్లబస్తా 1కి రు 16-4-0 చొ||)

రెండు పంటలపైనా	రు 5475-0-0
పశువులు, ఎరువులు, విత్తనాలు వగైరాలపై పెట్టిన స్థిర పెట్టుబడి	రు 735-0-0
కార్మిక శ్రమశక్తి సృష్టించిన నూతన విలువ	రు 4740-0-0

ఈ నూతన విలువలో వాటా లెట్లా పంచుకొనబడుచున్నవి.

కూలీలకిచ్చిన కూలి మొత్తం రు 1630-0-0
పెట్టుబడిదారీ భూస్వామికి
మిగిలిన అదనపు విలువ (కార్మికుల శక్తికి తగిన విలువ ఇవ్వనందున మరీ పెరిగిన అదనపువిలువ) 3110-0-0
శిస్తులు రు 220-0-0
నికరలాభం రు 280-0-0
దోపిడిరేటు 131.5%
లాభంరేటు 122.2%

కృష్ణాజిల్లాలో మరొక భూస్వామి

క్షేత్ర విస్తీర్ణం : 25 ఎకరాలు
(కొంచెం బీడది)
నికరలాభం రు 2645-0-0

చిత్తూరు జిల్లాలో ఒక భూస్వామి

క్షేత్రంవిస్తీర్ణం : మాగాణి ఎ3, మెట్ట ఎ2½
(ఎలక్ట్రిసిటీ సహాయంతో సాగింపబడి ఉన్నత వ్యవసాయ పద్ధతి కాబట్టి వరి 3 పంటలు, మెట్టలో సజ్జ, రాగి, వేరుసెనగ, 3 పంటలూ పండుతాయి)
నికరలాభం రు 2600-0-0
(బస్తా 1కి రు 30/ ధర చొ॥ వాస్తవానికి రు 35/- రు 40/-ల మధ్య ధరవున్నది)

ఈ భూస్వాములిచ్చిన కూలిగాని, పాలేరు జీతాలుగాని ఏమిటి ?

	రోజుకూలి,	పాలేరు జీతం
1వభూస్వామి	1-0-0	30 బస్తాలు
2వభూస్వామి	0-12-0 నుండి 1-4-0 వరకు	20 బస్తాలు
3వభూస్వామి	0-10-0 × ఒకపూట రాగి సంకటి	తిండి, బట్టలు ధాన్యంవక్కాకులు వగైరా కల్పి, సున్నాను, రు. 25/-

గో. ల నారాయణదగా లెక్కలను కట్టిపెట్టి అతడి క్షేత్రాన్నిగూడా పరిశీలిస్తే, అతడు కూడా ఇదే విధంగా కూలీల శ్రమశక్తికి తగిన విలువయివ్వకుండా దానిని హరించి. వేల రూపాయీల లాభాన్ని తీస్తున్నాడని తెలుస్తుంది.

ఈ దోపిడి లాభాలను ఇదివరకెన్నడూ భారతీయ పెట్టుబడిదార్లు కలలోకూడా వూహించి ఎరుగని లాభాలను - మూలం ఒక్కటే; తమ చేజిక్కిన రాజ్యాధికార బలంతో వారు రెండు చేతులా దోపిడిని సాగిస్తున్నారు. ఒకవైపున కంట్రోల్సును నామమాత్రంజేసి, వాటిచాటున తమ దొంగ వ్యాపారాన్ని నిరాఘాటంగా సాగిస్తున్నారు. రెండో వైపున తమ మామూలు సగటు లాభాలనతోడు, కార్మికుల శ్రమశక్తి విలువనుకూడా హరించి, అనగా, కార్మికులకు తగినజీతాలు యివ్వకుండా వారిదోపిడి లాభాలను సంపాదిస్తున్నారు. ఈనాడు బ్యాంకురేటు 3% భూస్వామి గనుక తాను పెట్టుబడి పెట్టిన రు. 2365/- లనూ బ్యాంకులో వడ్డీకి వేసుకుంటే అతనికి వచ్చేది. రు. 71/- మాత్రమే. పరిశ్రమలలో పెట్టుబడపెట్టితే డివిడెంటు క్రిందవచ్చేది రు. 142/- మాత్రమే.

(కానిఇది పేరుకు మాత్రమే. నెహ్రూ ప్రభుత్వం పేరుకుడివిడెండును 6%కు హద్దు పెట్టినా మొత్తం లాభమంతా ఏదోఒక రూపంలో పెట్టుబడిదార్లకే ముట్టుతున్నది. ఉదాహరణకు ఈ క్రింది దానిని చూడవచ్చును.

యునైటెడ్ కమర్షియల్ బ్యాంకు లిమిటెడ్ 1949 లాభాల పట్టిక:

పన్నులుపోను నికరలాభం
రు. 48,00,155-6-9

ఇందులో గాంధి స్మారకనిధికి
రు. 1,81,111-0-0
పెట్టుబడి నిధికి బదిలీ
రు. 30,00,000-0-0
రిజర్వు నిధికి బదిలీ
రు. 5,00,000-0-0
పారుబాకీలక్రింద తీసింది
రు. 250,000-0-0
సిబ్బందికి బోనస్ రు. 1,50,000-0-0
షేరుకు 1-8-0 చొ॥
డివిడెండు పంచింది రు. 7,19,044-6-9
1949 అక్కౌంటుకు బదిలీ
రు. 6,00,000-0-0

కాబట్టి 48 లక్షల రూపాయీల లాభం లోనూ సిబ్బందికి బోనస్ క్రింద యిచ్చిన ఒకటిన్నరలక్షలుపోను మిగతా 46½ లక్షలూ ఏదోరూపంలో పెట్టుబడిదారీ వర్గానికే ముట్టినవి.)

కాని ఈనాడు ధనికరైతులయొక్క, భూస్వాములయొక్క లాభాలపై ఏలాంటి కంట్రోలూ లేనందున, వారికి 3%, 6% కాదు లాభంవచ్చేది: 100%, 150% లాభం గిట్టుబాటు అవుతున్నది. కాని ప్రజాప్రభుత్వమే గనుక వుంటే, జరిగే దేమిటి? భూస్వామ్య విధానాన్ని పూర్తిగా రద్దుగావించి, భూస్వాముల భూమినంతటినీ వారి బీద కౌలుదార్లకు గాని, వ్యవసాయకూలీలకూ, పేదరైతులకూ గానిపంచిపెడుతుంది కాబట్టిఆక్షేత్రాలలో కూలిసమస్యే వుండదు' భూస్వాములకు గిట్టుబాటు అవుతుందా' లేదా, అనే మీమాంసే అనవసరమౌతుంది. ఇక ధనికరైతులవిషయంలో వారుకూడా కాయకష్టంజేస్తూ వ్యవసాయంజేస్తూ వుంటారు. కాబట్టి, వారు చేసిన పనిరోజులకు కూలీలకువలెనే వారికీ కూలిని మినహాయించి, ఆపైన, వారి పెట్టుబడిపై 6% చొప్పున లాభం యివ్వబడుతుంది. మిగిలిన విలువ అంతా, కార్మికులకు కూలిక్రింద యివ్వబడుతుంది. ఈవిధంగా గనుక జూస్తే, ఈనాడు వ్యవసాయంలో లాభాలను కంట్రోలుజేసి, సులభంగా వ్యవసాయ కూలీలకురోజుకూలి రు 3-12-0 చొప్పున (ఆ ప్రమాణంలోనే పాలేళ్ళకు జీతాలు) ఇవ్వవచ్చునని తేలుతుంది.

కాబట్టి గో. ల. నారాయణ వగైరా భూస్వాముల, ధనికరైతుల 122% లాభాలను ముట్టుకోగూడదు అనే సిద్ధాంతాన్ని గనుక నిరాకరించి, లాభాలను కంట్రోలు జేసేపక్షంలో, ధరలనేమాత్రం పెంచనవసరంలేకుండానే, ఈనాటి ధరల ప్రకారమే, రోజు 1కి రు 3-12-0 ఎట్లా యివ్వవచ్చునో తెలుసుకోనగలం. కాని ఈనాడు, భారతదేశంలోవున్న దురదృష్ట పరిస్థితుల ఫలితంగా, చిన్నమెత్తు కాయకష్టంకూడా చేయనెరుగని వందల ఎకరాల భూస్వాములుకూడా, కూలీలకూలినిఅపహరించి వేలు, లక్షలు రూపాయీల లాభాలను సంపాదిస్తున్నారు. ఈ లాభాలపై మాత్రం ఈగను వాలనీయకుండా, పైగా వీటిని పెంచుకోవాలనిచూస్తూ, కూలీల కూలిని కాజేయాలని ధనికరైతులూ, భూస్వాములూ, జనరల్‌గా పెట్టుబడిదారీ వర్గమూ కల్లబొల్లి సిద్ధాంతాలను తయారు చేయటం జరుగుచున్నది. ఫెయిర్ వేజస్ కమిటీకూడా 'పరిశ్రమల ఉత్పత్తిశక్తినిబట్టి జీతాలు' అనే వంకతో 'లాభాలు పవిత్రమైనవి: వాటిని ముట్టుకోరాదు' అనే పెట్టుబడిదారీ సిద్ధాంతాన్నే అంగీకరించి, కార్మికుల కూలికి - జీవనభృతికి - సున్న జుట్టివేస్తున్నది.

గిట్టుబాటు సిద్ధాంతంలోని మోసం

పరిశ్రమలయొక్క ఉత్పత్తిశక్తిని బట్టియే కూలిరేట్లను నిర్ధారణ చేయాలని కమిటీ సూచించింది. తమకు 'గిట్టుబాటు' అయ్యే కూలిరేట్లనే యిస్తామని ధనిక రైతులూ, భూస్వాములూ చేసే వాదనకూ దీనికీ తేడా ఏమీలేదు. ఈ 'గిట్టుబాటు' సిద్ధాంతంయొక్క అర్థం ఏమిటి? వ్యవసాయకూలీలకూ, పాలేళ్ళకూ యిచ్చే కూలి ఇతర వ్యవసాయఖర్చులూపోను మిగతా ఆదాయంతో, తమ అల్లుళ్ళ అలకను దీర్చటానికై పంపే కట్నాలతో సహా తమ భోగజీవితాన్ని గడపగలిగితే అది 'గిట్టుబాటు' వ్యవసాయం: ఇందుకు ఎర్రని ఏగాని తగ్గినా, 'గిట్టుబాటు కానిది:' కాబట్టి కూలీలకు తగినకూలి యివ్వ వీలులేనిది. ఇదీ భూస్వాముల, ధనికరైతుల సిద్ధాంతం.

ఈ గిట్టుబాటు సిద్ధాంతం కూలీల కూలిని విరగ్గోస్తానికై కల్పింపబడిన దగా సిద్ధాంతం తప్పితే మరేమీకాదు. కార్మికులకీ సిద్ధాంతంతో ఏమీ ప్రసక్తిలేదు. ఇతరులు తమ సరుకులనమ్ముకొంటున్నట్లే కార్మికుడు తన సరుకగు శ్రమశక్తిని అమ్ముకొంటున్నాడు. అందుకు సరియగు విలువనే ఆతడు కోరుచున్నాడు. ఆ సరుకును - శ్రమశక్తిని - ఉపయోగించుకొనటముద్వారా పెట్టుబడిదారేమి ఉత్పత్తిగావిస్తున్నాడు? ఎంత ఉత్పత్తి గావిస్తున్నాడు? అన్నదానితో కార్మికునకు ఏమీ ప్రమేయంలేదు. ఆఉత్పత్తిగావింపబడిన సరుకు అమ్ముడుపోయిందా, లేదా అనే విషయంతోకూడా కార్మికునకు ఏలాంటి సంబంధమూలేదు. తుపానువచ్చి పైరంతా ధ్వంసమైపోయిందనుకొందాము. కాని యిందువల్ల పాలేరుకు జీతం ఎగకొట్టానని యజమాని అనవచ్చునా? కాబట్టి తన ఉత్పత్తివల్ల వచ్చే లాభనష్టాలన్నింటికీ పెట్టుబడిదారుడే బాధ్యుడుగాని, కార్మికునకేమీ సంబంధం లేదు. దీనినే మార్క్స్ ఇట్లా చెప్పాడు:

"మనం ఏ కార్మికుని అయినా, ఉదాహరణకు ఒక నేతగానిని, తీసుకొందాము. పెట్టుబడిదారుడు ఈ నేతగానికి మగ్గాన్నీ, నూలునూ సప్లయి జేస్తాడు నేతగాడు పని చేయుట మొదలిడి, నూలును వస్త్రంగా తయారుచేస్తాడు. పెట్టుబడిదారుడా వస్త్రాన్ని స్వాధీనము జేసుకొని, ఉదాహరణకు, 20 మార్కులకు అమ్ముకొంటాడు. అయితే నేతగానికివచ్చే జీతం, ఈ వస్త్రంలో, ఈ 20 మార్కులలో తన శ్రమజన్యమైన వస్తువులో, వాటాకా? ఎంతమాత్రంకాదు. వస్త్రం అమ్మబడటానికి చాలా కాలం పూర్వమే, బహుశః వస్త్రం నేయబడటానికి చాలాకాలము పూర్వమే, ఈ నేతగాడు తన కూలిడబ్బులను స్వీకరించివుంటాడు. కాబట్టి ఈ వస్త్రాన్ని అమ్మగా వచ్చే డబ్బునుండిగాక, తన చేతిలోవున్న డబ్బునుండే పెట్టుబడిదారుడీ కూలినిచెల్లిస్తాడు. పెట్టుబడిదారునిచే తనకు సప్లయి

గావింపబడిన నూలూ, మగ్గమూ ఎట్లా తన వుత్పత్తి దినుసులు కావో, అదే విధంగా, తన సరుకగు శ్రమశక్తికి మారకంగావచ్చే సరుకులుకూడా నేతగాని వుత్పత్తి దినుసులు కావు. వాస్తవమునకు కొనుగోలుదారు లెవ్వరూ పెట్టుబడిదారునకు తగలకపోయి వుండవచ్చును: దాని నమ్మటంద్వారా కూలి క్రింద తాను వెచ్చించిన సొమ్ముకూడా వానికి తిరిగి రాకపోయి వుండవచ్చును: లేదా, నేతగానికి యిచ్చిన కూలితోపాటు పోలిస్తే అతడా వస్త్రమును చాలా మంచిలాభమునకే అమ్మి వుండవచ్చును. కాని వీటిలో వేటితోనూ నేతగానికి ప్రమేయంలేదు. పెట్టుబడిదారుడు తన సంపదలోని ఒకభాగంతో ఎట్లా ముడిదినుసులగు నూలునూ, శ్రమ సాధనమగు మగ్గమునూ కొన్నాడో, అట్లే తన సంపదలోని మరొకభాగంతో, తనపెట్టుబడితో నేతగాని శ్రమశక్తిని కొంటున్నాడు. ఈ క్రయం పూర్తయైన పిమ్మట - వస్త్రమును ఉత్పత్తి గావిస్తానికై అవసరమగు శ్రమశక్తికూడా ఈ క్రయంలో ఉన్నదనిమర్చిపోరాదు.-అతడు తనవైన ముడిపదార్థములతోనూ, శ్రమ సాధనములతోనూ మాత్రమే ఉత్పత్తి జేస్తాడు. ఎందుకంటే ఇప్పుడీ శ్రమసాధకాలలో మన వెరినేగాడుకూడా జమచేయబడి ఉత్పత్తి దినుసులలోగాని, దినుసుల ధరలలోగాని, మగ్గానికి ఎంత మాత్రం వాటా వున్నదో, అంత మాత్రం వాటానే కల్గి వుంటున్నాడు."

(మార్క్స్: "కూలిపని - పెట్టుబడి" సెలెక్టెడ్ వర్క్స్: వాల్యూం I పేజి 203)

గో. ల. నారాయణ వగైరా ధనిక రైతుల, భూస్వాముల 'గిట్టుబాటు' సిద్ధాంతాన్నే పరిశీలించుదాము. ఈ నాటి ధాన్యంధరలప్రకారం వ్యవసాయఖర్చులు కూడా వీరికి గిట్టుబాటు కావటంలేదా? సిద్ధాంతరీత్యానే ఇది పూర్తిగా తప్పు. ధాన్యంధర లెట్లా నిర్ణయింప బడుతూ వున్నవో చూస్తే ఈ వాదన ఎంత బూటకమైనదో తెలియగలదు. ధాన్యంధర లెట్లా నిర్ణయింపబడుచున్నవి? భూమి విస్తీర్ణం పరిమితమైనదికాబట్టి, పెరిగే జనాభకు సరిపడునంతటి ధాన్యం వుత్పత్తి కావాలి కాబట్టి అంతకంతకు నిస్సారమగు భూములుకూడా సాగులోనికి తేబడుతాయి: లేదా, సాగులోవున్న భూములపైననే అదనంగా పెట్టుబడి పెట్టబడి ఉత్తమపద్ధతిన వ్యవసాయం సాగింపబడుతుంది. ఈ నిస్సారభూములపై పండే పంటవల్లనే ధాన్యంధరలు నిర్ణయింపబడుచున్నవి (రికార్డోను చూడండి). భూమిపై స్వంత ఆస్తిహక్కులు వుండటంమూలకం

గానూ, భూమిపై గుత్తాధికారంవుండటం మూలకంగానూ, సాగుహక్కుదుగాను భూకామందుకు ఈ నిస్సారక్షేత్రంపై కూడా కొంత కప్పము - దీనినే మార్క్స్ 'నిరంకుశపురెంటు' అన్నాడు- చెల్లించవలసివుంటుటచే, ధాన్యంధరలు పారిశ్రామిక దినుసుల ధరలవలె వుత్పత్తి ఖరీదుకు సరిపడ గాక, అంత కెక్కువకే నిర్ణయింపబడుతాయి. ఎరువులు, విత్తనాలు, పశువులు, వ్యవసాయపనిముట్లు వగైరాలపై పెట్టిన స్థిర పెట్టుబడీ, కూలీలకు కూలిక్రింద యిచ్చిన అస్థిర పెట్టుబడీ, భూకామందుకు చెల్లించే నిరంకుశపు రెంటూ, సాగుచేసినవాని సగటులాభం: ఇవన్నీ కల్పి అయిన మొత్తమే పంట ధరగా నిర్ణయింపబడుచున్నది. (సాగుజేసినవాడే భూకామందుయైనచో రెంటు భాగంకూడా వానికేవచ్చి వానిలాభం పెరుగుతుంది. కాని ఈనాడు సాగుజేసే కవులుదారుకు ఎట్టిరక్షణా లేకపోవటం వల్లనూ, గుత్తపెట్టుబడిదార్లు వ్యవసాయ పనిముట్లూ, ఎరువులూ వగైరాల ధరలను విపరీతంగా పెంచివేయటంవల్లనూ, కౌలుదారుకు లాభంక్రిందనూ, అతడు శ్రమజేసిన కాలానికి కూలిక్రిందనూ ముట్టవలసినభాగం కూడా భూస్వామికే పోతున్నందువల్ల అతనికి వ్యవసాయం గిట్టుబాటుకానట్లు కనపడటం సహజమే) ఈ నిస్సారపు భూములకంటె మంచివైన భూములపై అధికపంటపండినా, ధాన్యంధరలు నిస్సారపు భూములపంటనుబట్టియే నిర్ణయింపబడుచున్నవి. కాబట్టి, ఆధరలకే మంచి భూముల పంటకూడా అమ్మబడి, సాగుజేసినవానికి ఎక్కువ ఆదాయాన్ని, అనగా భూకామందుకు ఎక్కువ రెంటును - దీనినే మార్క్స్ 'తారతమ్యపు రెంటు' అన్నాడు - గాని, లేదా, సాగుదారునకు ఎక్కువ లాభాన్ని - దీనినే మార్క్స్ 'అదనపులాభం' అన్నాడు - గాని, తెచ్చిపెట్టబడుచున్నవి. కాబట్టి ఉత్పత్తిఖరీదునుబట్టియే ధాన్యంధరలు నిర్ణయింపబడుచున్నవన్నది - అదైనా ఉత్పత్తిఖరీదుకు మించియే - అర్థశాస్త్ర ప్రసిద్ధమైన సిద్ధాంతం కాని దీనినికూడా కప్పిపుచ్చి, ప్రజలను ఇంకా దోచుకుంటానికై భూస్వాముల ఏజంట్లగు రంగా, రామచంద్రారెడ్డి ప్రభృతులు, ఇప్పటి ధరలకు తమ ఖర్చులుకూడా గిట్టుబాటు కావటం లేదని బీద అరుపులు అరుస్తూ, దొంగ లెక్కలను తయారుజేసి, ప్రజలను మోసం చేయజూస్తున్నారు.

అయితే తక్కువ పండే ప్రాంతాలలో ఇప్పటి కూలిరేట్ల ప్రకారం ఏదోఖర్చులు గిట్టుబాటు అవుచున్న వేగాని హెచ్చు కూలి యిచ్చినచో ఖర్చులు గిట్టుబాటు కాకుండానైనా పోతాయి; లేదా, ధరలనైనా పెంచాలి అని వాదించవచ్చును. కాని యిప్పటి అభివృద్ధి దశ ననుసరించి యంత్రసహాయంతోనూ, శాస్త్రీయ పరిశోధనల నుపయోగించి, ఎట్టి ఊసర క్షేత్రాలనైనా దివ్య క్షేత్రాలుగా మార్చి ఎంత హెచ్చుపంటనైనా పండించవచ్చును. సోవియట్ యూనియన్‌లో ఎ 1 కి గోధుమ 5152 పౌనులు (సుమారు 21 బస్తాలు) పండిస్తున్నారంటేనూ (ఇండియాలో 652 పౌనులు అంటే సుమారు $2\frac{1}{4}$ బస్తాలు మాత్రం.) ఆవునుండి స్తన్య కాలంలో 2500 సేర్లకుపైగా పాలను తీస్తున్నారంటేనూ (ఇండియాలో $376\frac{1}{2}$ సేర్లు) అందుకు కారణం ఆ దేశంలో వ్యవసాయంగాని, పశుపాలనంగాని పూర్తిగా శాస్త్రీయపద్ధతులపై యంత్రసహాయంతో

జరగటమే. కాని మన దేశంలో ఇట్టి శాస్త్రీయ పరిశోధనల సహాయంతో వ్యావసాయికోత్పత్తిని పెంచుటకు భూస్వామిక విధానమూ, నేటి దివాళాకోరు పెట్టుబడిదారీ విధానమూ పెద్ద అడ్డంకిగా వుంటున్నవి. సాగుచేసేవానికి భూమిహక్కులేదు: ఉన్నా అది శాశ్వతంగా వాని చేతులలోనే వుంటుందన్న హామీలేదు. పండిన పంటలో అత్యధిక భాగాన్ని భూస్వామిక వర్గమూ, పెట్టుబడిదారీవర్గమూ, వీరి ప్రభుత్వము కాజేయటం జరుగుచున్నది. ఇందువల్లనే, నవీన శాస్త్రపరిశోధనల సహాయంతో వ్యవసాయాన్ని సాగించటంగాని, యంత్రములను, ఎలక్ట్రిసిటీనివినియోగించటంగానీ అసాధ్యమగుచున్నది. ఉత్పత్తిని పెంచలేకపోవటం జరుగుచున్నది. సామాన్య రైతులు బాగుపడలేకపోవటమేగాక, కూలీల శ్రమశక్తికి తగిన విలువనుకూడా ఇవ్వలేకపోవటం జరుగుచున్నది. కాని భూమిపై స్వంత ఆస్తి హక్కులు రద్దుగావింపబడి, భూమి జాతిపరం చేయబడి, దున్నేవానికే భూమి హక్కుకల్గించబడినప్పుడూ, కౌలు పద్ధతి నిర్మూలింపబడినప్పుడూ క్రమంగా వ్యవసాయం సమిష్టివ్యవసాయం క్రిందకు మారినప్పుడూ నేటి భూస్వామిక సంబంధాల ఆటంకాలు అంతరించిపోతాయి. కాబట్టి, యంత్రముల నుపయోగించుటకూ, నవీన శాస్త్ర పరిశోధనల సహాయాన్ని తీసుకొనుటకూవీలు ఏర్పడుతుంది కాబట్టి, ఉత్పత్తి శక్తిని ఎంతగానో పెంచి, నేడు ఊసర క్షేత్రాలనుకున్న వాటిపైకూడా ఎంతో హెచ్చు ఆదాయాన్ని తీయవచ్చును. కాబట్టి, ఇట్టి అభ్యుదయ వ్యవసాయానికి ఆటంకంగా నిలుస్తూ ఇక్ష్వాకులనాటి వ్యవసాయ పద్ధతులనే అనుసరిస్తూ చవుకగా వస్తున్నదిగదా అని పూర్తిగా కార్మిక శ్రమశక్తినే వుపయోగిస్తూ తమకు ఎక్కువ ఆదాయం రావటం లేదనీ, అందువల్ల ఎక్కువ కూలిని యివ్వలేమని ధనిక రైతులూ భూస్వాములూ, గావించే వాదనను కూలీలు మన్నించలేరు. తమ జీవన భృతి సంపాదనకు అడ్డంకిగా వున్న భూస్వామికవిధానం అంతం కొరకు మరింత దీక్షతో పోరాటాన్ని సాగించగలరు.

అయితే ఈ సందర్భంలో మనం మరొక విషయాన్నికూడా గమనించాలి. లాభాలను కంట్రోలుజేసి, శ్రమశక్తికి తగిన ధరగా కూలిరేట్లను పెంచినా కూలీలను దోచుకొనటం అంతరించదు. కూలి పద్ధతి అంతరించదు. ఎంతకాలం పెట్టుబడిదారీ వుత్పత్తి పద్ధతి వుంటుందో అంతకాలం కూలీలను దోచుకోవడం వుంటూనే వుంటుంది. మార్క్సు చెప్పినట్లుగా ఆధునిక పరిశ్రమాభివృద్ధి ఫలితంగానే కార్మికవర్గమునకు వ్యతిరేకంగా పెట్టుబడిదారుకు అనుకూలంగా ముల్లు మొగ్గటం హెచ్చవుతూవుంటుంది. కాబట్టి సగటు కూలిరేటును పెంచుటగాక తగ్గించుటయే; లేదా, శ్రమ విలువను దాదాపు దానికనిష్ఠ ప్రమాణమునకుతగ్గించుటయేపెట్టుబడిదారీవిధానంయొక్క సాధారణ స్వభావంగా వుంటుంది.” అందుచే కార్మికులు తమ నిత్యపోరాటాలలో 100 కి 99 పోరాటాలను అప్పటికూలిరేట్లు ఇంకాపడిపోకుండా నిలబెట్టి వుంచుకొనుటకే జరపవలసి

వస్తున్నది. కాని కార్మికోద్యమం యొక్క ధ్యేయం, శ్రమశక్తికి పూర్తి విలువను సంపాదించటమే కాదు: అసలు దోపిడి విధానాన్నే రద్దుగావించటం. దీనినే మార్క్స్ ఇట్లా చెప్పాడు.

"అదే సమయంలో కూలిపద్ధతిలో వున్న సాధారణ బానిసత్వంతో సంబంధం లేకుండా వున్నట్లు, కార్మికవర్గం ఈ నిత్య పోరాటాలను తమ అంత్యాలక్ష్యంగా, గోరంతలు కొండంతలు చేయరాదు. తాము పోరాడేది ఫలితాలతోగాని, ఈ ఫలితాలకు మూలమైన కారణాలతో కాదన్న విషయాన్ని వారు మరచిపోరాదు. పరిస్థితిని అధోగతికిపోకుండా ఆపుటనే చేస్తున్నారుగాని అసలు దానిగతిని మార్చుటను కాదని గుర్తించాలి. ఉపశమనమునకు మందులు వేస్తున్నారేగాని రోగాన్ని చప్పగా నయంచేయుటకు కాదని గుర్తించాలి. కాబట్టి విడుపులేకుండా, ఎల్లవేళలా సాగుతూవుండే పెట్టుబడిదారీ అతిక్రమణలకూ, లేక మార్కెటు మార్పులకూ వ్యతిరేకంగా నిత్యం ఉద్భవించే ఈ తప్పనిసరియగు గెరిల్లా పోరాటలలోనే వారు పూర్తిగా మునిగిపోరాదు. ప్రస్తుత సమాజపద్ధతి తమకు ఎన్ని దుస్థితులను కల్గజేస్తున్నా, అదే సమయంలో అది ఈ సమాజ పునర్నిర్మాణమునకు అవసరమగు భౌతిక పరిస్థితులనూ, సామాజిక రూపాలనూ సృష్టిస్తున్నదన్న విషయాన్ని గ్రహించాలి. "న్యాయమైన రోజు పనికి, న్యాయమైన రోజు కూలి అనే" సంకుచిత నినాదం బదులు వారు వారి పతాకంపై "కూలి పద్ధతి రద్దుకావాలి" అనే విప్లవనినాదాన్ని లిఖించాలి."

(మార్క్స్-'విలువ, ధర, లాభం' సెలెక్టెడ్ వర్క్స్: వాల్యూం I పేజీ 275)

ఇది వర్గరహితసమాజంలోనే, సోషలిజంలోనే లభిస్తుంది. కాబట్టి ఈనాడు జీవనభృతికై పోరాటాడుచున్నారంటే, అసలు దోపిడీ విధానాన్నే నిర్మూలించుటకు కార్మికవర్గం గావించే విప్లవ పోరాటంలో ఒకభాగమే అది. ఈనాటి దోపిడి పెట్టుబడిదారీ విధానంలోనైనా 'సమాన విలువల మధ్యనే మారకం' అనే బూర్జువాసూత్రం ప్రకారమే, తమ శ్రమశక్తికి తగిన విలువను కోరుచున్నారన్న మాట. కాని పతనదశలోనున్న పెట్టుబడిదారీవర్గం ఈ సూత్రాన్నికూడా మంటగల్పి, జీతాలనుకూడా దొంగిలించి, తన అధిక లాభాలను నిలబెట్టుకోవాలని చూస్తున్నది. దానికి సహాయంగానే కమిటీ సూచనలు తయారుచేయబడ్డవి.

పరిశ్రమలను భూమిని జాతిపరం చేయడమే జీవనభృతి సంపాదనకు గల రాజబాట

ఈనాటి ఉత్పత్తిశక్తుల అభివృద్ధి దశ ననుసరించే, దోపిడిని సమూలంగా నాశనము చేయకముందే, లాభాలను కంట్రోలు చేయటంద్వారా, అనగా, స్టాలిన్ చెప్పినట్లు పెట్టుబడిదారీశక్తుల దోపిడిస్వభావమును హద్దుల్లో పెట్టివుంచడముద్వారా, పారిశ్రామిక కార్మికులకుగాని, వ్యవసాయ కూలీలకుగాని ఏ విధంగా జీవనభృతిని యివ్వవచ్చునో పైదానినిబట్టి స్పష్టమగుచున్నది. కాని, పెట్టుబడిదార్ల లాభాలకు కళ్ళేలను తగిలించటం ఎట్లా? అది పెట్టుబడిదారీ సరిహద్దులలోనే నేటి భూస్వామిక విధానంక్రిందనే సాధ్యమా? ఆయువుపట్లన్నీ ఎదటివానికర్పించి, కుస్తీ గెల్వడం సాధ్యమా? ఉత్పత్తిసాధనాలు, పరికరాలు అగు యంత్రములు, పరిశ్రమాలయములు, గనులు, రైల్వేలు, భూమి, అడవులు వగైరాలన్నిటినీ పెట్టుబడిదార్లు, భూస్వాములు, ధనికరైతులు మున్నగు వర్గాల గుత్తాధికారం క్రిందనే వుంచి, జాతీయాదాయం పంపకంపైకూడా పూర్తిగా వారికే కంట్రోలునిచ్చి, రాజకీయాధికారమంతా వారికే వాయనమిచ్చి లాభాలను కంట్రోలు చేయబూనటము కంటె వేరొండు పిచ్చిఊహ వుండగలదా?

ఈ విషయం మనలను సూటిగా రాజకీయాలలోనికి గొనిపోవుచున్నది. రాజకీయాధికారమంతా దోపిడివర్గాల చేతులలోనే వున్నంతకాలం, ఉత్పత్తిపై వారికి పూర్తిగుత్తాధికారంవున్నంతకాలం, జీవనభృతిని సంపాదించటం కాదుసరిగదా, ఇప్పటిజీతాలనూ, కూలిరేట్లనూ నిలబెట్టుకొనడమే అసాధ్యమౌతుంది. పెట్టుబడిదారీవిధానంలో సంక్షోభం అతి విషమ రూపాన్ని దాల్చిన ఈ దశలో కార్మికులకు సహాయాలను జేకూర్చే ఏలాంటి సంస్కరణను పాలకవర్గాలు చేయవు. చేయలేవుసరికదా, నిరంతరం ప్రజాసామాన్యంయొక్క జీవనస్థాయిపై దాడులుచేస్తూ వుండటంద్వారానే తమ అస్తిత్వాన్ని నిలబెట్టుకోగల్గుతాయి. అందుకై అవి తమ రాజ్యాధికారబలంవల్లనేగాక, కపటపు స్కీములద్వారాకూడా ప్రజాజీవితముపై దాడిజేస్తాయి. ఇంతేకాదు: పెట్టుబడిదారీవిధానం అతి విషమదశకు జేరిన ఈదశలో వుత్పత్తి పడిపోతున్నది: నిరుద్యోగం ప్రబలిపోతోంది: కష్టజీవులకు చేతినిండా పని దొరకటంలేదు. 260 దినాలూ భార్యాభర్తలిదరూ పనిజేస్తేనే, రోజుకు రు 7-8-0 సంపాదిస్తేనే, వారి కుటుంబపోషణ గౌరవప్రదంగా జరుగుతుందని చూసాము. కాని ఈ దివాలాకోరు వ్యవస్థలో పురుషునకే 260రోజులూ పని దొరకటంలేదు. ఇక వ్యవసాయంలో చూస్తే, రోజు కూలీలకు, పురుషునికి 200 రోజులు, స్త్రీకి 60 రోజులు కూడా పని దొరకటం దుర్ఘటమైపోతున్నది. ఇక వీరి సంసారంగడవటమెట్లా? ఇక వీరికి నిరుద్యోగభృతిగాని, వృద్ధాప్య భీమాగానీ, ఇతర సౌకర్యాలుగాని లేనేలేవు. నేటి దివాలాకోరు పెట్టుబడారీవిధానం పెత్తనం చలాయిస్తూ వున్నంతకాలం కార్మికవర్గానికి, కష్టజీవులకు జీవనభృతీ దొరకదు, చేతినిండా పనీ దొరకదు: ఉండనిల్లుగానీ, కట్టబట్టగానీ, తినతిండిగానీ దొరకదు: ఏ భీమాసౌకర్యాలూ లభించవు.

ఈ ఇక్కట్లు, ఈ దారిద్ర్యం, ఈకరువు, ఆకలిమంటలు తప్పవు.

అందుచే కార్మికవర్గాన్ని - ఒక్క కార్మికవర్గాన్నే కాదు; పేదరైతులనూ, కష్టజీవులగు మధ్యతరగతి ప్రజానీకాన్ని - ఎదుర్కొంటున్న ఈ వినాశనకర పరిస్థితులను నిర్మూలించాలంటే అందుకు ఒక్కటే మార్గమున్నది. జనరల్ సంక్షోభమనే సుడిగుండంలో బుడుంగుమంటున్న నేటి పెట్టుబడిదారీవ్యవస్థ పరిపాలనకు స్వస్తి జెప్పాలి. భూస్వామికవిధానాన్ని అంతమొందించి, భూమిని జాతిపరంజేసి, వ్యవసాయకూలీలకూ, పేదరైతులకూ ఇవ్వాలి భారీ పరిశ్రమలనూ. ప్రధాన పరిశ్రమలనూ జాతిపరంచేయాలి. లాభాలపై ఖచ్చితమగు కంట్రోలును నెలకొల్పాలి. ఏసందర్భంలోనూ 100 కి 6 వంతులకన్న ఎక్కువ లాభాన్ని అనుమతించరాదు. ఈవిధంగా చేసినప్పుడే పట్టణకార్మికులకుగాని, వ్యవసాయకూలీలకుగాని, వారి శ్రమశక్తికి పూర్తి విలువగా కూలిరేట్లు ముట్టగలవు: చేతినిండా పని దొరకగలదు. 'కనీసకూలి' 'జీవనభృతి' 'ప్రాతిపదికకూలి' 'న్యాయమగుకూలి' అన్నీ ఒకే ప్రమాణంలో, కార్మిక శ్రమశక్తి విలువగా, వారికి ముట్టగలవు.

గుత్త వ్యాపారం బలిసిన ఈ దశలో ఏ మాత్రం కూలిరేట్లు పెరిగినా ధరలను పెంచాలి. ఆ విధంగా భారాలను కొనుగోలుదార్లపైనా, ఇతర పరిశ్రమలలోని చిన్న పెట్టుబడిదార్లపైనా, త్రోసి గుత్త పెట్టుబడిదార్లు తమ దోపిడీ లాభాలను నిల్పుకొంటున్నారు. కాబట్టి పెట్టుబడిదారీవర్గం చేతులలోనే, అందులోనూ పెద్ద పెట్టుబడిదారుల చేతులలోనే రాజ్యాధికారమంతా కేంద్రీకరింపబడి వున్నంతవరకు కూలిరేట్లు పెంపకంవల్ల ధరలు పెంచబడుతూనే వుంటాయి. కాని నిజానికి ఇందుకు అధికమగు హేతువేమీలేదు. ఇందువల్లనే భారీపరిశ్రమలనూ భూమిని జాతిపరం చేయటం అత్యంతావశ్యకమగు వున్నది. ఇదే గనుక జాతిపరం చేయబడి, లాభాలు గనుక కంట్రోలు చేయబడినచో, కూలిరేట్ల పెంపకంవల్ల ధరలు పెరిగే ఆవశ్యకత ఎంతమాత్రం వుండజాలదు. ఈ విధంగా జీవనభృతి సమస్యా, నిరుద్యోగం వగైరా సమస్య నూటిగా కార్మికోద్యమాన్ని ప్రప్రధాన రాజకీయ సమస్యకు - రాజ్యాధికారం ప్రశ్నకు - ముడిపెట్టుచున్నవి.

మరణావస్థలోనున్న నేటి పెట్టుబడిదారీ విధానమూ, దాని ఏజంటు నెహ్రూ ప్రభుత్వమూ కార్మికవర్గమునకు తోడ్పడగలిగే ఏలాంటి సంస్కరణనూ చేయలేదనుట స్పష్టమే. "ఏరు దాటేందాకా ఏటిమల్లన్న ఏరు దాటేంతరువాత బోడిమల్లన" అన్నట్లు ఎన్నికల్లో ఓట్లను సంపాదించేదాకా పరిశ్రమలను జాతిపరం చేస్తాననటం, భూస్వామిక విధానాన్ని రద్దుచేస్తాననటం; ఎన్నికలైన మర్నాడు, పదిఏండ్లదాకా జాతిపరంచేసే ఊసే తలబెట్టననటం, నోట్లముద్రణం కాలంలో జమీందారీ కొనుగోలును కూడా వాయిదా వేస్తూండటం, ఎవరైనా ఎన్నికల వాగ్దానాన్ని గుర్తుకు తెచ్చారా అంటే వారి నెత్తిపై లాఠీ, గుండ్లకి తుపాకిగుండ్లు బారుచేయటం: ఇదీ పెట్టుబడిదారీ ప్రభుత్వం తంతు. కాబట్టి పెట్టుబడిదారీ, భూస్వామికవర్గాలకు యెట్టి స్థానమూ లేక కేవలం కార్మికులూ, పేదరైతులూ, కష్టజీవులగు మధ్యతరగతి ప్రజలూ రాజ్యాధికారాన్ని చలాయించే నూతన ప్రజాతంత్రంలోనే ఇట్టి సంస్క-

రణలు సాధ్యం కాగలవు. జీవనభృతి కోసం, నిండుపనికోసం, నిరుద్యోగభృతి కోసం, సెలవలకోసం, 7 గంటల పని కోసం, ఇతర హక్కులకోసం పోరాడే విప్లవ కార్మికవర్గం, ఇతర కష్టజీవులతో కలిసి ఇట్టి నూతన ప్రజాతంత్ర ప్రభుత్వం కొరకై కృషిచేయుటమే ప్రప్రధాన కర్తవ్యమునుగా కల్గివున్నారు.

కార్మిక ద్రోహులగు సోషలిస్టుల పాత్ర

'ఫెయిర్ వేజస్ కమిటీ' అనబడే ఈ పెట్టుబడిదారీ నాటకబృందంలో కంపెనీ యూనియన్ అగు జాతీయ ట్రేడుయూనియన్ ఫెడరేషన్ ప్రతినిధులూ, సమ్మెవిచ్ఛిన్నకారులగు హింద్ మజ్దూర్ సంఘ ప్రతినిధులుగా సోషలిస్టులు వున్నారు. వీరి సూచనలకన్నింటికీ అంగీకరించారు. వార్తల ప్రకారం, ఈ సూచనలంగీకరింపబడుటకు వీరిదే ప్రధాన బాధ్యత. కమిటీలో వీరు వహించిన పాత్రనుబట్టియే వీరి వర్గస్వభావం, వీరి అసలురంగు బైటపడుచున్నవి.

ఈ రెండు సంఘాల నాయకులు అగు సోషలిస్టులూ, కాంగ్రెసువాదులూ పెట్టుబడిదార్లతో సహకరించి ఈ ఆర్థిక సంక్షోభంనుండి వారిని తప్పించడానికై అతి ఆతురతను జూపుచున్నారు. ఈ సంఘాల ప్రధాన లక్ష్యం ఒక్కటే: ఏ మార్గాన అయినా సరే పెట్టుబడిదారీ వ్యవస్థను నేటి విషమ స్థితినుండి గట్టెక్కించాలి. ఏదో విధంగా నేటి ఆర్థికవ్యవస్థనే నిలబెట్టి వుంచాలి. ఈ లక్ష్యసాధనలో ఈ రుహనా కార్మిక నాయకులు కార్మికుల జీవనప్రమాణాన్ని తగ్గించి, ఆవిధంగా కార్మికుల నష్టంపైననే నామమాత్రమగు సంస్కరణలను గావించుటకు మొనగాళ్ళుగా నిలుస్తున్నారు. సంక్షోభం తీవ్రమైనకొలదీ, కార్మికవర్గంలో అసంతృప్తి జ్వాలలు పెరిగినకొలదీ, ఆ కార్మికుల కోపంనుండీ, అసంతృప్తినుండీ కొక్కాల నుండీ తప్పించుకొంటానికై ఈ కార్మిక ద్రోహులు తీవ్రపదజాలాన్ని ఉపయోగిస్తూ కార్మికులను మోసగింపజూస్తారు. ఒకవైపున పెట్టుబడిదారీ విధానంయొక్క దివాలాకోరుతనాన్ని గూర్చి నిప్పులు గక్కుతూనే, ఈ శిధిల వ్యవస్థ స్థానే, ఒక 'ఉన్నత' వ్యవస్థను స్థాపించాలని డంబాలు పల్కుతూనే, అదే పాడు నోటితో మరోవైపున ప్రస్తుతం ఈ విషమ స్థితినుండి ఏదోవిధంగా బైటపడాలనీ, అందుకొరకై 'వాస్తవిక దృష్టితో' సమస్యను వీక్షించాలనీ, కార్మికులుకూడా తమ వంతు 'త్యాగాలను' గావించాలని వాగుతారు. అంతర్జాతీయ రంగంలో నేడు మితవాద సోషలిస్టులందరూ అవలంబించే పంథాయిదే. 'ఉత్పత్తిచేయండి, లేదా నాశనమవండి' అని సర్ స్టాఫర్డ్ క్రిప్సు అన్నా, వానినుండి ఎరువు తెచ్చుకొని నెహ్రూ అన్నా, జయప్రకాశ్ నారాయణ అన్నా, వారి దృష్టిలో వున్నది పెట్టుబడిదారీ వుత్పత్తి మాత్రమే. కార్మికుల సౌభాగ్యంలేదు: యజమానుల లాభాలే; కార్మికుల తిండికాదు.

తనకు సంభవించిన విషమస్థితినుండి బైటపడటానికై పెట్టుబడిదారీవర్గం కార్మికవర్గంపైనా, జనరల్‌గా కష్టజీవి ప్రజాకోటిపైనా, ఇప్పటికన్న పెద్దదెబ్బ దీయాలని చూస్తున్నది. అందుకై యుద్ధ రంగంలో దాడిచేస్తానికి ముందు అవలంబించే ఎత్తుగడనే పారిశ్రామిక రంగంలో

అవలంబిస్తున్నది. ఈ దెబ్బను కొట్టబోయే ముందు కార్మికవర్గాన్ని మైమరుపులో ఉంచి వారి దృష్టిని ఇతరములపైకి మళ్ళించుటకే కుట్రలను పన్నుచున్నది. ఆవిధంగా అకస్మాత్తుగా దెబ్బకొట్టి, కార్మికులను నిశ్చేష్టులను గావించటానికై చూస్తోంది. ఈ కుట్రలో తమకు సహాయంగా సోషలిస్టుల సేవలను పూర్తిగా వినియోగించుకొంటున్నది. ఫెయిర్ వేజస్ కమిటీలోని సోషలిస్టులు ఈ సేవనే భారత బూర్జువావర్గానికి చేసి పెట్టుచున్నారు

అనేక విప్లవ పోరాటాలలో ఆరితేరిన భారత కార్మికవర్గం ఈ ద్రోహాన్ని గుర్తించకపోదు. పెట్టుబడిదారీ కుట్రలను ఎదుర్కోకపోదు. తన విప్లవ కార్యాచరణ ద్వారానే తన కోర్కెలేమిటో, తన కార్యక్రమమేమిటో, తన కార్యాచరణ పంథా యేమిటో తెలియజేస్తుంది. అప్పుడే ఈ కమిటీ ఈ కమిటీ సూచనలూ ఎక్కడ వుంటాయో చూడగల్గుతాం.

6-52

వ్యవసాయ సమస్యపై
: కామ్రేడ్ లెనిన్ :

[కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ రెండవ కాంగ్రెసులో ప్రవేశపెట్టబడిన వ్యావసాయిక సమస్యపై థీసిస్ యొక్క ముసాయిదా *]

కామ్రేడ్ మార్‌ఖ్లేవస్కీ తన వ్యాసంలో, వ్యవసాయ సమస్యను గురించి రెండవ ఇంటర్నేషనల్ సరిగా అర్థం జేసుకొనక పోవుటయేగాక, ఆ సమస్యపై కార్మికవర్గం అనుసరించ వలసిన ఎత్తుగడలను ఏకారణాలవల్ల సరిగా నిర్ణయించుకొనలేక పోయిందో కూడా స్పష్టంగా వివరించాడు. వ్యావసాయిక కార్యక్రమాన్ని గూర్చి మూడవ అంతర్జాతీయ సంస్థయొక్క కమ్యూనిస్టు సిద్ధాంత సూత్రాలేమిటోకూడా కామ్రేడ్ మార్‌ఖ్లేవస్కీ ఆ వ్యాసంలో చక్కగా తెలియజేసాడు.

ఈ సూత్రాల నాధారం జేసుకొనియే, 1920 జులై 15 న ప్రారంభమయ్యే కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ కాంగ్రెసు, వ్యావసాయిక సమస్యను గూర్చి ఒక జనరల్ తీర్మానాన్ని చేయగలదు. (చేసి తీరాలనికూడా నా ఉద్దేశం).

అటువంటి తీర్మానానికి మొదటి ముసాయిదా ఈ క్రింద ఇవ్వబడుచున్నది.

1. పెట్టుబడిదారుల యొక్క భూస్వాములయొక్క దోపిడీనుండి, వినాశనమునుండి, పెట్టుబడిదారీ విధానం వున్నంతవరకూ తప్పనిసరిగా సంభవించే సామ్రాజ్యవాద యుద్ధాలనుండి గ్రామసీమలలోని కష్టజీవులను విముక్తి చేయగలిగినది కమ్యూనిస్టుపార్టీ నాయకత్వమున నడుపబడే పట్టణ, పారిశ్రామిక

* దీనిని జనత 10 వ (1-8-49) సంచికలో ఇదివరకు ఒకసారి ఇవ్వడం జరిగింది. అది 'లెనిన్ పల్లెటూరి పేదలకు' అనే పుస్తకంలోనుంచి తీసి ఇవ్వబడింది. కాని ఆ అనువాదం సరిగా లేనందువల్ల ఈ వ్యాసంయొక్క ప్రాముఖ్యతను బట్టి మళ్ళీ ఇప్పుడు సరియైన అనువాదాన్ని ప్రచురిస్తు[illegible] — సంపాదకుడు, జనత

శ్రామికవర్గం ఒక్కటే. బూర్జువా వర్గం, భూస్వాములు (పెద్ద భూఖామందులు)కల్పించిన బానిస సంకెళ్ళను త్రెంచుటకై ఈకమ్యూనిస్టు కార్మికులు జరిపే విప్లవ పోరాటానికి సంపూర్ణ సహాయం చేయుటతప్ప గ్రామ పేదలకు విముక్తిమార్గం మరొకటి లేదు.

అదేవిధంగా, పారిశ్రామిక కార్మికులు, ఇతర ప్రపంచంతో జోక్యం లేకుండా తమ స్వల్ప వృత్తి క్షేమాలనే చూచుకొంటూ, తమయొక్క పరిస్థితులనూ, తమకన్న కొద్దిగా మెరుగైనపెటీ-బూర్జువా వర్గంయొక్క పరిస్థితులనూ బాగుచేసుకొనుటకే తాపత్రయం పడుతూ, అందులోనే సంతృప్తిపడుతూ కాలం గడుపుదా మనుకొంటే, యుద్ధాల నుండి, పెట్టుబడిదారుల దోపిడి నుండి మానవజాతిని విముక్తి గావించే తమ మహత్తర చారిత్రక కర్తవ్యాన్ని నెరవేర్చలేక పోతాము.

పారిశ్రామికంగా అభివృద్ధి అయిన అనేక దేశాలలోని "కార్మిక దొరల శ్రేణి" * (labour aristocracy) విషయంలో నిజంగా జరుగుచున్నది ఇదే. నిజంగా సోషలిజమునకు శత్రువుగా తయారై, దానికి ద్రోహంజేసి, పెటీ-బూర్జువా దురహంకారులుగాను, కార్మికోద్యమంలో బూర్జువావర్గం ఏజంట్లుగాను తయారైన (రెండవ ఇంటర్నేషనల్‌కు జెందిన) సోషలిస్టు నామక పార్టీలకు ఈ "కార్మిక దొరల శ్రేణి" యే ఆధారంగా వుంటున్నది. దోపిడిగాండ్రను కూలద్రోయుటకు కష్టజీవులూ, పీడిత ప్రజలూ అందరూ సాగించే పోరాటంలో కార్మిక వర్గం ముందుండి నాయకత్వం వహించి నడిపినప్పుడే కార్మిక వర్గం నిజమైన విప్లవవర్గంగా నిరూపించుకొంటుంది. నిజమైన సోషలిస్టు పంథాలో నడుచుకొంటుంది. వర్గపోరాట సిద్ధాంతాన్ని గ్రామ

* సామ్రాజ్య దోపిడీనుండి వచ్చే లాభాలతో సామ్రాజ్యవాదులు కార్మిక వర్గంలో ఒక భాగానికి బాగా జీతాలిచ్చి మేపుతారు. ఇక రెండో భాగం బూర్జువా వర్గానికి తోకగా తయారై, సంస్కరణవాద పంథా ననుసరించి, విప్లవపంథాలో కార్మికోద్యమం అభివృద్ధి కాకుండాదానిపై తమ పెత్తనాన్ని చలాయిస్తు వుంటారు. వీరే "కార్మిక దొరల శ్రేణి" (అను.)

సీమలలోనికి కూడా తీసికొనిపోయి గ్రామసీమలలోని కష్టజీవుల నందరినిపట్టణ కార్మికుల కమ్యూనిస్టు పార్టీచుట్టూ సమీకరించి, వారికి సరియగు తర్ఫీదు లిచ్చినప్పుడే ఈకర్తవ్యం నెరవేర్చబడగలదు.

2. పట్టణ కార్మికవర్గం నాయకత్వం క్రింద పోరాటంలోనికితీసుకు రాబడవలసిన – ఎట్టి పరిస్థితులలో నైనా కార్మికవర్గ పక్షం వైపుకు త్రిప్పుకొనబడవలసిన – గ్రామ కష్టజీవులందరూ, పీడిత ప్రజలందరూ, పెట్టుబడిదారీ దేశాలన్నిటిలోనూ, ఈ క్రిందివర్గముల క్రింద వున్నారు.

మొదటిరకం — రోజువారీగా గాని, ఆయా ఋతువులలోగాని, పాలుసరిగా గాని, పెట్టుబడిదారీ భూఖామందులవద్ద కూలికి పని జేస్తూ పొట్టబోసుకొనే వ్యవసాయకూలీలు, కూలి పనివారు, గ్రామాలలోని ఇతర జనాభా నుండి వేరుగా స్వతంత్రంగా వీరిని (రాజకీయంగా, మిలిటరీ యూనిట్లలో, కార్మిక సంఘాలలో, సహకారసంఘాలలో, విద్యా వైజ్ఞానిక సంస్థలలో) సంఘటితపర్చటం, వీరిలో తీవ్రమైన ప్రచారాన్ని, ఆందోళనను గావించటం, సోవియటు ప్రభుత్వాము వైపుకు గ్రామికవర్గ నియంతృత్వము వైపుకు వారిని అనుకూలురుగా త్రిప్పుకొనటం – ఇదే అన్ని దేశాలలోని కమ్యూనిస్టుపార్టీల ప్రధాన కర్తవ్యం.

రెండవరకం: అర్ధగ్రామికులు అనగా, నిరుపేదరైతులు, తమ కుటుంబ పోషణకు సరిపోవుసంత ఆదాయం రాని కొద్దిపాటి స్వంత భూములమీద గాని, కవులు భూములమీదగానిపనిచేస్తూ, మరి కొంత జీవనాధారము నుసంపాదించుకొనుటకై పరిశ్రమలలో గాని, ఇతర కమతాలలోగాని కూలికిపని జేయువారే ఈఅర్ధగ్రామికులు, నిరుపేదరైతులు. అన్ని పెట్టుబడిదారీ దేశాలలోనూ ఇట్టి గ్రామ కష్టజీవులు చాలా హెచ్చు సంఖ్యలో వున్నారు. ఇటువంటి అసంఖ్యాకమగు గ్రామకష్టజీవులు వున్నారనే విషయాన్నిగాని, వారి ప్రత్యేక పరిస్థితులను గూర్చిగాని బూర్జువావర్గ ప్రతినిధులూ, రెండవ ఇంటర్నేషనల్‌కు జెందిన మోసకారి సోషలిస్టులు కప్పిపుచ్చి మొత్తం రైతాంగంలోనే వీరిని కూడా జమవేసి, తబ్బిబ్బు చేస్తున్నారు. ఇటువంటి బూర్జువా

దగా పద్ధతి జర్మనీ, ఫ్రాన్సు దేశాలలో ఎక్కువగా కన్పిస్తున్నది. అమెరికా మున్నగు దేశాలలో కూడా కన్పిస్తున్నది. కమ్యూనిస్టుపార్టీకృషిసరిగాఆర్గనైజు చేయబడి యున్నయెడల, ఈ గ్రూపుకు చెందిన రైతులందరూ కమ్యూనిస్టుపార్టీ పక్షమునకు వస్తారు; ఎందుకంటె, దుర్భరమైన పరిస్థితులలో కుమిలిపోతున్న వీరందరికీ సోవియటు ప్రభుత్వంవల్ల, కార్మిక నియంతృత్వంవల్ల వెంటనేఎక్కువ లాభం సమకూరగలదు.

మూడవరకం: చిన్నరైతులు: అనగా, కూలీల నెవరినీ పెట్టుకోనవుసరం లేకుండా, తమ కుటుంబ పోషణనూ, తమ వ్యవసాయ ఖర్చులనూ వెళ్ళదీసుకోగల్గినంత కొద్దిపాటి స్వంత భూములనుగాని, కొద్దిపాటి కవులు భూములనుగాని కల్గినవారు. శ్రామికవర్గ విజయంవల్ల ఈ చిన్న రైతులందరూ ఎక్కువ లాభాన్ని పొందగలరు. ఈ లాభాలు : (1.) పంటలో కొంత భాగాన్ని భూస్వామికిచ్చే పద్ధతుల * (ఫ్రాన్సు, ఇటలీ మొదలైన దేశాలలో వున్న పాలు పద్ధతులు ఇట్టివే) నుండి విముక్తి పొందటం; (2) తనఖాల నుండి విముక్తిపొందుట; (3) (అడవులను వుపయోగించుకొనుట మున్నగు సౌకర్యాలకై) పెద్దపెద్ద భూస్వాములమీద ఆధారపడవలసి వుండుటవల్ల కల్గేబాధలు నిర్మూలింపబడటం, (4) వారి పొలాలకు, వ్యవసాయానికి వెంటనే అవుసరమైన సహాయ సౌకర్యాలన్నీ శ్రామికవర్గ ప్రభుత్వంచే కల్గజేయబడటం (పెద్ద పెట్టుబడిదారీ వ్యవసాయ క్షేత్రాలనుండి స్వాధీనం చేసుకొనబడిన వ్యవసాయ పసిముట్లను, కొన్ని భవనాలను చిన్న రైతుల వుపయోగమునకై ఇవ్వటం; ఇంతకుముందు పెట్టుబడిదారీ విధానం క్రింద ధనికరైతుల మధ్యతరగతి రైతుల ప్రయోజనములకే ప్రధానంగా ఉపయోగపడుచున్న గ్రామ సహకార సంఘాలను, భూమి సహకార

* మన రాష్ట్రములో దీనిని పాలు కట్టుపడి, అంబారం, మక్తా వగైరాల పేర్లతో వ్యవహరిస్తాము. (అనువాదకుడు)

సంఘాలను, ♦ అసంఖ్యాకులైన పేదలకు, అనగా వ్యవసాయకూలీలకు, అర్ధ శ్రామికులకు, చిన్న రైతులకు ఉపయోగపడే సంఘాలుగా మార్చటం; ఇటువంటివే ఇతర సౌకర్యాలను కల్గజేయుటం)

మరొక ముఖ్య విషయాన్ని కమ్యూనిస్టుపార్టీ గుర్తించవలసియున్నది. పెట్టుబడిదారీ విధానం నుండి కమ్యూనిజమునకు మారే మధ్యకాలంలో, అనగా, శ్రామిక వర్గ నియంతృత్వ కాలంలో, ఈ చిన్న రైతులు, కనీసం వీరిలో ఒకభాగం, ఎట్టి హద్దులులేకుండా స్వంత ఆస్తిహక్కులను అనుభవించుటకూ, ప్రైవేటు వ్యాపారాన్ని సాగించుకొనే హక్కులను అనుభవించుటకూ ప్రయత్నిస్తారు. పూర్వంనుండీ ఆహార పదార్థాలను అమ్మేవారుగా (బహుసల్పంగానేమైనా) వుండుట, లాభదృష్టి స్వంత ఆస్తి హక్కు సాంప్రదాయాలు వీరిలో బాగా జీర్ణించి వుండుట ఇందుకు కారణం. అయినప్పటికీ దృఢమైన కార్మికవర్గ పంథాను అనుసరించి, పెద్ద భూస్వాములతోనూ, ధనిక రైతులతోనూ కార్మికవర్గం కనికరం లేకుండా కచ్చితంగా వ్యవహారాలను ఫైసలా చేసుకొనే పక్షంలో ఈ చిన్న రైతులయొక్క ఊగిసలాట అంత ఎక్కువగా వుండక, మొత్తంమీద శ్రామికవర్గ విప్లవం వైపుకు మొగ్గుతారు.

3. మొత్తంమీద పైన చెప్పబడిన మూడు రకాల గ్రామ ప్రజలూ కలిసి, అన్ని పెట్టుబడిదారీ దేశాలలోనూ, జనాభాలో హెచ్చుగా వున్నారు. అందువల్ల పట్టణాలలోనేగాక పల్లెలలో కూడా శ్రామికవర్గ విప్లవం జరుగుబదన్యై తీరుతుంది. కాని దీనికి వ్యతిరేకమైన గట్టిదృక్పథం కూడా ఒకటి వున్నది. ఈ దృక్పథం వుండడానికి కారణాలు: మొదటగా భూస్వాములు, పెట్టుబడిదార్లు మొదలైన దోపిడిగాండ్రకు గ్రామసీమలలోని పైన చెప్పబడిన కష్టజీవులకూ మధ్యగల అగాధాన్ని కప్పిపెట్టునటు

♦ వీటిని మన గ్రామ పరపతి సంఘాలతోనూ, క్రాప్ లోన్ అండ్ సేల్ సొసైటీలతోనూ, ఉత్పత్తిదార్ల - కొనుగోలుదార్ల సహకార సంఘాలతోనూ- పాలు, వెన్న వగైరా సహకార సంఘాలతోనూ, భూమి తనఖా బ్యాంకులతోనూ పోల్చవచ్చును. (అనువాదకుడు)

వంటిన్నీ, ధనిక రైతులకూనూ, అర్థశ్రామికులు, చిన్న రైతులు అగువారికే మధ్యగల అగాధాన్ని కప్పిపుచ్చునటువంటిన్నీ బూర్జువా మోసపు లెక్కలవల్ల ఇటువంటి దృక్పథం ఏర్పడుచున్నది. రెండు: బాగా అభివృద్ధి అయిన దేశాల లోని రెండవ ఇంటర్నేషనల్‌కు జెందిన కార్మిక వీరులూ, సామ్రాజ్యవాదుల ఊడిగం జేస్తూ అవినీతి పాలైన కార్మిక "దొరల శ్రేణీ" గ్రామ సీమలలో నిజమైన విప్లవ ప్రచారాన్ని, అందోళనను, నిర్మాణాన్ని సాగించుటకు ఇష్టపడక, అశక్తతను చూపుటవల్ల గూడా ఇటువంటి దృక్పథం కల్గుచున్నది ఏ ఎండకాగొడుగు పట్టే అవకాశవాదులైన ఈ ద్రోహుల ప్రయత్నాలన్నీ బూర్జువా వర్గంతోనూ ధనిక, మధ్యతరగతి రైతులతోనూ (వీరిని గూర్చి క్రింద చూడండి) సిద్ధాంత రీత్యాను, ఆచరణరీత్యాను రాజీ పడుటకే గాని, కార్మిక వర్గాన్ని ఐక్యంజేసి, బూర్జువా వర్గాన్ని, బూర్జువావర్గ ప్రభుత్వాన్ని కూలద్రోయుటకు గాదు. మూడు: బూర్జువా - ప్రజాతంత్ర వ్యామోహముల వలనే ఒక వ్యామోహంగా పెరి

వైఖరి ఎంత మూర్ఖంగా పరిణమించినదంటే, మార్క్సిస్టు సిద్ధాంతాలవల్ల, రష్యన్ శ్రామిక విప్లవ అనుభవంవల్ల పూర్తిగా రుజువైన సత్యాన్ని గూడా - అనగా, అభివృద్ధి జెందిన దేశాలలోసహా అన్నిదేశాలలోనూ అణగద్రొక్కబడి, ఐక్యతలేకుండా, అతినికృష్టపరిస్థితుల ననుభవిస్తున్న పై మూడు రకాల గ్రామ ప్రజలకు రాజకీయంగా, ఆర్థికంగా, సాంఘికంగా, వైజ్ఞానికంగా సోషలిస్టు విజయంలో అసక్తి వున్నప్పటికీ, శ్రామికవర్గం పూర్తిగా రాజకీయాధికారాన్ని సంపాదించిన తర్వాతనే - పెద్ద భూస్వాములతోనూ, పెట్టుబడిదార్లతోనూ వ్యవహారాన్ని ఖచ్చితంగా ఫైసలా చేసుకున్న తర్వాతనే - ప్రత్యక్షంగా తమకొరక మార్గాన్ని చూపి, అన్నివిధాల సహాయం జేస్తూ తమ హక్కులను రక్షించగల్గిన సంఘటిత శక్తి, రక్ష[illegible] ఒక్క శ్రామిక వర్గమే అని చూచిన తర్వాతనే - ఈ పై మూడు రకాల ప్రజలు విప్లవ శ్రామికవర్గమును పూర్తిగా బలపరుస్తారనే వాస్తవిక విషయాన్నే, ఈ సత్యాన్నే, గుర్తించకపోవుట

వల్లగూడా ఇటువంటి దృక్పథం ఏర్పడుచున్నది.

4. ఆర్థిక దృష్ట్యా "మధ్యతరగతి రైతులు" అంటే ఎవరు? స్వల్పమగు స్వంతభూములుగాని, స్వల్పమగు కవులు భూములుగాని సాగుజేస్తూ, అవిచిన్నవైనా, కాపిటలిస్టు వ్యవస్థలో సర్వసాధారణంగా వారికుటుంబాలకు సరిపోయే ఆదాయమే గాకుండా బాగా పండిన సంవత్సరాలలోనైనా అదనంగా కొంత మిగిలి, పెట్టుబడిగా మార్చుకొనుటకు అవకాశాన్ని ఇచ్చేటంత ఆదాయాన్ని పొందుతూ, దాదాపు తరచు ఉదాహరణకు రెండుమూడు కమతాలలో ఒక కమతం కూలీలను పెట్టుకొని వ్యవసాయం జేసేవారు మధ్యతరగతి రైతులు. ఉదాహరణకు: బాగా అభివృద్ధి జెందిన పెట్టుబడిదారీ దేశమగు జర్మనీలో 5 నుండి 10 హెక్టార్ల వరకూ పొలాన్ని కల్గిన రైతులు మధ్యతరగతి రైతులు. వీరి కమతాల సంఖ్యలో 3వ వంతుకు సమానమైన వ్యవసాయ కూలీలు వీరి క్రింద పనిజేస్తున్నారని జర్మనీలో 1907 లో తీసుకోబడిన జనాభా లెక్కలు తెలియజేస్తున్నవి. ♦ ఎక్కువమంది కూలీలు కావలసిన ద్రాక్షతోటలు వగైరా ప్రత్యేక పంటలు పండించే ఫారిన్సు మొదలైన దేశాలలో వ్యవసాయ కూలీలను పెట్టుకొనడం ఇంకా ఎక్కువగా వుంటుంది.

ఇప్పుడిప్పుడేగాని, లేక శ్రామికవర్గ నియంతృత్వం ప్రారంభకాలములోగాని, ఈమధ్యతరగతి రైతులను కార్మికవర్గం తన వైపుకు త్రిప్పుకొనే కర్తవ్యాన్ని పెట్టుకొనక, వారిని వ్యతిరేకం జేసుకొనకుండా తటస్థంగా వుంచుటకే, అనగా, తమ కూ

♦ సరియైన లెక్కలివి: మొత్తం 57,86,028 కమతాలలో (ఒక్కొక్కరైతు క్రింద వుండే మొత్తం భూమిని ఒక కమతంగా పరిగణిస్తాము. (య) 5-10 హెక్టారుల కమతాల సంఖ్య 6,52,798. ఈ కమతాలలో పనిజేసే స్వంత కుటుంబ సభ్యుల సంఖ్య 20,03,633; వీరు పెట్టుకొనే వివిధరకాల కూలీలు 4,87,704 ఆస్ట్రియాలో 1902 జనాభా లెక్కల ప్రకారము మొత్తం 3,83,331 మధ్యతరగతి రైతుల కమతాలలో కూలీలను పెట్టుకొన్న కమతాల సంఖ్య 1,26,136. ఈ కమతాలపై పనిజేసే రైతు కుటుంబ సభ్యులసంఖ్య 12.65,969. కూలీలసంఖ్య 1,46,004. ఆస్ట్రియాలో మొత్తం కమతాల సంఖ్య 28,56,349.

బూర్జువా వర్గానికీ మధ్య జరిగే పోరాటంలో ఈ మధ్యతరగతి రైతులు తటస్థంగా వుండునట్లు చేయుటయే ప్రధాన కర్తవ్యంగా పెట్టుకోవాలి. ఒకవర్గం నుండి మరొకవర్గం వైపుకు వూగులాడుతూ వుండటం తప్పనిసరిగా జరుగుతుంది: బాగా అభివృద్ధి జెందిన పెట్టుబడిదారీ దేశాలలో నూతనశకం యొక్క మొదటి దశలో ఈ మధ్యతరగతిరైతులు బూర్జువావర్గంవైపునే ప్రధానంగా మొగ్గుతారు. వీరి ప్రపంచ దృక్పథంలోనూ, ప్రవర్తనలోనూ ఆస్తిపరుల సాంప్రదాయాలే ఆధిక్యత వహిస్తాయి: లాభాలను సంపాదించుటలోనూ, స్వేచ్ఛావ్యాపారాన్ని సాగించుటలోనూ, స్వంత ఆస్థిని కలిగి వుండుటలోనూ వీరికి ప్రత్యక్షంగా ఆసక్తి వున్నది: కూలీలకూ వీరికీ సూటియగు వైషమ్యంవున్నది. విజయం పొందిన శ్రామికవర్గం మక్తాలను, తనఖాలను రద్దుచేసి వీరి పరిస్థితులను ప్రత్యక్షంగా అభివృద్ధి జేస్తుంది. పెట్టుబడిదారీదేశాలలో, ఎక్కువ వాటిలో శ్రామికవర్గ ప్రభుత్వం వెంటనే స్వంతఆస్తినంతనూ రద్దు చేయనక్కరలేదు. ఇంతేగాదు, చిన్న రైతులకు, మధ్యతరగతి రైతులకు వారివారి పొలాలను గ్యారంటీ చేయుటమేగాక, వారు లోగడ కౌలుకుజేస్తున్న భూములను కూడా వారికే యిచ్చి, వారి భూమిని పెంచుతుంది. (అనగా కౌలుపద్ధతిని రద్దుజేస్తుంది.)

రైతులకు సహాయపడే ఇటువంటికార్యాలనుజేస్తూ, బూర్జువా వర్గంతో నిర్దాక్షిణ్యమైన పోరాటాన్ని జరిపిన యెడల మధ్యతరగతి రైతులందరూ తప్పనిసరిగా తటస్థవైఖరిని అవలంబిస్తారు. కార్మికవర్గం సమిష్టి వ్యవసాయ పద్ధతికి బహుజాగ్రత్తతో సాగిపోవాలి; మధ్యతరగతి రైతులను ఏమాత్రం బలవంత పెట్టకుండా, ఆదర్శప్రాయమగు ఉదాహరణల ద్వారా నచ్చజెప్పుతూ క్రమేణా సమిష్టి వ్యవసాయపద్ధతికి సాగిపోవాలి.

పెద్దరైతులంటే ఎవరు? ఎక్కువమంది కూలీలను పెట్టి పెట్టుబడిదారీపద్ధతులతో వ్యవసాయాన్ని సాగిస్తూ, సాంప్రదాయములవల్ల, మామూలుగా అందరు రైతులతో బాటే విజ్ఞాన విహీనతను కలిగి వుండుటవల్ల, తమ పొలాలలో స్వయంగా శరీరకష్టం జేసే

అలవాటు వుండటంవల్ల మాత్రమే 'రైతులు'గా పరిగణింపబడే ధనిక రైతులు. బూర్జువావర్గం ఈ ధనిక రైతులే పెద్ద భాగంగావున్నారు. విప్లవ శ్రామికవర్గానికి వీరు బద్ధ వైరులు. గ్రామసీమలలో పని చేసే కమ్యూనిస్టుపార్టీల దృష్టి యంతా వీరితో తీవ్రమైన పోరాటాన్ని సాగించుటలోనూ, వీరి రాజకీయ, తాత్విక (ఐడియలాజికల్) సిద్ధాంతాల ప్రభావంనుండి గ్రామప్రజల నందరినీ విముక్తి గావించుటలోనూ కేంద్రీకరింప జేయాలి.

పట్టణాలలో శ్రామికవర్గం విజయాన్ని సాధించినపిమ్మట, పెద్ద రైతులందరూ విప్లవ ప్రతీఘాతకులుగా తయారై ప్రతిఘటనకు సాయుధతిరుగుబాట్లకు, విధ్వంసక కార్యాలకూ తప్పక పూనుకొంటారు. అందుకు వీరిని నిరాయుధం గావించుటకై విప్లవ శ్రామికవర్గం ఇప్పటినుండి సిద్ధాంత రీత్యానూ, నిర్మాణరీత్యా అవుసరమగు శక్తులను తయారుచేయుటకు పూనుకోవాలి. పారిశ్రామిక పెట్టుబడిదార్లను కూలద్రోయుటతోపాటు, యీ వర్గం ఏమాత్రం ప్రతిఘటనను జూపినా దానిని వెంటనే మొదట్లోనే గట్టిదెబ్బను కొట్టాలి. ఇందుకై గ్రామ శ్రామికులందరికీ ఆయుధాలిచ్చి శ్రామికులు, అర్ధశ్రామికులు ఆధిక్యత వహించునట్టి దోపిడీగాండ్రకు స్థానంలేకుండునట్టి గ్రామ సోవియట్లను ఆర్గనైజు చేయాలి.

అయినప్పటికీ, మిక్కిలి పెద్ద రైతులైన వారియొక్క భూములను గూడా ఎట్టి పరిస్థితులలోనూ మొదట్లోనే విజయవంతమగు శ్రామికవర్గం స్వాధీనం జేసుకొనరాదు. ఎందుకంటె, అటువంటి పెద్ద కమతాలను వెంటనే సోషలిస్టు పద్ధతులలో సాగించుటకు అవుసరమగు భౌతిక పరిస్థితులుగాని, అంతకన్న ముఖ్యంగా టెక్నికల్ పరిస్థితులుగాని, సామాజిక పరిస్థితులుగాని ఇంకా ఏర్పడి లేవు. కాని ప్రత్యేక సందర్భాలలో, అదైనా మిక్కిలి అరుదుగానే కొన్ని భూములను — చిన్న చిన్న ఖండాలుగా కవులుకు ఇవ్వబడినవిగాని, లేక చుట్టుపక్కల నున్న చిన్నరైతులకు ఎక్కువ అవుసరంగా వున్నవాటినిగాని — స్వాధీనం జేసుకొనవచ్చును. ఈ పెద్ద రైతులకు చెందిన వ్యావసాయిక యంత్రాలలో కొన్నిటిని

మాత్రం కొన్ని షరతులతో ఉచితంగా చిన్న రైతులు వాడుకొనుటకై హామీ యివ్వబడుతుంది. పోతే, జనరల్ సూత్రంగా, పెద్ద రైతుల భూములను వారిచేతుల లోనే వుంచి, కష్టజీవుల ప్రభుత్వానికి వారు విరుద్ధంగా ప్రవర్తించి నిరోధించే పక్షంలోనే వారి భూములను స్వాధీనం చేసుకొనవలసి వుంటుంది. అనేక ప్రత్యేక పరిస్థితులవల్ల ఈ పెద్ద రైతులతో జరిగిన పోరాటంచాలా దీర్ఘంగాను, చాలా క్లిష్టరూపములలో జరిగిన రష్యన్ శ్రామిక విప్లవం అనుభవాలను జూస్తే, ఏ మాత్రం ప్రతిఘటన చూపినా గట్టి దెబ్బను కొట్టుసరికి ఈ తరగతి శ్రామికవర్గ ప్రభుత్వంయొక్క ఆజ్ఞలను విశ్వాసంతో నెరవేరుస్తుందనీ. అంతేగాక, కష్టజీవుల నందరనూ సంరక్షిస్తూ సోమరిపోతులగు ధనికుల యెడ అతి నిర్దాక్షిణ్యంగా ప్రవర్తించే ప్రభుత్వంయెడ, అతి మెల్లగానైనా, భక్తి గౌరవములను అలవర్చుకొంటుందని తెలుస్తున్నది.

బూర్జువావర్గాన్ని జయించిన కార్మికవర్గం రష్యాలోని పెద్ద రైతులకు వ్యతిరేకంగా పోరాటాన్ని జరిపినప్పుడు, దానిని క్లిష్టం జేసి, మందగింపజేసిన ప్రత్యేక పరిస్థితులు ఇవి: 1917 నవంబరు విప్లవం జరిగినతర్వాత రష్యన్ విప్లవం "జనరల్ ప్రజాతంత్ర" దశగుండా అనగా దాని మూల స్వభావంలో, రైతాంగంమొత్తం భూస్వామికవర్గానికి వ్యతిరేకంగా జరిపిన పోరాటంయొక్క బూర్జువా ప్రజాతంత్ర దశగుండా నడవటం; పట్టణ కార్మికవర్గం వైజ్ఞానికంగాను, సంఖ్యలోనూ బలహీనంగా వుండటం; ఆఖరకు దేశంయొక్క విస్తారత, రహదారీ మార్గములు చాలా హీనంగా వుండటం. అభివృద్ధి జెందిన దేశాలలో ఇటువంటి అడ్డంకులు లేనంతవరకూ, యూరపు, అమెరికాలలోని విప్లవ శ్రామికవర్గం పెద్దరైతులయొక్క ప్రతిఘటనను ఎదుర్కొనుటకై ఇంకా ఎక్కువశక్తితో ముందుగానే తయారై ఇంకా ఎక్కువ త్వరగానూ, ఎక్కువ ధృడనిశ్చయంతోనూ, ఎక్కువ జయప్రదంగాను ఓడించి, సంపూర్ణ విజయాన్ని పొందాలి; ఇంకా ప్రతిఘటనను సాగించుటకు ఏమాత్రం అవకాశాన్ని లేకుండాజేయాలి. ఇది చాలా అవుసరం: ఎందు

కంటే పెద్ద రైతులమీద అటువంటి సంపూర్ణ విజయం చేకూరనంతవరకూ శ్రామికవర్గ రాజ్యాధికారం పూర్తిగాస్థిరపడినదని వ్యవసాయకూలీలు, అర్ధశ్రామికులు, చిన్నరైతులు విశ్వసించలేరు.

భూస్వాముల యొక్క పెద్ద భూఖామందులయొక్క యావత్తు భూమినీ విప్లవశ్రామిక వర్గం వెనువెంటనే, నిస్సంకోచంగా ఎటువంటి నష్టపరిహారం లేకుండా స్వాధీన పర్చుకోవాలి (Confiscate). పెట్టుబడిదారీ దేశాలలో సూటిగాగాని, లేక తమ ఇజారా దార్ల ద్వారా (Farmers) గాని పద్ధతిప్రకారం వ్యవసాయ కూలీలనూ, తమ క్షేత్రాల పొరుగున వుండే చిన్న రైతులకూ (తరచు, మధ్య తరగతి రైతులలో ఒక భాగాన్ని కూడా) దోచుకుంటూ వుండేవారూ; స్వయంగా కాయకష్టం జేయనివారూ; ఎక్కువగా జమీందారీ ప్రభువుల సంతతి (రష్యా, జర్మనీ, హంగేరీలలో ప్రభువర్గం యొక్క, ఫ్రాన్సులో తిరిగి నెలకొల్పబడిన సీనోర్ల యొక్క, ఇంగ్లాండులో లార్డుల యొక్క, అమెరికాలో పూర్వపు బానిస యజమానుల యొక్క సంతతి) కి జెందినవారుగా గాని, మిక్కిలి సంపన్నులగు బ్యాంకర్ల యొక్క సంతతికి జెందినవారుగాగాని, లేక దోపిడిగాండ్రు, సోమరులగు ఈపైరెండురకాల రెుుక్క సంకర సంతతికి జెందినవారుగా గాని వుండేవారే ఈ భూస్వాములూ, పెద్ద భూఖామందులు.

ఈ పెద్ద భూఖామందుల భూములను స్వాధీన పర్చుకున్నసందర్భంలో వాటికినష్టపరిహారంఇవ్వాలని అనటంగాని, ఇవ్వటంగాని ఏ పరిస్థితులలోనూ, కమ్యూనిస్టుపార్టీరాంకులలో సహించరాదు; ఎందుకనగా, యూరపులోనూ అమెరికాలోనూ ఇప్పుడున్న పరిస్థితులను బట్టి ఈ విధంగా నష్టపరిహారం యివ్వటం అంటే, యివ్వాలని అనటం అంటే, అది సోషలిజానికి ద్రోహం చేయటంతో నే సమానం; కోటీశ్వరుల సంఖ్యను పెంచి, వారి సంపదలను యినుమడింపజేసిన యుద్ధంవల్ల విపరీతంగా బాధలు పడిన కష్టజీవులగు పీడితులగు ప్రజాసామాన్యంపై అదనపు బరువులను వేయుటమే అవుతుంది.

అయితే పెద్ద పెద్ద భూస్వాములనుండి స్వాధీనం చేసుకొనబడిన

భూములలో విజయవంతమగు శ్రామికవర్గం ఎటువంటి వ్యవసాయపద్ధతులను ప్రవేశపెట్టాలి? అనే ప్రశ్నవున్నది. రష్యా ఆర్థికంగా వెనుకబడి వుండుటనుబట్టి ఈ భూమిని, వారి వుపయోగార్థం రైతులమధ్య పంపకం జేయటమే ప్రధాన పద్ధతి. కాని చాలా అరుదుగానే, ప్రత్యేక సందర్భాలలోనే "సోవియటు క్షేత్రాలు"* అనబడేవి ఆర్గనైజు చేయబడగలవు: పూర్వపు వ్యవసాయ కూలీలను ప్రభుత్వ జీతగాళ్ళ (employees పనికి కుదిరేవారు) గాను, రాజ్యాంగ యంత్రాన్ని నడిపే సోవియట్లలో సభ్యులుగాను మార్చి, వారిద్వారా స్వంతంగానే శ్రామికవర్గ ప్రభుత్వం ఈ క్షేత్రాలను నడపగలదు. అభివృద్ధి జెందిన పెట్టుబడిదారీదేశాలలో ఇటువంటి పెద్ద వ్యవసాయక్షేత్రాలను అట్లే వుంచి, వాటిని రష్యాలోని "సోవియటుక్షేత్రాల" పద్ధతిపై నడుపుట సరియైన పద్ధతియని కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ అభిప్రాయపడుచున్నది. విధంగా వప్పగించి, ఎట్టి పరిస్థితులలోనూ స్వాధీనం జేసుకొన్న భూములలో కొన్నిటిని పేదరైతులకూ, కొన్ని సమయాలలో మధ్యతరగతి రైతులకుకూడా, ఉచితంగా పంపకం చేయగూడదని చెప్పుట పొరబాటు.

సాధారణంగా, పై అభిప్రాయమునకు వ్యతిరేకంగాచేయబడే వాదన ఏమిటంటే, మొదటిది, స్వల్ప వ్యవసాయంకంటె భారీ వ్యవసాయం టెక్నికల్‌గా చాలా ఉత్తమమైనదని. ఈ విధంగా వాదించేవారు నిస్సందేహమగు సిద్ధాంత సత్యమునకు మారుగా అవకాశవాదమునూ, విప్లవద్రోహమునుమాత్రమే ప్రదర్శిస్తున్నారు. ఎందుకంటే, బానిస పద్ధతికి వ్యతిరేకులైన ఉత్తర అమెరికా బూర్జువావర్గం 1863_65 అంతర్యుద్ధంగా తాత్కాలికంగా పత్తిపంట వుత్పత్తితగ్గిపోవుటకుకూడా అంగీకరించినట్లే, విప్లవవిజయమును రూఢిగా పొందుటకై కార్మికవర్గం,ఉత్పత్తి తాత్కాలికంగా తగ్గుటకు వెనుదీయకూడదు. బూర్జువావర్గానికి కాని ఈ నియమాన్ని ఇదే ఉత్పత్తి ఉత్పత్తికొరకే: కష్ట

* ప్రభుత్వ వ్యవసాయ క్షేత్రాలనే "సోవియటు క్షేత్రాలు" అని వ్యవహరిస్తున్నాను. (అనువాదకుడు)

జీవులూ, దోచుకోబడేవారూ అగు ప్రజాసామాన్యమునకో, దోపిడిగాండ్రను కూలద్రోసి, పెట్టుబడిదారులకు గాకుండా తమకొరకే వుత్పత్తిని సాగించే పరిస్థితులను కలుగజేయటం ప్రధానవిషయం: విప్లవమును విజయం పొందించటం, స్థిరపర్చటమే శ్రామికవర్గంయొక్క ప్రప్రధాన మూలకర్తవ్యం. మధ్యతరగతి రైతులను తటస్థంగా వుండేటట్లు చేయకుండా చిన్నరైతులు—కనీసం వారిలో పెద్దభాగంయొక్క మద్దతును సంపాదించకుండా, కార్మికవర్గ అధికారానికి స్థిరత్వం కలిగించటం అసాధ్యం.

రెండు: ఉత్పత్తిని అధికంజేసే విషయం అట్లా వుంచి, ప్రస్తుతం సాగుతూవున్న భారీ వ్యవసాయాన్ని నిలబెట్టాలన్నా గ్రామ శ్రామికులు గొప్ప ట్రేడ్ యూనియన్ శిక్షణను రాజకీయ-నిర్మాణశిక్షణను పొంది మిక్కిలి అధికమగు విప్లవ చైతన్యమును అలవర్చుకోవాలి. ఇంకా అటువంటి పరిస్థితులు ఏర్పడనప్పుడు, లేదా, అటువంటి పనులను ఎక్కువ సామర్థ్యాన్ని, తెలివితేటలను కల్గియుండని కార్మికుల చేతులలో తొందరపడి పెట్టటం మంచిది కానప్పుడు, పెద్ద ప్రభుత్వ కృషి క్షేత్రాలకు పరుగులెత్తే ప్రయత్నాలను గావించుటవల్ల శ్రామికవర్గ ప్రభుత్వానికి అపకీర్తి కూడా వస్తుంది. అట్టి పరిస్థితులలో చాలా జాగ్రత్త తీసుకొని, "సోవియటు క్షేత్రాలను" నిర్మించుటకు ముందు అవుసరమగు సన్నాహాల నన్నిటినీ గావించవలసి వుంటుంది.

మూడు: అన్ని పెట్టుబడిదారీ దేశాలలోనూ, బాగా అభివృద్ధియైన వాటిలో గూడా, పెద్ద భూఖామందులు చుట్టు పక్కల చిన్నరైతులను దోచుకొనే అర్ధ-జమీందారీ రూపాలలో ఇంకా మధ్యయుగాల చిహ్నలు నిల్చివున్నవి. ఉదాహరణకు జర్మనీలో, ఫ్రాన్సులో, అమెరికా సంయుక్త రాష్ట్రములలో వుండే ఆచార పద్ధతులు (అమెరికా దక్షిణరాష్ట్రాలలో ఈ విధంగా దోచుకోబడేది నీగ్రోలే ఎక్కువ యైనా, తరచు తెల్లవారుకూడా దానికి గురియౌతూనే వున్నారు.) అటువంటి పరిస్థితులలో, లోగడ చిన్న రైతులు కౌలుకు తీసుకొనబడ్డ భూములను వారు స్వేచ్ఛగా అనుభవించుటకు

గాను శ్రామిక వర్గ ప్రభుత్వం ఇచ్చి వేయవలసి వుంటుంది. ఇంతకన్న మరొక ఆర్థిక పద్ధతిగాని, టెక్నికల్ పద్ధతిగాని ప్రస్తుతం లేదు. ఒక్క చిటికెలో సృష్టింపబడుటా సాధ్యంగాదు.

పెద్ద కమతాలకు జెందిన వ్యవసాయ యంత్రాలను, పనిముట్లను ప్రభుత్వం నిస్సంకోచంగా స్వాధీనం జేసుకొని ప్రభుత్వఆస్తిగా మార్చాలి. వీటిలో ప్రభుత్వకృషి క్షేత్రాలకు సరిపోగామిగిలినవాటిని శ్రామికవర్గ ప్రభుత్వం నిర్ణయించే నియమాలప్రకారం ఉచితంగా చుట్టుపక్కల చిన్నరైతులకు ఉపయోగించుకొనుటకు ఇవ్వాలి.

శ్రామికవర్గ విప్లవం పూర్తి అయినపిమ్మట మొదటిదశలో, పెద్ద భూస్వాముల ఎస్టేట్లనన్నిటినీ వెన్వెంటనే స్వాధీనం చేసుకొనటమేగాక, విప్లవ ప్రతీఘాతనాయకులూ, గ్రామప్రజలందరినీ నిర్దాక్షిణ్యంగా దోచుకొనేవారూఅగు పెద్ద భూస్వాములనందరినీ ప్రవాసమునకు పంపుటో, లేక ఏదో ఒక ప్రదేశంలో నిర్బంధంలో వుంచుట అత్యవసరమగు కర్తవ్యము. పట్టణాలలోనేగాక పల్లెలలోగూడా కార్మికవర్గ అధికారం స్థిరపడినంతవరకూ, క్రమేణా, గట్టి నమ్మకస్థులైన కమ్యూనిస్టుపార్టీ వర్కర్ల ప్రత్యేక కంట్రోలుక్రింద వీరిలో గొప్ప అనుభవం, నిర్మాణ కుశలత, జ్ఞానము కలవారినందరినీ భారీ సోషలిస్టువ్యవసాయాన్ని నిర్మించుటకై ఉపయోగించుటకు ప్రయత్నములు గావించాలి.

దోపిడిగాండ్ర నిరోధ ప్రయత్నాలనన్నిటినీ పూర్తిగా నిర్మూలించినతర్వాత, తనకు పూర్తిగా స్థిరత్వం ఏర్పడినతర్వాత, ఈ నిరోధకులందరూ తనక్రింద అణగిమణగి వుండేటట్లు చేసినతర్వాత, శ్రామికవర్గ ప్రభుత్వం పరిశ్రమలన్నిటినీ భారీ సమిష్టి ఉత్పత్తి విధానంక్రిందకు తెచ్చినప్పుడే, వాటిని ఆధునిక టెక్నికల్ పద్ధతుల క్రింద (జాతీయార్థిక ఉత్పత్తి అంతా విద్యుచ్ఛక్తిసహాయంతో) నడిపినప్పుడే పెట్టుబడిదారీవిధానం పై సోషలిజం జయించినదనీ, సోషలిజం స్థిరపడినదనీ చెప్పగలం. ఇట్లా జరిగినప్పుడే పట్టణకార్మికులు దేశమంతటా చెల్లాచెదరుగా వుండి వెనుకబడివున్న గ్రామ ప్రజలకు అవుసరమైన టెక్నికల్ సహాయాన్ని సాంఘిక సహాయాన్ని గావించి, వ్యవసాయం

యొక్క, జనరల్‌గా వ్యవసాయ కూలీల యొక్క ప్రవృత్తి సామర్థ్యాన్ని పెంచి, ఆదర్శప్రాయమగు ఉదాహరణల బలంవల్లనూ, తనమేలు కొరకే అన్నభావం కల్గించుట ద్వారానూ చిన్న రైతులు భారీసమిష్టి వ్యవసాయ పద్ధతి క్రిందకు వచ్చేటట్లు ప్రోత్సాహపర్చ గల్గుతాము. ఈ నిస్సందేహమగు సిద్ధాంత సత్యాన్ని సోషలిస్టులందరూ పేరుకు అంగీకరించినా, వాస్తవానికి పూర్తి అవకాశవాద రూపంలో వికృత మొనర్చుతారు. ఇది, రెండవ ఇంటర్నేషనల్‌కు చెందిన మోసకారి జర్మన్ నాయకులలోనూ, బ్రిటిషు "ఇండిపెండెంట్లు" లోనూ, ఫ్రెంచి లాంగ్వెటిస్టులలోనూ బాగా కనిపిస్తున్నది. ఎప్పుడో భవిష్యత్తులో నిర్మింపబడబోయే స్వర్గరాజ్యం మీదనే దృష్టిపెట్టుకొని, అటువంటి భవిష్యత్తును సాధించుటకై మధ్యవున్న క్లిష్ట కాలంలో చేయవలసిన తక్షణ కర్తవ్యాలను విస్మరించటం వల్ల ఇటువంటి తప్పుడు ధోరణులకు అవకాశం కల్గుచున్నది. ఆచరణలో, ఈ తప్పుడు ధోరణి బూర్జువా వర్గంతో రాజీకి "సమాజ శాంతిక"(అనగా, యుద్ధ ఫలితంగా కొద్దిమంది కోటీశ్వరులు ఇంకా ఎక్కువగా బలిసి, మదించి వున్న కాలంలో, అదే యుద్ధంవల్ల అత్యంత దుస్థితికి లోనై, ఆ దుర్భర పరిస్థితులలోనే పోరాటాన్ని సాగిస్తూవున్న శ్రామిక వర్గమునకు ద్రోహము చేయుటకే) తహతహలాడుటలో కన్పిస్తుంది.

సోషలిజమునకై జయప్రదమైన పోరాటమును సాగించుటకు వాస్తవిక పరిస్థితులను ముఖ్యంగా గ్రామ సీమలలోనే నిర్మించాలి గనుక, మొట్టమొదటగా బూర్జువా వర్గాన్ని కూలద్రోసి శ్రామికవర్గ ప్రభుత్వాన్ని కూలద్రోసి శ్రామిక వర్గ ప్రభుత్వాన్ని స్థిరపర్చుటకై తయారుగావాలనీ వారిలో గొప్ప చైతన్యము కల్గించుటకు కమ్యూనిస్టు పార్టీలు కృషిజేయాలి. ఎందుచేతనంటే, శ్రామికవర్గ నియంతృత్వం అంటేనే కష్టజీవులు, దోచుకోనబడేవారూ అగు ప్రజా బాహుళ్యము సంతతినీ సంఘటితపర్చి, నడుపుటకు తగిన సామర్థ్యమును శ్రామిక వర్గం కల్గియుండుటయే గాక, ఈ ఆశయసిద్ధికై అగ్రదళం అఖండ త్యాగాలను గావించు

టకూ, అశేష ధైర్య సాహసాలను ప్రదర్శించుటకు కూడా తగిన శక్తి సామర్థ్యాలను కలిగివుండటం; రెండు: గ్రామ సీమలలో కూడా విజయం పొందాలంటే కార్మికుల విజయం ఫలితంగా, గ్రామసీమలలోని కష్టజీవులు, మిక్కిలి అధికంగా దోచుకోబడే ప్రజా సామాన్యం దోపిడిగాండ్ర నెత్తి గొట్టి తమ పరిస్థితులను వెంటనే కొంతవరకూ అభివృద్ధి గావించుకోవాలి. ఎందుకంటే, ఇది జరుగనంతవరకూ పారిశ్రామిక కార్మిక వర్గం గ్రామసీమలయొక్క సహాయాన్ని పొందగలదని గట్టిగా చెప్పలేము. ఇంతేగాక, ప్రత్యేకంగా పట్టణములకు ఆహార పదార్థాలను గ్యారంటీగా అందజేయటం సాధ్యపడదు.

8. పెట్టుబడిదారీ విధానంచే ఎంతోకాలం దుర్భరమగు దరిద్రంలోనూ, అనైక్యతలోనూ, తరచు మధ్యయుగాలనాటి బానిసత్వంలోనూ వుంచబడిన వ్యవసాయక కష్టజీవులగు ప్రజా బాహుళ్యాన్ని విప్లవ పోరాటానికి సంఘటితపర్చి, తర్ఫీదు యిచ్చుటకుగాను వున్న బ్రహ్మాండమగు కష్టములనుబట్టి కమ్యూనిస్టుపార్టీలు గ్రామ సీమలలో విజృంభిస్తున్న సమ్మె పోరాటాలయొక్క ప్రత్యేకశ్రద్ధనుగైకొని, వ్యవసాయ కూలీలయొక్క, అర్ధశ్రామికులయొక్క ప్రజాబాహుళ్య సమ్మెలకు ఎక్కువ సహాయం జేస్తూ, వాటిని అన్ని వైపులనుండీ వృద్ధినొందించాలి. అంతకంతకూ విజృంభిస్తున్న ప్రజా బాహుళ్య సమ్మె పోరాటాలు మాత్రమే (కొన్ని సందర్భాలలో వీటిలో చిన్న రైతులుకూడా కలవగలరు. కలిసేటట్లు చేయాలికూడా) గ్రామసీమలను వాటి నిద్రమత్తునుండి మేల్కొలుపగలవనీ, గ్రామసీమలలోని దోచుకోనబడే ప్రజాబాహుళ్యంయొక్క వర్గచైతన్యమును రేకెత్తింపగలవనీ, వారి వర్గసంఘముల యొక్క అవసరాలను గుర్తింపజేయగలవనీ, పట్టణ కార్మికులతో వారి కలయికయొక్క ప్రాముఖ్యత ఎంత వున్నదో కళ్ళకుగట్టినట్లుగా ప్రాక్టికల్ రూపంలో వారికి చూపగలవనీ, 1905, 1917 రష్యన్ విప్లవముల అనుభవం వల్ల నిరూపింపబడి, జర్మనీయొక్క ఇతర అభివృద్ధి జెందిన దేశాలయొక్క అనుభవం వల్ల ఇప్పుడు ధృఢపర్చబడినవి.

గ్రామసీమలలో జరుగుచున్న సమ్మెపోరాటాలయెడ ఉపేక్షా భావమును వెల్లడించుటయేగాక, అవి ఆహారపదార్థాల వుత్పత్తిని పడగొట్టే ప్రమాదాన్ని కలిగించుచున్నవనే నెపంతో (ట్రాట్స్కీవలె) వాటిని వ్యతిరేకించుటకు కూడా సాహసించే సోషలిస్టుల సందరినీ-వీరు మోసకారి రెండవ ఇంటర్నేషనల్‌లోనే గాక, దానినుండి చీలిపోయిన మూడుప్రధానయూరపియన్ పార్టీలలోకూడా కన్పిస్తున్నారు—ద్రోహులుగా కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ యొక్క ఈ కాంగ్రెసు ఖండిస్తున్నది. కమ్యూనిస్టు నాయకులు, కార్మికవర్గ నాయకులు ప్రపంచంలో అన్నిటికంటె ఎక్కువగా శ్రామికవర్గ విప్లవముయొక్క అభివృద్ధికీ,దాని విజయమునకూ ప్రాముఖ్యతనిచ్చి, వాటికై అఖండత్యాగాలను గావిస్తారు; కరువు, వినాశనం నూతన సామ్రాజ్యవాద యుద్ధాలనుండి బయటపడే మరొకమార్గం, ముక్తిమార్గం వేరేలేదు కాబట్టే వీరిట్టి అఖండ త్యాగాలను గావిస్తారు; అందుచే, ఆచరణవల్ల, చేతలవల్ల రుజువు చేయబడనిచో ఎటువంటి కార్యక్రమాలైనా, ఎటువంటి పత్రికాప్రకటనలైనా పూర్తిగా నిరుపయోగమే కాగలవు.

ముఖ్యంగా ఒక విషయాన్ని నొక్కి చెప్పాలి: త్వరగా విప్లవ చైతన్యమును పొందుచున్న కార్మికప్రజలలో తమ గౌరవాన్ని నిలబెట్టుకొను వుద్దేశంతో మాటలలో కమ్యూనిజాన్ని అంగీకరిస్తూ ఆచరణలో దానిపక్షంవైపే వుంటూ వస్తున్న పాత సోషలిస్టు వుద్యమ నాయకులను "కార్మిక దొరల శ్రేణి" ప్రతినిధులను బాగాపరీక్ష జేయాలి; శ్రామికవర్గ ఆశయముల యెడ వారికుండే దేశభక్తి విశ్వాసాలనూ, ముఖ్యంగా విప్లవ చైతన్యము, విప్లవ పోరాటాలు బాగా అభివృద్ధి చెందుచున్నట్లు కన్పించే రంగాలలో భూస్వాములయొక్క బూర్జువా వర్గం (ధనిక రైతులయొక్క, కులక్కుల యొక్క) ప్రతిఘటన బహుతీక్షంగా వున్న రంగాలలో, సోషలిస్టురాజీవాదులకూ, కమ్యూనిస్టు విప్లవవాదులకూ మధ్యవుండే భేదాలు బాగా ప్రస్ఫుటమైన రంగాలలో, వారు బాధ్యతగలస్థానాలనధిష్ఠించుటకు తగివున్నారా లేదా అనే విషయాన్ని బాగా పరీక్ష జేయాలి.

9. గ్రామ సీమలలో సాధ్యమైనంత త్వరలో సోవియట్లను, ముఖ్యంగా వ్యవసాయ కూలీల అర్ధశ్రామికుల ప్రతినిధులతో కూడిన సోవియట్లను నిర్మించుటకు కమ్యూనిస్టుపార్టీ శక్తివంచన లేకుండా కృషి జేయాలి. ఈ సోవియట్లు ప్రజాసమ్మె పోరాటాలలో సంబంధాలు కల్గివుండి, మిక్కిలి అణచబడి వుండిన వర్గంతో సంబంధాలు కల్గివున్నప్పుడే అవి తమ కర్తవ్యాలను నిర్వహిస్తూ స్థిరపడి చిన్న రైతులను తమ ప్రభావం క్రిందకు తెచ్చుటకూ (తర్వాత తమలో కల్పుకొనుటకూ) సమర్థతనుకల్గివుండగలవు- కాని భూఖామందుల యొక్క పెద్ద రైతులయొక్క దౌర్జన్యములు జాస్తిగా వుండుటవల్లనూ వారి శ్రామిక కార్మికులయొక్క వారి సంఘాలయొక్క మద్దతు లేకపోవుట వల్లనూ ఈసమ్మెపోరాటాలు వృద్ధి కానిచో, వ్యవసాయకూలీల సంఘటిత శక్తి సామర్థ్యములు ఇంకా బలహీనంగా వున్నచో, గ్రామ సీమలలో సోవియట్లను అర్గనైజు చేయుటకు చాలా ముందు ప్రయత్నాలను చేయవలసివుంటుంది; ఇందుకై బహుచిన్నవైనా కమ్యూనిస్టుబీజకణాలను ఏర్పాటుగావించటం, కమ్యూనిస్టు కోర్కెలను తేటతెల్లంగా, అతివివరంగా తెలియజేస్తూ దోపిడి, పీడనల గూర్చి, స్పష్టమగు ఉదాహరణలతో తీవ్ర ఆందోళనను గావించటం, పట్టణ కార్మికులు గ్రామసీమలలో పర్యటన గావించుటకై ఏర్పాట్లు గావించటం, మున్నగునవి అవుసరం. ఈ విధంగానే సోవియట్లను అర్గనైజు చేయుటకు ముందు ప్రయత్నాలను చేయాలి.

(కమ్యూనిస్టు ఇంటర్నేషనల్: 12 వ సంచికలో 20-7-1920 న ప్రకటింపబడినది.)

70

నూతన ప్రజాతంత్రం : దాని రాజకీయ ప్రవాదులు

తియాహారీ జార్జిస్కు

(రుమేనియన్ వర్కర్స్ పార్టీ కేంద్రకమిటీ కార్యదర్శి)

నోట్సు:['పీపుల్సు డెమాక్రసీ' లేక 'న్యూ డెమాక్రసీ' అనే ఇంగ్లీషు పదానికి తెలుగులో 'ప్రజాస్వామ్య ప్రజాతంత్రం' అని జనత అనువాదాల్లో వాడుతున్నాం. 'డెమాక్రసీ' అనే ఇంగ్లీషు పదానికే 'ప్రజాతంత్రం' అనీ లేక 'ప్రజాస్వామ్యం' అనీ అర్థం. ఈ రెంటిలో దేన్ని విశేషణంగా చేర్చి ఒక 'సంయుక్త పదం'గా చేసినా పీపుల్స్ డిమోక్రసీ లేక న్యూ డిమోక్రసీ అనే పదానికి భావయుక్తమైన అనువాదంగా ఉండడం లేదు. చెవికి కటువైనరీతిలో తెలుగు నుడికారంకూడా కోల్పోతూ ఉంది. అందుచే దాన్ని మార్పుచేయ నిర్ణయించాం.

ప్రజాతంత్రం లేక ప్రజాస్వామ్యం అనే ఒక అమూల్యమైన సామాజిక విధానాన్ని, భావాన్ని బూర్జువావర్గం తన పెంపుదలకు అభ్యంతరకరంగా ఉన్న ఫ్యూడల్ నిరంకుశ ప్రభుత్వ విధానానికి వ్యతిరేకంగా పోరాడుదశలో ప్రచారం చేయడం కొంతవరకు ఆచరణలో పెట్టడం జరిగింది. ఎప్పుడైతే తమవర్గ స్వార్థాలకు అవసరమైందో, అప్పుడు ప్రజలను తమ వెంటవేసుకోడానికి, ఫ్యూడల్ పరిపాలకులనుండి రాజ్యాధికారం గుంజుకోడానికి ప్రజాతంత్ర నినాదాన్ని మంచి ఆయుధంగా ఉపయోగించారు. ఆ పని తీరిన తర్వాత తమవర్గ రాజకీయాధికారం స్థిరమైనతోడనే ప్రజాతంత్రానికి సంకెళ్ళువేయ ప్రారంభించారు. బూర్జువా దోపిడికి విరుద్ధంగాని ప్రజాతంత్రమే నిజమైన ప్రజాతంత్రమని వక్రభాష్యాలు ప్రారంభించారు. తదాది బూర్జువా సమాజ పరిమితుల్లో అమలు జరిపే ప్రజాతంత్రాన్ని బూర్జువా ప్రజాతంత్రం అని రాజకీయ సారస్వంతలో వాడబడుతోంది.

బూర్జువా, దోపిడివర్గ సంకుచిత ప్రయోజనాలదృష్ట్యా, సంకెళ్లు వేయబడిన, సంకుచితపరచిన, నీరసం చేయబడిన ప్రజాతంత్ర విధానాన్ని అధిగమించి, దోపిడి రహితమైన సోషలిస్టు ప్రజాతంత్రం రష్యాలో స్థాపించబడినప్పుడు, దాన్ని నిరంకుశ నియంతృత్వం అనీ, ప్రజాతంత్ర వ్యతిరేకమనీ, బూర్జువాపండితులు పేర్లు పెట్టసాగారు. లెనిన్ మహాశయుడు అట్టి దూషణలన్నింటిని పటాపంచలుచేస్తూ సమాధానమిచ్చాడు.

బూర్జువా సమాజంలోని ప్రజాతంత్రం వాస్తవానికి మైనారిటీ అయిన బూర్జువా దోపిడి వర్గ నియంతృత్వమనీ, రష్యాలో స్థాపించబడ్డది ఒక నూతనమైన ప్రజాతంత్రమనీ, శ్రామిక ప్రజాతంత్రం అనీ (ప్రోలిటేరియన్ డెమాక్రసీ) దోపిడికి గురి అవుతూన్న అశేష ప్రజలు దోపిడిచేసే, వ్రేళ్ళపై లెక్కించబడే మైనారిటీ బూర్జువా వర్గంపై మాత్రమే నియంతృత్వం చలాయిస్తారనీ, బహుసంఖ్యాకులైన ప్రజలకు సర్వతోముఖమైన ప్రజాతంత్ర విధానం లభ్యమవుతుందనీ తెగవేసి చెప్పాడు.

నేడు తూర్పు యూరప్ దేశాల్లో నిర్మితమైన రాజ్యాంగాలనుగూర్చి నిర్వచించే టప్పుడు వాడబడుతూఉన్న పీపుల్స్ డెమాక్రసీ లేక న్యూ డిమాక్రసీ అనే నిర్వచనాలుగానీ చైనా కమ్యూనిస్టునాయకుడు మా-సే-టుంగ్ వివరించిన 'న్యూ డెమాక్రసీ' అనే రాజకీయ నినాదంగానీ పై లెనిన్ వివరించిన విధానంలో - స్వల్పభేదాలున్నా - చేరినవే. అంటే బూర్జువాప్రజాతంత్రానికి భిన్నమైన, పూర్తిగా వైరైన శ్రామికజన ప్రజాతంత్రం అని అర్థం.

పీపుల్స్ డెమాక్రసీ అనే పదానికి మక్కికి మక్కి తెలుగు అనువాదం చేయవలసివస్తే 'ప్రజా ప్రజాతంత్రం' అనిగానీ 'జన ప్రజాతంత్రం' అనిగానీ అనవలసి వస్తుంది. ఇచట తెలుగుభాషలోని పదాల పొత్తు శ్రావ్యంగాక కటువు ధోరణిలో ఉంటుంది. కాన అంతర్జాతీయ మార్క్సిస్టు సారస్వతంలో పీపుల్స్ డిమోక్రసీ, న్యూ డిమోక్రసీ అనే రెండుమాటలు పర్యాయపదాలుగా వాడబడుతూ ఉన్నప్పుడు, మనమీవరకే మా-సే-టుంగ్ వ్రాసిన'న్యూ డెమోక్రసీ' అనే కరపత్రాన్ని తెలుగులో అనువదించినప్పటినుండి నూతన ప్రజాతంత్రం అని కొంతవరకు ప్రచారంలోకి తెచ్చాం గనుక, నూతన ప్రజాతంత్రం అనే పదాన్నే మన రాజకీయ సాహిత్యంలో వాడుకోవడం మంచిదని నిర్ణయానికి వచ్చాం. పాఠకులు ఈ విషయాన్ని గమనించి పీపుల్స్ డెమోక్రసీ లేక న్యూ డెమోక్రసీ అనే ఇంగ్లీషుమాటలు వచ్చినపుడెల్లా 'నూతన ప్రజాతంత్రం' అనే ఒకే ఒక పరిభాషను ఉపయోగిస్తారనీ, వ్యాపకం చేస్తారనీ-జనత సంపాదకీయవర్గం ఆశిస్తోంది.]

— సంపాదకవర్గం - జనత.

నూతన ప్రజాతంత్ర ప్రభుత్వాల వర్గ స్వభావం (కంటెంట్) ఏమిటి ?

కేపిటలిజంనుంచి కమ్యూనిజానికి మారే దశలో నానావిధ స్వరూపాలు(డైవర్సిటీ ఆఫ్ ఫారమ్స్) ఉన్నప్పటికీ ఆ స్వరూపాలన్నిటియొక్క సారాంశమూ తప్పక ఒకటే అయి ఉంటుంది. అదే శ్రామిక నియంతృత్వం. ఈ లెనిన్ సిద్ధాంతాన్నే నూతన ప్రజాతంత్రం స్థాపించడంలో తదితర నూతన ప్రజాస్వామ్యాల్లాగానే రుమేనియా వర్కర్సుపార్టీ (కమ్యూనిస్టుపార్టీ - అను) కూడా అనుసరించింది

ఆయా దేశాల చారిత్రకాభివృద్ధికి సంబంధించినవిశేషతనుబట్టీ, ఆయాజాతుల లక్షణాలనుబట్టీ సోషలిజంవైపు సాగించే పురోగమన పద్ధతుల్లో - స్వరూపాల్లో-

కొంత వైవిధ్యం ఉంటుంది. కాని ఆవైవిధ్యాన్ని - ఆయాదేశాల ప్రత్యేక లక్షణాల ప్రాముఖ్యతను - గోరంతలు కొండంతలుగా చేయడం అంటే అది అవకాశవాద వైఖరి అవుతుంది. ఆ వైఖరి మార్క్సిజం - లెనినిజానికి స్వస్తి చెప్పడానికీ, మార్క్సిజం-లెనినిజంలో ప్రధాన విషయమైన శ్రామిక నియంతృత్వాన్ని త్రోసిపుచ్చడానికీ దారి తీస్తుంది.

శ్రామిక నియంతృత్వరూపాల్లో ప్రజల ప్రజాస్వామ్యం ఒకటి. దీనికీ, సోవియట్ విప్లవానికీ ఒక తేడాఉంది. కష్టజీవులైన రైతు ప్రజానీకంతో సన్నిహిత సంబంధం కలిగిన నూతన ప్రజాతంత్ర దేశాల కార్మికవర్గం అంతర్యుద్ధం లేకుండానే శ్రామిక నియంతృత్వాన్ని స్థాపించ గలిగింది. రెండవ ప్రపంచ మహాయుద్ధంలో సోవియట్ యూనియన్ సాధించిన చారిత్రక విజయం ఫలితంగానూ, కష్టజీవులైన ప్రజాసామాన్యంపట్ల తనఅంతర్జాతీయ విధిని నిర్వహిస్తూ సోషలిస్టు ప్రభుత్వ సాయుధ సైన్యం పరాక్రమోపేతంగా ఈ దేశాలను విముక్తి చేయడంవల్లనూ ఇది సాధ్యపడింది,

సోవియట్ యూనియన్ బ్రహ్మాండంగా బలపడిన ఫలితంగా పెట్టుబడిదారీ సోషలిస్టు బలాబలాల్లో పెద్దమార్పు వచ్చింది. అంతర్జాతీయరంగంలో సోషలిస్టు శక్తులబలం చాలా అభివృద్ధి చెందింది. రెండవ ప్రపంచ యుద్ధంలో సోవియట్ యూనియన్ సాధించిన మహత్తర విజయమూ, విముక్త దేశాలకు సోవియట్ యూనియన్ చేసిన రాజకీయార్థిక సహకారమూ నూతన ప్రజాతంత్ర పంథాపై పురోగమించడానికి ఈ దేశాలకు తోడ్పడ్డాయి, నూతన ప్రజాస్వామిక దేశాల్లో పెట్టుబడిదారీ విధానాన్ని పునస్థాపించడానికి సామ్రాజ్యవాదులు చేసిన ప్రయత్నాలన్నిటిని ప్రజలు దృఢసంకల్పంతో భగ్నంచేస్తున్నారు. అజేయమైన సోవియట్ ప్రభుత్వంతో సౌహార్ద సంబంధం, సుస్థిరమైన మిత్రభావంపై ఆధారపడిన తమ స్వేచ్ఛాస్వాతంత్ర్యాలను కాపాడుకోడానికి దృఢనిశ్చయులై ఉన్నారు. 1918—20లో శైశవావస్థలోనున్న సోవియట్ ప్రభుత్వంపై దాడిచేసినట్లుగా నేడు సామ్రాజ్యవాదులు నూతన ప్రజాస్వామికాలపై నగ్నంగా సైనిక దాడి చేయలేకపోతున్నారు. నూతన ప్రజాస్వామిక దేశాలకు సోవియట్ యూనియన్ అండగా ఉండడమే ఇందుకు కారణం.

శ్రామికనియంతృత్వంలో నేడు రెండు రూపాలు - రెండువిధాలు - ఉన్నాయి. ఒకటి సోవియట్‌రూపం. రెండవది నూతన ప్రజాతంత్ర రూపం. సోవియట్‌రూపం శ్రామిక నియంతృత్వం యొక్క ఉన్నత స్వరూపం.

సోవియట్‌విధానంనాటి పరిస్థితులకు భిన్నమైన పరిస్థితుల్లో నూతన ప్రజాస్వామికవిధానంయొక్క రాజకీయపునాదులు వేయబడ్డాయి. మహత్తరమైన సోషలిస్టు నవంబరు విప్లవం పాత రాజ్యాంగ యంత్రాన్ని తుడిచిపెట్టివేసి ప్రభుత్వాధికారాన్ని సోవియట్లకు స్వాధీనపరిచింది. ఆ విధంగా ఉన్నతశ్రేణికిచెందిన సోషలిస్టు ప్రభుత్వంగా సోవియట్ ప్రభుత్వ నిర్మాణం జరిగింది.

తదితర నూతన ప్రజాతంత్ర దేశాల్లో లాగే రుమేనియాలో కూడా పాత రాజ్యాంగయంత్రాన్ని వెంటనే విధ్వంసం చేసివేయడంజరగలేదు. ఇదే ఈదేశాలవిప్లవాభివృద్ధికిసంబంధించిన చారిత్రకలక్షణం

నూతన ప్రజాస్వామిక దేశాల పుటక లోనూ, వాటి అభివృద్ధిలోనూ ఉన్న ప్రత్యేక పరిస్థితులనుబట్టి అవి ఒక నూతన ప్రభుత్వాధికారానికి ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. ఈ నూతన ప్రభుత్వాధికార చట్రంలో కొంతకాలంవరకు పాత బూర్జువా ప్రభుత్వయంత్ర శక్తులు అస్తిత్వంలోనే ఉంటాయి.

ఉదాహరణకు రుమేనియాను తీసుకుందాం. రుమేనియా విముక్తి చేయబడిన పిమ్మట ప్రభుత్వయంత్రంలో స్థానాల కోసం శ్రామికవర్గం తీవ్రపోరాటాన్ని సాగించింది. ప్రభుత్వయంత్రంలో తమ స్థానాలను కోల్పోవడం అంటే అది తమ ఓటమి అనీ, వినాశనం అనీ పెట్టుబడిదారులకూ భూస్వాములకూ తెలుసు.

దీర్ఘకాలపోరాటం తర్వాతనే ప్రభుత్వయంత్రాన్ని పూర్తిగా పునర్నిర్మించడం సాధ్యమయింది. ప్రభుత్వయంత్రంలో కార్మికులు తమస్థానాన్ని గట్టిపరుచుకున్న వెంటనే ఫాసిస్టులనూ, అభివృద్ధి నిరోధకులనూ ప్రభుత్వం యంత్రంనుంచి బైటికి తరిమివేశారు. కార్మికులను విరివిగా ప్రభుత్వం యంత్రంలోకి తీసుకోవడం ద్వారా తదేకదీక్షతో ప్రభుత్వయంత్రం యొక్క వర్గ స్వభావంలో మార్పు తెచ్చారు. రాచరికాన్ని రద్దుచేసిన పిమ్మట, కష్టజీవులైన రైతాంగంయొక్క సన్నిహిత సంబంధంతో కార్మికవర్గం రాజకీయాధికారాన్ని పూర్తిగా తనహస్తగతం చేసుకున్న తర్వాత, ప్రభుత్వయంత్రంయొక్క వర్గస్వభావంలో విశేషంగా మార్పు తీసుకు రాబడింది. పాత సైన్యమూ, పాత కోర్టులూ, ప్రభుత్వ దమనవిధానంలో సాధనాలుగా ఉపయోగపడే పోలీసులూ సైనికులూ వగైరా పాతశాఖలన్నిటినీ తొలగించి వాటి స్థానంలో నూతన ప్రజాశాఖలను నెలకొల్పారు.

ప్రజా కౌన్సిళ్ళను — ప్రజాస్వామిక పద్ధతులపై నిర్మించబడిన ప్రభుత్వ స్థానిక కమిటీలను — స్థాపించడం ద్వారానే అసలు నూతన ప్రభుత్వయంత్రం — సోషలిజాన్ని నిర్మించే కర్తవ్యాన్ని నిర్వహించగలిగినటువంటి నూతన ప్రభుత్వ కర్తవ్యాలతో ఆశయాలతో ప్రతి విషయంలో [illegible] గా తోడ్పడేటటువంటి నూతన ప్రభుత్వయంత్రం — నిర్మించబడుతుంది.

కార్మిక ప్రజాప్రతినిధుల సోవియట్లే (ది సోవియట్సు ఆఫ్ వర్కింగ్ పీపుల్స్ డిప్యూటీస్) సోవియట్ యూనియన్ యొక్క రాజకీయపు పునాదులు. ప్రభుత్వ నూతన కమిటీలు (ఆర్గన్సు) అయిన ఈ ప్రజల కౌన్సిళ్ళే ప్రజ ప్రజాస్వామిక దేశాలయొక్క రాజకీయపు పునాదులుగా పరిణమిస్తున్నాయి. ప్రజా కౌన్సిళ్ళను నెలకొల్పడం అంటే ప్రజల ప్రజాస్వామిక ప్రభుత్వాలు [illegible] నియంతృత్వం యొక్క ఉన్నతరూపాన్ని — సోవియట్ రూపాన్ని (ఫారం) తీసుకుంటున్నాయి అనే ప్రాముఖ్యతను [illegible] జేస్తుంది. ఇలాంటి స్థానిక ప్రభుత్వాధికార కమిటీలు ఇదివరకే బల్గేరియాలో ఉన్నాయి. ఇతర నూతన ప్రజాస్వామిక దేశాల్లోకూడా ఇప్పుడే ఏర్పడుతున్నాయి.

రుమేనియాలో ప్రజా కౌన్సిళ్లు

రుమేనియా ప్రజల చరిత్రలో ఇంతవరకెన్నడూ కనీవిని ఎరుగని అత్యున్నత ప్రజాస్వామిక స్వరూపం కలిగిన పరిపాలనను ఈ ప్రజాకౌన్సిళ్ళు ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. దోపిడిజేసే కొద్దిమందికి వ్యతిరేకంగా అత్యధిక సంఖ్యాకులైన ప్రజాసామాన్యానికి ఈ కౌన్సిళ్ళే రాజకీయ పునాదులుగా ఉన్నాయి.

అసంఖ్యాకులైన శ్రామిక ప్రజల ఆదరాభిమానాలను చూరగొనడానికీ, వారిని పోషిస్తూ సమాజనిర్మాణంకోసం సాగించే పోరాటంలో సమీకరించడానికీ ప్రజాకౌన్సిళ్లు వారితో ఘనిష్ఠసంబంధం కలిగి ఉండాలి. అలాంటి కౌన్సిళ్ళు ఎన్నుకోబడే దాకా వాటి కార్యకలాపాలను తాత్కాలికంగా ఏర్పడిన ప్రావిజనల్ కమిటీలు (జిల్లా, పట్టణ, గ్రామ కమిటీలు) కొనసాగిస్తున్నాయి. ఈ తాత్కాలిక కమిటీలకు ప్రభుత్వాధికార హక్కులుకూడా ఉంటాయి. ఆయాస్థానాలకు సంబధించిన ఆర్థిక, సాంఘిక సాంస్కృతిక కార్యకలాపాల బాధ్యత ఆ తాత్కాలిక కమిటీలపైనే ఉంటుంది.

ఆయాప్రదేశాల ప్రభుత్వాధికారంలో పరిపాలనలో - ప్రధాన భాగాలైన ప్రజాకౌన్సిళ్ళు ప్రజాస్వామిక కేంద్రీకరణ సిద్ధాంతానికి కట్టుబడి తమ కార్యకలాపాలను కొనసాగిస్తూ ఉంటాయి. ప్రభుత్వ కేంద్రశాఖల ఉత్తరువులనూ, ప్రణాళికలనూ ఒకవైపు ఖచ్చితంగా అమలు జరుపుతూనే మరోవైపు క్రిందినుంచి కూడా చొరవ చేయవలసిన ఆవశ్యకతను ప్రోత్సహిస్తూఉంటాయి. ఆయాస్థానికావసరాలనూ విశేషత[illegible] దృష్టిలో ఉంచుకొని ఆర్థికాభివృద్ధిని కొనసాగిస్తాయి. ప్రజల నిర్మాణాత్మక కృషిని ప్రోత్సహిస్తూ ఉంటాయి. రుమేనియాలోని పాత ప్రభుత్వవర్గాల యొక్క స్వభావం పాత ప్రభుత్వవర్గాలనుంచి ప్రజల కౌన్సిళ్ళకు జరిగే పరివర్తన యొక్క మహత్తర విప్లవ ప్రాముఖ్యతను చిత్రిస్తుంది.

అన్ని బూర్జువా ప్రభుత్వాల్లోలాగే ఇదివరకు రుమేనియాలోకూడా ప్రభుత్వాధికారం శాసనసభా కార్యనిర్వాహక శాఖలమధ్య విభజించబడి ఉండేది. వాస్తవిక ప్రభుత్వాధికారం కార్యనిర్వాహకశాఖల చేతుల్లో ఉండేది. పార్లమెంటూ, శాసనసభల ప్రభావం (ఇన్‌ఫ్లూయెన్స) చాలాతక్కువ, ప్రభుత్వం చేతనూ లేక మంత్రులచేతనూ నియోగించబడిన అధికారులచేతుల్లో స్థానిక పరిపాలనాధికారం కేంద్రీకరించ బడేది. ప్రెఫెక్టులూ (చైర్మన్ లాంటివారు) మేయర్లూ ప్రజలను పరిపాలించే అధికారులుగా ఉండేవారు. తాముచేసే క్రియాకలాపాలకు వారు ప్రజకు బాధ్యులుగా ఉండేవారుకాదు. కేంద్రాధికారుల అదుపులో మాత్రమే ఉండేవారు. మొత్తం ప్రభుత్వయంత్రం అంతటా నిరంకుశత్వము సవారీచేస్తూ ఉండేది. పాఠశాలలూ, నీటిసప్లయి, వగైరా సామాన్య సమస్యలను పరిష్కరించుకోవాలన్నా రైతులు బుఖారెస్టుదాకా ప్రయాణం కట్టవలసి వచ్చేది. గ్రామాలనుంచి వచ్చే ఉత్తరాలు మంత్రులవద్ద బుట్టదాఖలు అయ్యేయి. ఒకవేళ తప్పిదారి ఏదైనా ఒక సమాధానము వచ్చినా దొంగలుబడ్డ ఆరునెలలకు కుక్కలు మొరిగినట్లు ఉండేది.

వ్యవసాయిక, ఆర్థిక ఆరోగ్య శాఖలూ, తదితర జిల్లాశాఖలూ తమకు సంబంధించినంతవరకు ప్రెఫెక్ట్‌లమీదా, మేయర్లమీదా ఆధారపడి ఉండేవి కావు. ప్రజలపై ప్రతివాడూ పెత్తనం చలాయించే వాడే. ఆజ్ఞలు జారీచేసేవాడే. కాని వారిలో ఏ ఒకడూ ప్రజలకు బాధ్యుడు కాడు. ప్రజల మొరను ఆలకించేవా డొక్కడూ లేడు.

యూరప్‌లోని పెట్టుబడిదేశాలన్నిటిలో ఉన్న బూర్జువా ప్రజాస్వామిక విధానంలోనూ, బూర్జువా పార్లమెంటరీ విధానంలోనూ, ఈ లక్షణాలన్నీ మూర్తీభవించే ఉంటాయి.

ప్రజావ్యతిరేకమూ, ప్రజాస్వామిక వ్యతిరేకమూ అయిన ఈవిధానానికి పూర్తిగా విరుద్ధంగా ప్రజాకౌన్సిళ్లు - నూతన ప్రజాస్వామ్యానికి రాజకీయ పునాదులు - సర్వస్వతంత్ర ప్రతిపత్తిగలిగిన స్థానికాధికార కమిటీలుగా వ్యవహరిస్తాయి. (ప్రాంతం, జిల్లా, పట్టణం, గ్రామం) ఆకమిటీలను ప్రజలే ఎన్నుకుంటారు. ప్రజలకే అవి బాధ్యతవహిస్తాయి. అవసరమైతే ప్రజలే వాటిని రద్దుచేసివేస్తారుకూడా.

ప్రభుత్వాధికారాన్ని సంఘటితపరచడంలో నూతనప్రజాస్వామ్యాల్లోని ప్రజాకౌన్సిళ్ళు ఒక నూతనరూపాలు. ఇవి కార్మికవర్గ నాయకత్వాన నడపబడుతూ ఉంటాయి.

ప్రజాకౌన్సిళ్లు శ్రామిక నియంతృత్వం యొక్క సాధనాలు (ఆర్గన్సు). జాతి, తెగ, చదువు వగైరా విచక్షణలేకుండా అవి సమస్త కార్మికవర్గ నిర్మాణానికి సాకారమైన స్వరూపాలు.

సోషలిజం యొక్క ప్రాతిపదికపై (స్పిరిట్‌లో) జాతుల సమస్యను చక్కగా పరిష్కరిస్తున్నాయి. ప్రభుత్వాధికార సాధనాలుగా ప్రజాకౌన్సిళ్ళున్న మరొక చక్కని అవకాశమేమిటంటే ట్రేడ్ యూనియన్లు, సహకారసంఘాలూ, యువజన సంఘాలూ మొదలైన సంఘాలతో తమ కార్యకలాపాలను జోడించి పనిచేయగలుగుతాయి.

ఈదేశాల్లో ప్రజాధికారానికి ఇవి అత్యున్నత ప్రజాస్వామిక సాధనాలుగా ఉండడంతో పాటు శ్రామిక ప్రజలందరితోనూ సన్నిహితసంబంధాలు సాధించడానికీ, శ్రామికవర్గ నాయకపాత్రను నిలబెట్టడానికీ, బలపరచడానికీ ఈ ప్రజాకౌన్సిళ్లే సాధనాలు.

కబుర్లతోనే కాలయాపన చేసే బూర్జువా పార్లమెంటరీ రకానికి చెందిన సాధనాల్లాంటివి కావు ప్రజాకౌన్సిళ్ళు. ప్రజల నిజమైన ప్రభుత్వాధికారం అంటే ప్రజాకౌన్సిళ్లే. కార్మికప్రజలకు అమితంగా ఆసక్తిని కలిగించే రాజకీయ ఆర్థిక, సాంస్కృతిక, తదితర సమస్యలను అవి ప్రతిదినమూ పరిష్కరిస్తూ ఉంటాయి.

ఈప్రజాకౌన్సిళ్ళ స్థాపన జరిగినప్పటినుంచీ వాటిని అభివృద్ధిచేయడంలోనూ, గట్టిపరచడంలోనూ రుమేనియన్ వర్కర్స్ పార్టీ ఎంతో ఆసక్తి చూపుతూ ఉంది. ఆ కౌన్సిళ్ళు నూతన ప్రజాస్వామ్యానికి నిజమైన ప్రధానమైన, ప్రాముఖ్యమైన రాజకీయ పునాదిగా తయారు అవుతున్నాయి. అవే శ్రామికవర్గ నియంతృత్వాన్ని కొనసాగిస్తూ ఉన్నాయి. కాబట్టే రుమేనియన్ వర్కర్స్‌పార్టీ ప్రజాకౌన్సిళ్లకు ఎంతో ప్రాముఖ్యత ఇస్తూ ఉంది.

ఈ ప్రజాకౌన్సిళ్ళు విశాల ప్రజా సామాన్యాన్నే తమ కృషికి ఆధార భూతంగా చేసుకుంటాయి. వీటిద్వారానే ప్రజలు స్థానిక పరిపాలనలో పాల్గొనడం ప్రభుత్వానికారాన్ని అములు జరపడం జరుగుతుంది, పాత పరిపాలనా విధానంలో ఇలాంటిదేమీ ఉండేదికాదు. తాత్కాలిక కమిటీలకు అండగా ప్రజలను సంఘటిత పరచడానికి కమిషన్లు, సివిల్ కమిటీలు ఒక ప్రధానసాధనంగా ఉపకరిస్తున్నాయి. ప్రజాకౌన్సిళ్ళు నిర్వహించే కార్యకలాపాలను ఈ కమిషన్లు ఈ కమిటీలే తాత్కాలికంగా కొనసాగిస్తూఉంటాయి. కార్మికులూ కష్టజీవులైన రైతులూ, గృహిణులూ, యువకులూ, అభ్యుదయ మేధావులూ ఈ తాత్కాలిక కమిటీల కృషిలో పాల్గొంటూఉన్నారు.

ప్రభుత్వ పరిపాలనలో భాగస్వాములుగా చేయడంద్వారా క్రియాశీలురైన అసంఖ్యాక ప్రజలు ప్రజాకౌన్సిళ్ళలోకి ఆకర్షింపబడుతూఉన్నారు. వీరిద్వారా ప్రజానీకంతో ప్రజాకౌన్సిళ్ళ సబంధాలు ఇంకా దృఢతరమవుతున్నాయి.

ప్రజల ప్రజాస్వామిక ప్రభుత్వం: దాని ప్రధానకర్తవ్యాలు

ఈ ప్రజాధికార సాధనాలద్వారా, నూతన రాజ్యాంగయంత్రం ద్వారా, నూతన ప్రజాతంత్ర ప్రభుత్వం తన నెదుర్కొంటూ ఉన్న శ్రామికనియంతృత్వ కార్యకలాపాలను జయప్రదంగా నిర్వహించగలుగుతుంది.

ఆ కార్యకలాపాలేమిటి ?

సోవియట్ ప్రభుత్వంయొక్క ప్రధాన కర్తవ్యాలను గురించి మాట్లాడుతూ కామ్రేడ్ స్టాలిన్ ఇలా సూచించాడు: మొదటిదశలో (నవంబరు విప్లవంనుంచి దోపిడీవర్గాలను రద్దుచేసేవరకుగల మధ్యకాలంలో) దేశంలో కూలద్రోయబడిన వర్గాలను అణచివేయడం; విదేశీ దురాక్రమణనుండి దేశాన్ని రక్షించడం; నూతన సోషలిస్టు ఆర్థికవిధానంలో ప్రారంభించబడిన కృషిని ఇంకా పైమెట్టుకు తీసుకొనిపోడానికి, సోషలిజంయొక్క భావాలలో (స్పిరిట్ లో) ప్రజలకు తిరిగి శిక్షణ ఇవ్వడానికీ ఆర్థిక, నిర్మాణ, సాంస్కృతిక, విద్యారంగాల్లో కృషిచేయడం - ఇవే సోవియట్ ప్రభుత్వంయొక్క ప్రధాన కర్తవ్యాలు.

ఈ చివర ఉదహరించబడిన కృషి మొదటిదశలో తగినంతగా అభివృద్ధి చేయడం జరగలేదు.

కమ్యూనిజాన్ని నిర్మించడమే ఈనాడు సోవియట్ ప్రభుత్వంయొక్క ప్రధాన కర్తవ్యం. అణచివేసే సాధనాలనూ రక్షణసాధనాలనూ వాటి కార్యకలాపాలనూ ఇక ఆంతరంగిక శత్రువులకు వ్యతిరేకంగా ఉపయోగించవలసిన అవసరంలేదు.

ప్రజల ప్రజాస్వామిక ప్రభుత్వం అభివృద్ధియొక్క మొదటిదశలో - పెట్టుబడిదారీ విధానంనుంచి సోషలిస్టు విధానానికి మారేదశలో - ఉంది. ఈదశలో పల్లెల్లోనూ పట్టణాల్లోనూ వర్గసంఘర్షణ తీవ్రతరం అవుతుంది. ఈదశకు సంబంధించిన కర్తవ్యాలను నూతన ప్రజాతంత్ర ప్రభుత్వం జయప్రదంగా నిర్వహిస్తూ ఉంది.

కేపిటలిజం నుంచి సోషలిజానికి మారే ప్రభుత్వంగా నూతన ప్రజాస్వామికాభి

వృద్ధి తీవ్రతరమైన వర్గపోరాట పరిస్థితుల్లోనుంచి పురోగమిస్తూ ఉంది. కార్మిక వర్గం అధికారాన్నీ, ప్రధాన ఉత్పత్తి సాధనాలనూ హస్తగతం చేసుకున్న తర్వాతకూడా, బ్యాంకులు జాతీయం చేయబడిన తర్వాతకూడా, దోపిడివర్గాలు వ్యవసాయంలో, వ్యాపారంలో, చిన్న స్కేల్లో సాగించే పట్టణ ఉత్పత్తిలో ఇంకా తగినంతపలుకుబడి కలిగే ఉన్నాయి.

దోపిడికి వ్యతిరేకంగా సాగించే పోరాటంలో నూతన ప్రజాతంత్ర ప్రభుత్వం కార్మికులచేతుల్లో ఒకసాధనం. సోషలిజం వైపు సాగించే పురోగమనాన్ని అరికట్టడానికీ, పెట్టుబడిదారీ విధానాన్ని పునస్థాపించేందుకు ఆంగ్లో అమెరికన్ సామ్రాజ్యవాదుల ఏజెంట్లు పన్నే కుట్రలను భగ్నంచేయడానికి దోపిడీ ముఠాచేసే ప్రయత్నాలను ఈ ప్రభుత్వం తీవ్రంగా అణచివేస్తుంది. పెట్టుబడిదారుల భూస్వాముల అధికారాన్ని పునరుద్ధరించడానికి జరిగే ప్రయత్నాలకు వ్యతిరేకంగా నూతన ప్రజాతంత్ర ప్రభుత్వం సాగించే పోరాటంలో ప్రజానీకం పూర్తిగా సహకరిస్తూ ఉంది. ప్రజలు సావధానంగా ఉంటే సామ్రాజ్యవాదులకు ఏజెంట్లుగా పనిచేసే ద్రోహులూ, గూఢచారులూ, విచ్ఛిన్నకులూ వగైరాల ఆటలు ఏ మాత్రం సాగవని రుమేనియాలో అస్నిట్, పాప్, బుకోయ్లపైనా, హంగేరీలో మిండ్స్జెంటీపైనా ఇదే విధంగా జెకోస్లోవేకియాలో, పోలండులో ద్రోహులపైనా జరిగిన విచారణలే తెలియజేస్తున్నాయి.

దోపిడివర్గాలను నిర్మూలించడానికీ, సోషలిజాన్ని నిర్మించడానికీ, నూతనప్రజాతంత్రదేశాల్లోని శ్రామికవర్గం ప్రభుత్వాధికారాన్ని ఉపయోగిస్తూ ఉంది. దోపిడిదారుల ఆర్థికపునాదిని క్రమంగా తొలిచి వేస్తూ పరిమితం చేస్తూ మొత్తం అవర్గాన్నే తుడిచిపెడుతూ ఉంది. బ్యాంకర్లనూ, పారిశ్రామిక యజమానులనూ పెట్టుబడిదార్లనూ పెరికివేస్తూఉంది. భూస్వాములు కొల్లగొట్టిన భూములన్నిటిని తిరిగి గుంజుకొని అవర్గాన్నే తుడిచిపెట్టివేయడం, పల్లెల్లో ధనికరైతులను అదుపులో ఉంచి క్రమంగా వాళ్ళను తొలగించి వేయడం జరుగుతూ ఉంది.

ఈ విధంగా నూతన ప్రజాతంత్ర విధానం శ్రామిక నియంతృత్వం యొక్క క్రియా కలాపాలను కొనసాగించడానికి ప్రభుత్వాధికారాన్ని ఉపయోగిస్తూఉంది.

సోషలిజాన్ని స్థాపించడంలో పరిపాలనకూ, నిర్మాణానికీ, విద్యాసంస్కృతులకు సంబంధించిన కృషి నూతన ప్రజాతంత్రం నిర్వహించవలసిన కార్యకలాపాల్లో ఒక అత్యంత ముఖ్యమైనట్టిది. కష్టతరమైనట్టిదికూడా. సోవియట్ యూనియన్ చేసిన సహాయం ఫలితంగా నూతన ప్రజాతంత్రాలు మొదటి దశలోనే ఈవిషయంలో చాలావరకు కృషిచేయగలిగాయి. ఎందుకంటే ఈ దేశాలు అంతర్యుద్ధంలో దిగవలసి రావడంగానీ, లేక సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా పోరాడవలసి రావడంగానీ జరగలేదు. సోషలిస్టు ఆర్థిక విధానాన్ని నిర్మించడానికి అవసరమైన, బ్రహ్మాండమైన నిర్మాణకృషిమాటఅటుంచి సోషలిస్టు భావాల్లో ప్రజలను తిరిగితర్ఫీదు చేయడంకూడా ఒక ప్రధానమైనపనే. సమాజంలో తదితరవర్గాలన్నిటికంటె పురోగామివర్గమైన శ్రామికవర్గం అధికారాన్ని హస్తగతం చేసుకోడం అంటే శ్రామిక వర్గం బూర్జువా పలుకుబడినుంచి పూర్తిగా

విముక్తి చెందింది అనీ అర్థంగాదు. నూతన ప్రజాతంత్ర దేశాలజనాభాలో అత్యధిక సంఖ్యాకులుగాఉన్న కష్టజీవులైన రైతాంగాన్నీ, పట్టణాల్లోనివసించే చిన్న బూర్జువావర్గాన్నీ తిరిగి తర్ఫీదు చేయడం, ప్రభుత్వ నిర్వహణలో వారినికూడా పాల్గొనేటట్లు చేయడం ఇంకా చాలా కష్టమైనపని.

ప్రజాకౌన్సిళ్ళు పట్టణాల్లోనీ, పల్లెల్లోనీ, ఫ్యాక్టరీల్లోనీ ప్రజలకందరకూ ప్రాతినిధ్యం వహిస్తున్నాయికాబట్టి ఈ కార్యాన్ని ఎంతో జయప్రదంగా నిర్వహించగలవు.

ప్రజల్లో సోవియట్ యూనియన్ పట్ల భక్తి ప్రపత్తినీ, ప్రేమభావాన్ని కలిగించడంవిద్యావిషయక కార్యక్రమంలో ఒకటి.

రుమేనియన్ వర్కర్స్‌పార్టీ కేంద్ర కమిటీయొక్క పోలిట్ బ్యూరో జాతుల సమస్యపై ఆమోదించిన తీర్మానంలో ఇలాఉంది. "సోషలిజానికి జన్మభూమి అయిన సోవియట్ యూనియన్‌పట్ల శ్రద్ధాసక్తులను ప్రకటించడం, సోవియట్ వ్యతిరేకతను ప్రకటించే పోకడలన్నిటినీ దృఢనిశ్చయంతో ఎదిరించి పోరాడడం - ఇదే శ్రామికవర్గ అంతర్జాతీయతకు గీటురాయి. నూతన ప్రజాస్వామికదేశాల యోగక్షేమాలకూ అభివృద్ధికీ ఇదే ప్రధానమైన గ్యారంటీ. ఇదే ఆదేశాలస్వేచ్ఛనూ జాతీయ స్వాతంత్ర్యాన్నీ బలవత్తరం చేస్తుంది.

కార్మికవర్గమే నూతన ప్రజాస్వామిక దేశాలను నడిపేశక్తిగా ఉంటుంది. కౌన్సిళ్ళల్లోకూడా ఇది స్పష్టంగా ప్రతిబింబిస్తూ ఉంటుంది. ఈ దేశాలు సోషలిజానికి మారేదశలో నూతన ప్రజాస్వామిక దేశాల ప్రభుత్వ, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక జీవితంలో శ్రామికవర్గం నాయకపాత్ర నిర్వహించడం అవసరమని మన అనుభవమే చెప్తోంది. సోషలిజానికి పురోగమించడానికి ఇంతకుమినహా మరోమార్గంలేదు.

యుగోస్లావియాను సామ్రాజ్యవాద శిబిరంలో చేర్చడానికి టిటో నాయకత్వాన ఉన్న ద్రోహులముఠా యుగోస్లావియా శ్రామికవర్గ నాయకపాత్రను తగ్గించివేసి, శత్రువులను ఎదుర్కోవలసిన సమయంలో సైద్ధాంతికంగా, రాజకీయముగా శ్రామికవర్గాన్ని నిరాయుధంగా చేసింది.

సామ్రాజ్యవాదులలో తాము చేరిపోవడాన్ని టిటోముఠా తన ప్రజలనుంచి కప్పిపుచ్చాలని తీవ్రంగా ప్రయత్నిస్తూ ఉంది. అందువల్లనే శ్రామికవర్గానికి పరిచితమైన శబ్దజాలాన్ని, నినాదాలను పైకి ఆముఠా ఇంకా ఉచ్చరిస్తూనే ఉంది. ఆ నినాదాలను తన ద్రోహపూరిత జాతీయవాద సిద్ధాంతాలకు సరిపడేటట్లుగా తయారు చేస్తూ ఉంది. ఆంగ్లో - అమెరికన్ సామ్రాజ్యవాదుల ఏజంటు అయిన ఈ ముఠా పెట్టుబడిదారీ విధానాన్ని పునరుద్ధరించడానికి అవసరమైన పద్ధతులన్నిటిని అవలంబిస్తూ ఉంది. ప్రజలదృష్టిలో సోషలిజాన్ని కేపిటలిజంతో రాజీపడేటట్లుజేసి యుగోస్లావియాను సామ్రాజ్య శిబిరంలోకి చేర్చగలం అని ఆ ముఠా భావిస్తూ ఉంది.

తన ట్రాట్స్కీయిస్టు కుట్రల్లో ఒక కుట్రగా టిటోముఠా శ్రామికవర్గ నియంతృత్వం అనే సిద్ధాంతాన్నికూడా రాజీపరచడానికి ప్రయత్నిస్తూ ఉంది. యుగోస్లావియాలో అసలు శ్రామికనియంతృత్వం

లేనేలేదు. టిటోముఠా శ్రామికనియంతృత్వాన్ని కొనసాగించటపోగా శ్రామికవర్గానికి, ఆ వర్గంయొక్క ముఖ్యప్రయోజనాలకూ వ్యతిరేకంగా జాతీయ టెర్రరిస్టు నియంతృత్వాన్ని సాగిస్తూ ఉంది. యుగోస్లావియా నేడు నూతన ప్రజాస్వామికంగా ఉండకుండా పోయిందంటే ఇందుకు బాధ్యత టిటో ముఠాదే.

కార్మికవర్గానికి రైతాంగమే ప్రధాన మిత్రుడు. సోషలిజానికి పునాదులువేస్తూ ఉన్న నూతన ప్రజాతంత్రాల్లో కష్టజీవున రైతాంగంతో ఘనిష్ఠమైత్రి నేర్పకునే పాలసీకి ఒక ప్రత్యేక ప్రాము[illegible]ఉంది. కష్టజీవులైన రైతాంగంతో [illegible] నేర్పరచుకోడం, కార్మికవర్గం [illegible]కపాత్రను నిర్వహించడం - ఇదే [illegible] ప్రజాతంత్రదేశాల ప్రధాన [illegible]తం. ఈసిద్ధాంతాన్ని ప్రజాకౌన్సిళ్ల [illegible]రా చక్కగా అమలుజరపగలం. [illegible]దుకంటే రాజకీయంగా సంఘటిత పర[illegible]డంవల్ల కార్మికవర్గమూ ఆవర్గానికి అగ్రదళం అయిన మార్క్సిస్టు - లెనినిస్టుపార్టీ నాయకత్వానకష్టజీవులైన ప్రజాసామాన్యమంతా పరిపాలనవ్యవహారాల్లో ప్రతినిత్యం సమిష్టిగా పాల్గొనే అవకాశం లభిస్తుంది.

ప్రజాకౌన్సిళ్ళు కార్మికవర్గ నాయకత్వాన శ్రామికవర్గంయొక్క, కష్టజీవులైన రైతాంగంయొక్క పోరాటైక్యతను ప్రకటిస్తున్నాయి. ప్రతిబింబిస్తున్నాయి.

అయినా ప్రజాకౌన్సిళ్ళ నిర్మాణాన్ని బట్టి, స్వభావాన్నిబట్టి మాత్రమే అవిచేసే కృషితప్పకుండా సోషలిస్టు స్వభావం కలిగి వుంటుందని గ్యారంటీ ఇవ్వలేం. విప్లవాత్మకమైనశ్రామికవర్గపార్టీచే నడపబడి మార్క్స్, ఎంగెల్స్, లెనిన్, స్టాలిన్ల మహోన్నతభావాలచే ప్రోత్సహింపబడినప్పుడు మాత్రమే అలాంటి గ్యారంటీ ఇవ్వగలం. సోవియట్ యూనియన్లో కార్మిక ప్రజాప్రతినిధుల సోవియట్లను బోల్షివిక్ పార్టీ నాయకత్వం మాత్రమే సోషలిస్టు భావోద్దీపితం చేయగలిగింది. సోవియట్లపై బోల్షివిక్ నాయకత్వం సోషలిజాన్ని నిర్మించడంలో ఎంత ప్రాముఖ్యత వహించిందో, నేడు కమ్యూనిజాన్ని నిర్మించడంలో ఎంత ప్రముఖపాత్ర నిర్వహిస్తూఉందో సోషలిస్టు ప్రభుత్వచరిత్ర అంతటా మనం స్పష్టంగా చూడగలం. నూతన ప్రజాస్వామికాల్లోని వర్కర్స్ పార్టీలకూ, కమ్యూనిస్టుపార్టీలకూ, సోషలిజాన్ని నిర్మించడంకోసం అవి సాగించే పోరాటంలోసోవియట్ నిర్మాణంయొక్క బ్రహ్మాండమైన అనుభవం ఎంతో తోడ్పడుతుంది.

ప్రజాకౌన్సిళ్లయొక్క తాత్కాలిక కమిటీలను అభివృద్ధిచేయడానికీ, బలపరచడానికీ మనపార్టీ నిరంతర కృషి చేస్తూ ఉంది. ప్రజాకౌన్సిళ్లు స్వతంత్రంగా అభివృద్ధిచెందడానికి తోడ్పడేదానికి బదులు వాటిస్థానాన్ని పార్టీకమిటీలే తీసుకొని వాటి చొరవను అరికట్టివేయడం చాలా పెద్ద పొరపాటు అని రుమేనియన్ వర్కర్స్పార్టీ కేంద్రకమిటీ తన క్రింది కమిటీలన్నిటికి సూచించింది.

పార్టీయొక్క నాయకపాత్రను శ్రమజీవులు గుర్తిస్తూ ఉన్నారు. పార్టీప్రజల ఆదరాభిమానాలను చూరగొంటూ ఉంది. నూతన ప్రజాస్వామ్యానికి పూర్వం ఇంవరకెప్పుడు కూడా పీడిత ప్రజలు మరే పార్టీని ఇంత హృదయపూర్వకంగాప్రేమించడంజరగలేదు. ఈవిషయాలే నూతనరాజకీయ సాధనాలపై పార్టీనాయకత్వం అంటే ఏమిటో స్పష్టం చేస్తున్నాయి.

సోషలిజం కోసం సాగించే పోరాటంలో ప్రజలను జయప్రదంగా నడపడానికీ, శ్రమజీవుల్లో నైతిక, రాజకీయ ఐక్యతను సాధించడానికీ నూతన ప్రజాస్వామ్యానికి రాజకీయపునాదులైన ప్రజా కౌన్సిళ్ళను తప్పకుండా మార్క్సిస్టు-లెనినిస్టుపార్టీ నిరంతరం అభివృద్ధిచేయాలి-బలపరచాలి.

"ఫర్ ఏ లాస్టింగ్ పీస్
ఫర్ ఏ పీపుల్స్ డిమోక్రసీ"
1—6—49.

స వ ర ణ

జనత 14 వ సంచికలో (1-5-49) 36 వ పేజీ (మిఛూరిన్ సిద్ధాంతం అనే వ్యాసంలో) 2 వ పేరాలో "సెంట్నర్ అంటే 110.28 పౌన్లు." అని వ్రాయబడింది. ఇదే విధంగా ఇంగ్లీషు మాతృకలో ఉంది. (పొలిటికల్ ఎఫెయిర్స్, ఫిబ్రవరి) కాని సోవియట్ యూనియన్‌లో ఉన్న మీట్రిక్ పద్ధతి ననుసరించి సెంట్నర్ అంటే. 220.4 పౌనులని స్పష్టం అవుతూ ఉంది. సోవియట్ యూనియన్ ప్రకటించిన బులిటెన్లలోనూ 1948 డిసెంబరు 23 వ తేదీ 'సోవియట్ ల్యాండ్' పత్రికలోనూ సోవియట్ పంటల అభివృద్ధిని గూర్చిన వ్యాసాలలో 10 సెంట్నర్లు ఒక మీట్రిక్ టన్ను అని వివరించబడింది.

దీనినిబట్టి 25 లక్షల ఎకరాలలో (10 లక్షల హెక్టార్లలో) సగటున ఎకరానికి 13200 పౌనుల పంట పండుతుంది. అంటే 100 శేర్ల బస్తాలు 6 (జొన్నలు) పండుతాయి. మనదేశంలో బాగా సారవంతమైన భూముల్లో మాత్రమే 6 బస్తాల జొన్నలు పండుతాయి. ఎకరానికి 10 లేక 20 శేర్లు జొన్నలుపండే భూములుకూడా లక్షలకొలది ఎకరాలు ఉన్నాయి.

సోవియట్ యూనియన్‌లో వ్యవసాయ పరిశోధనాక్షేత్రాల్లో ఆధునిక శాస్త్రీయపద్ధతుల ననుసరించి ఎకరానికి ఎంత పండించగలిగిందీ ఈక్రింద [illegible]రిస్తున్నాం. ఇట్టి 'రికార్డు' పంటలు సో[illegible]యట్ యూనియన్ అంతటా పండి[illegible]డానికి ఎంతో కాలంపట్టదు. ఎందు[illegible] అలాంటి శాస్త్రీయ పద్ధతులన్నిటిని [illegible] సమిష్టి వ్యవసాయక్షేత్రంలోనూ [illegible]బింపజేయడానికి సోవియట్ ప్రభుత్వ[illegible] సోవియట్ ప్రజలూ, సోవియట్ క[illegible]నిస్టుపార్టీ నిరంతరంకృషి చేస్తూఉన్నా[illegible]

పంటపేరు	హెక్టారుకు	ఎకరాని[illegible] బస్తాలల[illegible] (100 శేర్లు)
బియ్యం	168 సెంట్నర్లు*	67బస్తాలు
మొక్కజొన్న	209 ,,	83 ,,
జొన్న	200 ,,	80 ,,
శీతకాలపుగోధుమ	83 ,,	33 ,,
వేసవిగోధుమ	101 ,,	40 ,,
బార్లీ	110 ,,	44 ,,
ప్రత్తి	155 ,,	13640 పౌన్లు
బీట్రూట్ దుంప	1460 ,,	56 (మీ. టన్నులు)

* పది సెంట్నర్లు=1 మీట్రిక్ టన్ను =2200పౌన్లు =పదిబస్తాల గట్టిగింజాలు (బస్తా నూరుశేర్ల కొలత.) ఇవి అన్నీ ప్రపంచంలోనే రికార్డు పంటలని గుర్తించుకోవాలి.

(సంపాదకవర్గం - జనత)

BC1

BC

ఆధునిక పరికరములతో హాఫ్‌టో...

సినిమా స్లయిడ్స్, బ్రాస్ సైన్ బోర్డ్సు,

కలరు బ్లాకుసు వగైరాలు సకాలములో తయా...

స్వతంత్ర బ్లాక్ మేకింగ్ కంపెనీ.,
విజయవాడ.

20/390, ఏలూరురోడ్డు, బకింగ్‌హామ్‌పేట, (పి ఒ) విజయవాడ

(స్వతంత్ర టైప్ ఫౌండ్రీవారి ఆఫీసు ప్రకటన)

మా ప్రత్యేకతను

ఒకసారి పరీక్షించండి :: వివరములకు పై అడ్రసుకు వ్రాయండి

త్వరలో వెలువడుతోంది

నూతన ప్రజా తంత్రం కోసం

సోషలిజం కోసం పోరాటం

(వ్యూహం: ఎత్తుగడలకు సంబంధించిన కొన్ని సమస్యలు)

మీ మీ కాపీలకోసం

ముందుగానే త్వరపడండి

ప్రతులకు

లీలా బుక్ డిపో & అరుణా న్యూస్ ఏజెన్సీ

విజయవాడ 2

పీపుల్స్ పబ్లిషింగ్ హౌస్ :: మౌంటురోడ్, మద్రాసు

Edited, Printed & Published by

G. Venkateswara Rao Kottapet, Guntur, Printed at Kavitilaka Press, Vijayawada

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	TPLA134M120
పుస్తకం పేరు	జనత
తారీఖు	31/10/24
ముందు అట్ట	Yes
వెనుక అట్ట	Yes
మొత్తం పేజీలు	85
పెద్ద సైజు పేజీలు	No
ఖాళీ పేజీలు	CLIBCT
లేని పేజీలు	NO
తయారు చేసినది	Navya
పేజీలు విడదీసినది	Bhagy
స్కాన్ చేసినది	ch.Ramya
పరీక్ష చేసినది	RUKSANA
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	

70kH